RNI.No.TELTEL/2013/52694 Estd.: 2000 www.voodayam.com /voodayam /Voodayam




# ఉదయం




Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 || సంచిక : 293 || ఆదిలాబాద్ || గురువారం, ఏప్రిల్ 17, 2025 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12





# జైకాతో సీఎం రేవంత్ బృందం చర్చలు

- ఉన్నత యాజమాన్యంతో సమావేశం
- హైదరాబాద్‌ను న్యూయార్క్ స్థాయిలో అభివృద్ధి చేస్తాం
- అదే మా లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్యలు

హైదరాబాద్ : రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులను సమీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం జైకాతో చర్చలు జరిపింది. జపాన్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఉన్నత యాజమాన్యంతో సమావేశమైంది. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ షోహెయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని జైకాను కోరింది. పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సానుకూల విధానాలు,

ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా హైదరాబాద్ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ. 24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని జైకా బృందానికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం.. అంటే రూ.11,693 కోట్లు. రుణం అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా పాటిస్తుందని చెప్పారు. మెట్రో తో పాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరియు కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి కోరారు.

హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో లాంటి ప్రపంచ నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే తన ఆలోచనలను ముఖ్యమంత్రి వారితో పంచుకున్నారు. జైకాకు, తెలంగాణతో ఏళ్లకేళ్లుగా సంబంధాలున్నాయని జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ షోహెయ్ హరా అన్నారు. మెట్రో రైలు విస్తరణతో పాటు, అర్హతలున్న ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## పుప్పాలగూడ పరిసరాల్లో 450 ఎకరాల్లో

# ఐటీ నాలెడ్జ్ హబ్

- 5 లక్షల మంది యువతకు ఉపాధి ప్రభుత్వ లక్ష్యం
- మొదటి దశలో ఏర్పాటు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్ లోని పుప్పాలగూడ పరిసరాల్లో సుమారు 450 ఎకరాల్లో మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, పరిశ్రమల, రెవెన్యూ శాఖ కీలక అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. పుప్పాలగూడ పరిసరాల్లో ఎమ్మెల్యే లు, ఎంపీలు, ఐఏఎస్ అధికారుల కోసం ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయించింది. వీరితోపాటు రెవిన్యూ అధికారులు, స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ సొసైటీ తదితర సొసైటీలకు సుమారు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించింది. పుప్పాలగూడ పరిధిలో సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు సబ్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూమికి పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్ కు సంబంధించిన సుమారు 250 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లుగా అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తంగా మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి సుమారు 450 ఎకరాలు అందుబాటులో ఉంది అని చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటీ హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన జరిగింది, ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ ఏర్పాటయింది, ఆ తర్వాత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ రూపు దిద్దుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఇప్పుడు కూడా ఐటీ రంగంలో AI టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ ఆర్థిక అభివృద్ధిలో సుస్థిర స్థానాన్ని ఇప్పటికే సాధించింది, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని ఆర్థికవేత్తలు స్పష్టం చేసిన విషయాన్ని మంత్రులు చర్చించారు. అభివృద్ధిని కొనసాగించే క్రమంలో పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్ అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# నివేదిక ఇచ్చిన తర్వాత కూడా

- కేంద్రం ఎందుకు స్పందించటం లేదు
- హెచ్‌సీయూ భూముల్లో అర్ధరాత్రి బుల్డోజర్లు
- అయినా రేవంత్ సర్కార్‌ను కాపాడుతున్న ప్రధాని మోడీ
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు




హైదరాబాద్ : సెంట్రల్ యూనివర్సిటీ లో వేలాది చెట్లను నరికేశారని అక్కడ ఉన్న జంతువులకు నిలువ నీడ లేకుండా చేశారని, బడా ఆర్థిక మోసం జరిగిందని సెంట్రల్ ఎంపవర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హెచ్.సి.యూ భూముల్లో అర్ధరాత్రి బుల్డోజర్లను పంపి కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం చేసిందని ప్రవచనాలు చెప్పిన మోడీ, రాజ్యాంగాన్ని, చట్టాలను అపహాస్యం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కాపాడడానికి ఎందుకు ఆరాటపడుతున్నారని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో లేదంటే కేంద్ర సంస్థలతో రేవంత్ ప్రభుత్వ అక్రమాలపై విచారణ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆనాడు సిబిఐని కాంగ్రెస్ దుర్వినియోగం చేస్తే ఈనాడు ఈడిని బిజెపి విచ్చలవిడిగా వాడుతుందని విమర్శించారు. ఈ దేశంలో షి రాయింపుల సంస్కృతిని తీసుకువచ్చిందే ఇందిరా గాంధీ అన్న కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన, ఎజెండా తమకు ఎంత మాత్రం లేదన్నారు.రే

ంవంత్ రెడ్డి చేస్తున్న లుచ్చా పనులతో ప్రజల్లోనే తిరుగుబాటు వస్తుందన్నారు. రేవంత్ ప్రైవేటు సైన్యం లాగా పనిచేస్తున్న కొంతమంది పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదని కేటీఆర్ హెచ్చరించారు.

# దేశంలో కులగణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్ పై అక్రమ కేసులు

- రాహుల్ ని చూసి ప్రధాని మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నది
- దేశవ్యాప్తంగా ఈవీ మిషన్లు కాదు, బ్యాలెట్ పేపర్ కావాలన్న ఏఐసీసీ ప్లీనరీ నిర్ణయానికి బిజెపి భయపడుతున్నది
- ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్ ను గెలిపించుకుంటారు
- దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉన్నారు.
- బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ : ఏఐసిసి అగ్ర నేతలు సోనియా, రాహుల్ గాంధీ లపై అక్రమ కేసులు పెట్టి దేశవ్యాప్తంగా కులగణన జరగకుండా అడ్డుకోవాలని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ చూస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులోహా ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లనుహా ఛార్జ్ షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ గురువారంహా బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట టీపీసీసీహా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిహా భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలో జరిగిన ఏఐసిసి ప్లీనరీ సమావేశంలో ఏఐసిసి అగ్ర నేతలు రాహుల్ గాంధీ,హా మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో తీసుకున్న నిర్ణయాలను చూసి కేంద్రంలో ఉన్న బిజెపి, ప్రధాని మోడీ భయపడుతున్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేసి 56 శాతం బీసీలు ఉన్నారని, మిగతా వర్గాల సమాచారాన్ని కూడా లెక్కలతో సహా ప్రకటించి, ఎవరి దగ్గర ఆస్తులు, వనరులు ఉన్నాయో, ఏ వనరులు ఎవరికి పంచాలనేది లెక్కల ద్వారా స్పష్టంగా చెప్పడమే కాకుండా అమలు చేయబోతున్న ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న రాహుల్ గాంధీ పిలుపుకు మోడీ భయపడుతున్నాడని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కులగణన సర్వే దేశవ్యాప్తంగా చేయాలంటే ప్రధాని మోడీ స్నేహితులైన అంబానీ ఆదానీలకు దోచి పెడుతున్న దేశ సంపద, వనరులు ఇక ముందు తాడిత, పీడిత, అణగారిన వర్గాలకు చెందిన దేశ ప్రజలందరికీ పంచాల్సి వస్తేదేమో..?హా ఆ పరిస్థితి వస్తే కార్పొరేట్ సంస్థలతో బతుకుతున్న బిజెపి భవిష్యత్తు ఏమవుతుందో అన్న భయం పట్టుకొని, దేశంలో కుల గణన జరగకుండా అడ్డుకోవడానికి చేసిన కుట్రలో భాగంగానే ఏఐసిసి అగ్రనేతలు రాహుల్, సోనియాలపై అక్రమ కేసులు పెట్టారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. అదే విధంగా ఎఐసిసి ప్లీనరీలో అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దేశవ్యాప్తంగా ఈవీమిషన్లు కాదు, బ్యాలెట్ పేపర్ కావాలని అడిగారని గుర్తు చేశారు. దేశంలో




బ్యాలెట్ పేపర్ లేకుండా ఈవీ మిషన్ల ద్వారా చేస్తున్న కుట్రల వల్ల సామాన్యులందరికీ ప్రజాస్వామ్యంపై నమ్మకం పోతున్నదని, ఆ నమ్మకాన్ని కలిగించడం కోసం బ్యాలెట్ పేపర్లో తిరిగి తీసుకురావాలని ఎఐసిసి ప్లీనరీలో తీసుకున్న నిర్ణయానికి మోడీ ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో గుజరాత్ కు వస్తున్నాం కాచుకో నరేంద్ర మోడీ అని రాహుల్ చేసిన సవాల్ కు బిజెపి నాయకులు, ప్రధాని మోడీ భయపడి రాహుల్ గాంధీని అడ్డుకోవడానికి చేసిన కుట్రలో భాగంగానే అక్రమ కేసులను పెట్టి ఈ.డిహా విచారణ పేరిట వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

# పాలేరు కదం తొక్కాలే.. వరంగల్ దద్దరిల్లాలే..!

## తిరుమలాయపాలెం,



హైదరాబాద్ : బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగే బహిరంగ సభకు పాలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కదం తొక్కాలని.. గులాబీ సైన్యం కవాతుతో వరంగల్ దద్దరిల్లాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. రజతోత్సవ సభకు సన్నాహకంగా గురువారం సాయంత్రం తిరుమలాయపాలెం లో పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు గాలికి వదిలి, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన కేవలం ఏడాది లోనే ప్రజల్లో భ్రమలు తొలగిపోయాయని, బీఆర్ఎస్ ను దూరం చేసుకుని తాము ఏం కోల్పోయామో ప్రజలంతా గ్రహించారని అన్నారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో అత్యుత్సాహం ప్రదర్శించి, అడవులను ధ్వంసం చేసి సుప్రీంకోర్టు చీవాట్లు తినాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అత్యుత్సాహం చూపి.. కేసులు పెట్టి నిర్బంధాలకు గురిచేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు. వరంగల్ సభ తర్వాత బీఆర్ఎస్ పార్టీ సంస్థాగత నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించబోతోందని, సభ్యత్వ నమోదు, గ్రామస్థాయి కమిటీల నియామకం జరపబోతోందని అన్నారు. రజతోత్సవ సభను సక్సెస్ చేయడంలో పాలేరు నియోజకవర్గ పార్టీ శ్రేణులు ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు.

పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు రాజకీయాలకు అతీతంగా, ఎవరు వచ్చినా పనులు చేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనకు.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు మధ్య తేడా ఏంటో ప్రజలందరికీ అర్థం అయ్యేలా చెప్పాలని కార్యకర్తలకు సూచించారు. రజతోత్సవ సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

# సంపాదకీయం

## ప్రపంచ శాంతికి ట్రంప్ తూట్లు?

డొనాల్డ్ ట్రంప్ మళ్లీ అమెరికా అధ్యక్షుడిగా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచం ఒక అనూహ్యమైన ఉద్రిక్తతలోకి నెట్టబడింది. ఆయన ఆడంబరమైన ప్రకటనలు, దూకుడైన విధాన ప్రతిపాదనలు, సాంప్రదాయేతర దౌత్యపరమైన చర్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర స్పందనలను రేకెత్తించాయి. ఇరాన్‌పై, దాని అణుఆయుధ కార్యక్రమం కారణంగా బాంబుల వర్షం కురిపిస్తామని బెదిరించడం నుండి, రష్యాపై భారీ సుంకాలతో హెచ్చరించడం, గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో విలీనం చేయాలని ప్రతిపాదించడం,గాజా వంటి సంఘర్షణ ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మార్చాలని సూచించడం వరకు– ట్రంప్ రెండవ పదవీకాలం ప్రపంచ స్థిరత్వాన్ని సవాలు చేసే ఉద్విగ్న ప్రకటనలతో ప్రారంభమైంది. ఈ పరిణామాలతో దేశాలు జీర్ణించుకుంటున్న సమయంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ట్రంప్ బెదిరింపులు శత్రుదేశాలకు మాత్రమే పరిమితం కాదు. దీర్ఘకాల స్నేహిత దేశాలు కూడా ఆయన ఆర్థిక ఆగ్రహానికి గురవుతున్నాయి. రష్యాను ఎదుర్కోవడంలో నాటో వ్యూహాత్మక ప్రాముఖ్యత, చైనాకు ప్రతిబంధకంగా భారత్ పాత్రను దృష్టిలో ఉంచుకుంటే ఈ చర్య విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. ఎక్స్‌లోని పోస్టులు ఈ విషయంపై అవిశ్వాసం, ఆందోళనలను ప్రతిబింబిస్తున్నాయి. వినియోగదారులు 'రష్యాతో సరిహద్దు కారణంగా పోలాండ్‌ను లేదా చైనాతో సరిహద్దు కారణంగా భారత్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటుందా? అని ప్రశ్నిస్తున్నారు. ఈ అభిప్రాయాలు ఊహాజనితమైనప్పటికీ ట్రంప్ లావాదేవీ దృక్పథం పట్ల పెరుగుతున్న అసౌకర్యాన్ని సూచిస్తున్నాయి. ట్రంప్ ఎప్పుడు ఏం మాట్లాడతాడో, ఏం చేస్తాడో ఊహకు అందకుండా ఉంది. మంగోలియా గురించి ఇటువంటి చర్చలలో ప్రస్తావన, తక్కువ ప్రాముఖ్యత కలిగినప్పటికీ, ఒకే రకమైన భద్రతా తర్కాన్ని అన్నిటికీ వర్తింపజేయడం అసంగతతను హైలైట్ చేస్తుంది. రష్యా చైనాల మధ్య ఉన్న మంగోలియా తటస్థతను కాపాడుతూ వచ్చింది. అలాగే యుఎస్ జోక్యాన్ని సమర్థించే వ్యూహాత్మక ప్రాముఖ్యత కనపడటం లేదు. అయినప్పటికీ, ట్రంప్ ప్రకటనలు ఇటువంటి ఊహాగానాలకు ఆజ్యం పోస్తున్నాయి. గతం నుండి స్నేహంగా ఉన్న దేశాలతో కూడా విశ్వాసాన్ని క్షీణింపజేస్తూ, ఇతర దేశాలన్నీ ఆయన భౌగోళిక రాజకీయ ఆటలో పపెట్‌గా మారతామని భయపడుతున్నాయి. ఈ బెదిరింపుల తాకిడిలో, ఐక్యరాష్ట్ర సమితి భద్రతా మండలి తన శక్తిని కోల్పోయి, నిశ్శబ్దంగా ఉంది. దానికి ఉన్న ఆర్థిక వనరులను ట్రంప్ కట్ చేశారు. డిసెంబర్ 5, 2024న అట్లాంటిక్ కౌన్సిల్ హెచ్చరించిన ప్రకారం, ట్రంప్ చర్యలు అమెరికా ప్రపంచ నాయకత్వం నుండి వైదొలగడాన్ని సూచించవచ్చు. ఈ ఆందోళన 2025 లో ఆయన విధానాలు వెల్లడవుతున్న కొద్దీ మరింత తీవ్రమైంది. రష్యా, చైనా వీటో అధికారం కలిగిన శాశ్వత సభ్యదేశాలు, ట్రంప్ చర్యలు పాశ్చాత్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నప్పుడు ఆయనను ఖండించడానికి అవి తమ శక్తిని చూపించలేని దీనస్థితికి అవి చేరుకున్నాయి. ఉక్రెయిన్‌కు యుఎస్ సహాయాన్ని నిలిపివేయడాన్ని 'శాంతి వైపు ఒక అడుగు'గా మార్చి 4న 'ది గార్డియన్' లో ప్రశంసించింది. ట్రంప్ నాయకత్వంలో యుఎస్, మరొక వీటో శక్తికలిగిన సభ్యదేశం, స్వీయ–నియంత్రణ చేసుకునే అవకాశం లేదు. ఫ్రాన్స్, యుకెలను నాటోలో అమెరికా సైనిక సహాయంపై ఆధారపడే ఏకైక శాశ్వత సభ్య దేశాలుగా వదిలివేసింది.

ఈ స్తబ్దత విమర్శలను రేకెత్తించింది. మార్చి 2న 'ది కన్వర్సేషన్' పేర్కొన్న ప్రకారం, ట్రంప్ ప్రవర్తన ఐక్యరాజ్య సమితి సెక్యూరిటీ కౌన్సిల్ విశ్వసనీయతను అమెరికా క్షీణింపజేస్తోంది. చైనా, భారత్, రష్యా, కెనడా, యూరోపియన్ దేశాలు, ఇరాన్, లెబనాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు అమెరికాను ఒంటరిగా చేసి హాని చేయగలవా అనే ప్రశ్న ఆకర్షణీయమైనది? సంక్లిష్టమైనది కూడా! ఈ దేశాలు సమష్టిగా గణనీయమైన ఆర్థిక, సైనిక, దౌత్యపరమైన శక్తిని కలిగి ఉన్నాయి. డిసెంబర్ 5, 2024 ఫైనాన్షియల్ టైమ్స్ ఇంటర్వ్యూలో నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే పేర్కొన్నట్టు చైనా రష్యా మధ్య పెరుగుతున్న స్నేహ, సమన్వయం, ఇరాన్, ఉత్తర కొరియాతో బలపడి ఒక శక్తివంతమైన బ్లాక్‌ను ఏర్పర్చే అవకాశం ఉంది. చైనాతో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ భారత్ సంప్రదాయేతర సంఘీభావ చరిత్రను కలిగి ఉంది. సుంకాల ఒత్తిడితో యుఎస్ నుండి దూరమవవచ్చు. ట్రంప్ బెదిరింపులతో కలవరపడిన నాటో దేశాలు, మార్చి 4న ది గార్డియన్ ప్రకారం, ఇయు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ఎ 800 బిలియన్ రక్షణ బడ్జెట్‌ను ప్రతిపాదించడంతో స్వాతంత్ర్యం వైపు అడుగులు వేస్తున్నాయి. అయినప్పటికీ, ఐక్యత సాధ్యం కావడం కష్టంగా ఉంది. మార్చి 3న 'టైమ్' సూచించిన ప్రకారం, యుఎస్‌తో సన్నిహిత పొరుగు, ఆర్థిక భాగస్వామిగా ఉన్న కెనడా వ్యాపార స్థిరత్వాన్ని ప్రాధాన్యతగా చేసుకుని వ్యతిరేకతకు నాయకత్వం వహించే అవకాశం లేదు. లెబనాన్, అంతర్గత సంఘర్షణలలో చిక్కుకుని, అమెరికాను సమర్థవంతంగా సవాలు చేసే సామర్థ్యం లేకుండా ఉంది. ఉత్తర కొరియా ఒంటరితనం దాని ప్రభావాన్ని రెచ్చగొట్టడం వరకే పరిమితం చేస్తుంది. ఎక్స్‌లో ట్రెండింగ్ పోస్టులు ఈ విచ్ఛిన్నతను గురించి విచారం వ్యక్తం చేస్తున్నాయి. ఒక వినియోగదారు 'అమెరికాను ఓడించడానికి వారు ఏమీ చేయలేరా?' అని ప్రశ్నించారు. వాస్తవం ఏమిటంటే యుఎస్ డాలర్, మార్కెట్‌లపై ఆర్థికంగా ఆధారపడటం అమెరికాను ఒంటరిగా చేయడం కోసం ఏకీకృత ప్రయత్నాన్ని సంక్లిష్టం చేస్తుంది. ఫిబ్రవరి 21న ఫోర్బ్ విశ్లేషణ ప్రకారం, ట్రంప్ సుంకాలు అంతరాయం కలిగించినప్పటికీ ఈ ఆధారపడటాన్ని ఆయన ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటున్నాయి. ట్రంప్ వ్యూహం, భయం, ఆర్థిక ఒత్తిడి ద్వారా ప్రపంచాన్ని తన ఇష్టానికి లొంగమని ఒత్తిడి చేయగలదనే నమ్మకంతో అమెరికా ఉంది. ఇరాన్‌పై బాంబు దాడులు, రష్యాపై సుంకాలు, స్నేహిత దేశాలను బెదిరించడం వంటివి అమెరికా లాభం ఇతరులకు నష్టంగా ఉండాలనే శూన్య – సమీకరణ దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అయితే ఈ విధానం విఫలమయ్యే ప్రమాదం కూడా ఉంది. ఫిబ్రవరి 28న రెస్పాన్సిబుల్ స్టేట్ క్రాఫ్ట్ ఉక్రెయిన్, యూరప్‌ను దూరం చేయడం రష్యాకు వ్యతిరేకంగా యుఎస్ స్థానాన్ని బలహీనపరుస్తుందని హెచ్చరించింది.అదే సమయంలో మార్చి 1న న్యూస్‌వీక్ మాజీ యుఎస్ రాయబారి జాన్ బోల్టన్ ట్రంప్ పుతిన్‌తో సమన్వయాన్ని 'సిగ్గుచేటు' గా విమర్శించారు. మార్చి 3న వాషింగ్టన్ పోస్ట్ సుంకాల ఆర్థిక పరిణామాలను హైలైట్ చేసింది. యుఎస్ ఆర్థిక మాంద్యం గురించి భయాలను సూచిస్తూ మార్చి 9 'టైమ్' ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ బలహీనతను తోసిపుచ్చినప్పటికీ, అది ఆయన ప్రభావాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. అంతేకాక, జెలెన్స్కీని 'సర్వాధికారి' అని పిలవడం (ఫోర్బ్ ఫిబ్రవరి 21) లేదా యూరోపియన్ నాయకులను అవమానించడం వంటి ట్రంప్ విధానాలు అమెరికా ఎప్పటినుంచో ఆధారపడిన సాఫ్ట్ పవర్‌ను క్షీణింపజేస్తాయి. మార్చి 2న ది కన్వర్సేషన్ హెచ్చరించిన ప్రకారం, ఇది జపాన్, దక్షిణ కొరియా వంటి స్నేహిత దేశాలకు యుఎస్ హామీలు నమ్మదగినవి కావని సంకేతాన్ని ఇస్తున్నది. ఆసియాలో అణు వ్యాప్తిని ప్రేరేపించే అవకాశం ఉంది. అమెరికాను నమ్మకమైన భాగస్వామిగా కాకుండా లావాదేవీ దౌర్జన్యకర్తగా దేశాలు గ్రహిస్తే అవి రష్యా–, చైనా ఆకాంక్షను బలోపేతం చేస్తూ ప్రత్యామ్నాయ సమన్వయాలను వెతకవచ్చు. నిశ్శబ్దంగా ఉండడం ఒక ఎంపిక కాదు. అమెరికాతో సైనిక ఘర్షణ అసంభవమైనది, అవాంఛనీయమైనప్పటికీ, దేశాలు ట్రంప్ బెదిరింపులను సమన్వయ దౌత్యం, ఆర్థిక ప్రతిచర్యల ద్వారా ఎదుర్కోవాలి. ఫిబ్రవరి 28న న్యూస్‌వీక్ నివేదించిన ప్రకారం, ఓవల్ ఆఫీస్ వివాదం తర్వాత యూరోపియన్ నాయకులు జెలెన్స్కీకి వెంటనే మద్దతు ప్రకటించడం ఒక ఆదర్శంగా నిలుస్తుంది. పోలాండ్ డొనాల్డ్ ట్రంప్, జర్మనీ ఫ్రెడరిక్ మెర్జ్ ఉక్రెయిన్‌తో ఐక్యతను ప్రతిజ్ఞ చేశారు. ట్రంప్ ఒత్తిడిని ధిక్కరించే సంకల్పాన్ని సూచించారు. సుంకాల బెదిరింపులను ఎదుర్కొంటున్న భారత్, మార్చి 7న బిబిసి న్యూస్ ఊహించిన ప్రకారం, యుకె, యుఎస్ సుంకాల చర్చల మధ్య తన సొంత లెవీలతో ప్రతీకారం తీర్చుకోవచ్చు. ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి అడ్డంకుల్లో ఉన్నప్పటికీ యుఎస్ వీటో అధికారం వర్తించని జనరల్ అసెంబ్లీ ద్వారా చిన్న దేశాల స్వరాన్ని వినిపించగలదు. కెనడా, ఆస్ట్రేలియా, జపాన్, ఇయు వంటి మధ్యస్థ శక్తుల సమాహారం ఉద్రిక్తతను నివారిస్తూ, సార్వభౌమత్వాన్ని నొక్కిచెప్పే సమతుల్య ప్రతిస్పందనను రూపొందించవచ్చు. దీనికి విరుద్ధంగా, నిశ్శబ్దం ట్రంప్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేలా ప్రోత్సహిస్తుంది. ఒక విరామ బిందువు వచ్చేవరకు పరిమితులను పరీక్షిస్తుంది. డొనాల్డ్ ట్రంప్ రెండవ పదవీ కాలం అంతర్జాతీయ సంబంధాల పునాదులను సవాలు చేసే బెదిరింపుల తుఫానును విడుదల చేసింది. తెహ్రాన్ నుండి మాస్కో వరకు, గ్రీన్‌లాండ్ నుండి గాజా వరకు ఆయన మాటలు, చర్యలు యుఎస్ విధానంలో సమూలమైన మార్పును సూచిస్తున్నాయి. –ఇది సమష్టి స్థిరత్వంపై ఏకపక్ష లాభాన్ని ప్రాధాన్యతగా చేస్తుంది. అమెరికా శత్రువులు పెరుగుతూ, స్నేహిత దేశాలు సందిగ్ధంలో ఉండగా, ప్రపంచం విభజనలోనూ అనుసంధానంలోనూ ఉంది. ఈ రెచ్చగొట్టే వ్యక్తిని ఎదుర్కోవడానికి దేశాలు ఐక్యమవుతాయా లేక ఉద్రిక్తత తగ్గుతుందనే ఆశతో ఆయన ఆడంబరాన్ని సహిస్తాయా అనేది అనిశ్చితంగా ఉంది.అయితే ఒక విషయం స్పష్టంగా ఉంది. ప్రమాదాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే క్షీణిస్తున్న ప్రపంచ క్రమం ట్రంప్ ఈ ఆటను మరో నాలుగు సంవత్సరాలు నష్టం లేకుండా తట్టుకోలేదు.

# నిర్లక్ష్యపు నీడలలో శాతవాహనుల తొలి రాజధాని



అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు , శాత వాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహా రాష్ట్ర లోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతిపతిస" అను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగోబదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపురూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకంనిస" అని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ఠ దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిస్తున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది.

గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో అలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగానైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించుకోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తెరాస ప్రభుత్వంలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ చీఫ్ విప్ గా చేరాక, ఆయన చొరవ కృషి, కృత నిశ్చయం ఫలితంగా, పర్యాటక శోభను సంతరింప చేయాలనే తపన కారణంగా, 2018 జనవరి ఆరవ తేదీన నాటి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ల చేతుల మీదుగా రెండు బోట్లను ప్రారంభించారు.

50 సీట్ల కెపాసిటీతో "శాతకర్ణి", 25 సీట్లు కెపాసిటీ గల "పులోమావి" తో పాటు 4 సీటర్ల స్పీడ్ బోట్ ను ప్రారంభించారు. మంత్రిగా కొప్పుల ఈశ్వర్ హరిత హోటల్ ఏర్పాటు, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు చేపట్టడానికి కృషి చేశారు. మారిన ప్రభుత్వం, ప్రస్తుత రాష్ట్ర విప్, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేయూతను అందించి, పర్యాటక సంబంధంగా ఎంతో చేయాల్సి ఉంది. రాష్ట్ర చరిత్రతో విడదీయ రాని సహస్రాబ్దుల సంబంధాన్ని కలిగిన అపు రూప చారిత్రక బంధాన్ని తత్సంబంధ ఆధారాలను పరిరక్షించి, గోదావరి వద్ద రక్షణ గోడ నిర్మించి, కోటిలింగాల ఉనికిని కరుమరుగు కాకుండా ఉండ గలందులకు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి.

# దేవస్థానాలు ధర్మస్థానాలు కావాలి

భారతీయ సంస్కృతిలో దేవాలయాలు శాశ్వత విలువలకు నిలయాలు. ఇవి భక్తి, సంస్కృతి, సమాజ సేవకు కేంద్ర బిందువులుగా ఉన్నాయి. ఈ దేవస్థానాల నిర్వహణ, అభివృద్ధికి బాధ్యత వహించే వ్యక్తులు ధర్మకర్తలు. వీరి పాత్ర కేవలం నిర్వహణ పరంగా మాత్రమే కాక, సమాజ విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా ఉన్నదనేది మరువరాని విషయం. తెలుగు రాష్ట్రాల్లోని హిందూ దేవాలయాల ధర్మకర్తల నియామకాల్లో కొన్ని ఉమ్మడి అంశాలలో...ధర్మకర్తలు హిందువులై ఉండాలి. వారికి దేవాలయ వ్యవహారాల నిర్వహణలో ఆసక్తి, సామర్థ్యం ఉండాలి. సత్ప్రవర్తన కలిగి ఉండాలి. ఆర్థిక స్థిరత్వం కలిగి ఉండాలి. ధర్మకర్తల మండలి సభ్యుల సంఖ్య దేవాలయం యొక్క ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా 5 నుండి 15 మంది వరకు సభ్యులు ఉండవచ్చు. రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు) తప్పనిసరిగా ఉంటాయి. ప్రధాన అర్చకులు ఎక్స్–అఫీషియో సభ్యులుగా ఉంటారు. ధర్మకర్తల విధులు ఆయా దేవస్థానాల నియమ నిబంధనలపై ఆధార పడినప్పటికీ, కొన్ని సాధారణ ప్రమాణాలు ప్రతి ధర్మకర్తకు వర్తిస్తాయి. ముఖ్యంగా దేవస్థానం ఆస్తుల పరిరక్షణ, నిధుల పారదర్శక నిర్వహణ, పూజా విధుల పర్యవేక్షణ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన వంటి అంశాలు అత్యంత ప్రాధాన్యంగా నిలుస్తాయి. ఇవన్నీ The Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments Act, 1987 వంటి చట్టాల ఆధారంగా నిర్వర్తించాల్సినవే. ధర్మకర్తలు రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనబెట్టి, సమాజ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించాలి. కొన్ని సందర్భాలలో ధర్మకర్తల అధిక జోక్యం వల్ల మతపరమైన సంప్రదాయాలలో అంతరాయం కలగడం, పరస్పర అభిమత రాహిత్యం ఏర్పడడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇది నిష్పాక్షికతకు విఘాతం కలిగించే ప్రమాదం. తమ చర్యలకు, నిర్ణయాలకు జవాబుదారీగా ఉండటం, అవసరమైనప్పుడు వివరణ ఇవ్వడం ముఖ్యం. భక్తులందరినీ సమానంగా చూడటం, ఎటువంటి వివక్ష చూపకుండా వ్యవహరించడం అవసరం. దేవస్థానం యొక్క ముఖ్యమైన విషయాలపై సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకోవడం ప్రధానాంశం. విధులు అలాగే బాధ్యతలు స్థానిక చట్టాలు మరియు దేవస్థానం యొక్క ప్రత్యేక నియమాల ప్రకారం మారవచ్చు. కొన్ని పెద్ద దేవస్థానాలలో ధర్మకర్తల మండలి ఉంటుంది, వారు ఈ బాధ్యతలను పంచుకుంటారు. ఒక అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. చిన్న దేవస్థానాలలో ఒకే ధర్మకర్త లేదా కొద్దిమంది ధర్మకర్తలు ఈ బాధ్యతలన్నింటినీ నిర్వర్తించవలసి ఉంటుంది.దేవస్థాన నిర్వహణలో ధర్మకర్తల పాత్ర పర్యవేక్షణకు పరిమితం కావాలి. నిత్యపూజా విధుల నిర్వహణ, ఆలయ ఉద్యోగుల నియామకం వంటి మతపరమైన అంశాల్లో వారికి శాస్త్రోక్త ఆచారాలను గౌరవించే దృక్పథం అవసరం. ఆలయ ప్రధాన పూజారులు, ఆగమ శాస్త్ర నిపుణులతో సలహా, సహకారం తీసుకొని ముందడుగు వేయాలి. ఇక భక్తుల సహకారంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఆదాయ వ్యయాల సమాచారాన్ని ప్రజల ముందుంచే ప్రయత్నం చేయడం ద్వారా విశ్వసనీయత పెరుగుతుంది. ధర్మకర్తలు భక్తుల అభిప్రాయాలను వినడం, సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆలయాన్ని ఒక సమిష్టి ఆధ్యాత్మిక కేంద్రముగా మార్చగలుగుతారు. ధర్మకర్తల పదవి అధికార లక్షణములతో పాటు పెద్ద బాధ్యతను కలిగి ఉంటుంది. ఇది సేవకు మార్గదర్శకం కావాలి. ధర్మకర్తలు తమ పాత్రను నిష్పక్షపాతంగా, నియమాల ప్రకారం, మతపరమైన సంప్రదాయాలను గౌరవిస్తూ నిర్వర్తించినప్పుడే దేవస్థానాలు నిజంగా "ధర్మస్థానాలు"గా నిలుస్తాయి. వారు మితిమీరిన జోక్యం కాకుండా, నియమిత పరిమితులలోనే పర్యవేక్షణ చేస్తే... ఆ దేవస్థానం భక్తుల విశ్వాసానికి అర్హత గలదు.

# బౌద్ధస్తూపం స్థానంలో బుద్ధ విగ్రహం?

ధర్మపురి నియోజక వర్గంలోని పాషాయిగాం బౌద్ధ స్తూపం, రెండు దశాబ్దాల క్రితం ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకునికాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. అవిభక్త కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపానికి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తంభాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం "నాగ సింపీయకాయ, జమజో రాగ బ్రహ్మ లేఖలు", స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్న పూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్ట మౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించ బడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. ఇటీవలి కాలంలో బౌద్ధ స్తూపం స్థానంలో బుద్ధ విగ్రహం ఏర్పాటుకై తాజా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిర్ణయం గైకొన్నారు. వెల్గటూర్ మండలం కరీంనగర్ రాయపట్నం రాష్ట్ర రహదారిని ఆనుకొని ఉన్న పాషిగామ బౌద్ధ స్తూపం స్థానంలో సుమారు ఎకరం విస్తీర్ణంలో ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేసేందుకు గత మంత్రి వర్యులు కొప్పుల చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న బౌద్ధ స్తూపం ఉన్న స్థలాన్ని స్థానిక నాయకులు అధికారులతో కలిసి స్థల పరిశీలన జరిపారు. క్రీస్తుపూర్వం రెండో శతాబ్దం కాలంనాటి ఈ బౌద్ధ స్తూపం స్థానంలో 30 అడుగుల బుద్ధ విగ్రహం తోపాటు 25 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుతోపాటు ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఇదివరకే సమీక్షించారు. ఈ మేరకు ఢిల్లీలో ఈ విగ్రహాల తయారీ పూర్తయినట్లు ఆయన ప్రకటించారు. కాగా ఇక్కడ లభ్యమైన అవశేషాలతో ఇక్కడే పురావస్తు మ్యూజియం ఏర్పాటు చేసి ధ్యాన మందిరం ఇతర బౌద్ధ ప్రాధాన్యత ఉన్న నిర్మాణాలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరారు. ధర్మపురి, గూడెం గుట్ట, కోటిలింగాల ప్రాంతాల మధ్యలో ఉన్న ఈ చారిత్రక ప్రాంతంలో అభివృద్ధి చర్యలు చేపడితే పర్యాటక హబ్ లాగా ఏర్పడుతుందని స్థానికులు కోరారు. సాధ్యాసాధ్యాలను బట్టి పూర్తిస్థాయిలో తగిన చర్యలు తీసుకుంటామని నాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శతాబ్దాల చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకున్న సంతరించుకున్న బౌద్ధ స్తూపం ఉన్న స్థలంలో బుద్ద విగ్రహం ఏర్పాటు, మ్యూజియం విషయంలో ప్రస్తుత ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ చొరవ తీసుకుని ఈ ప్రాంత ప్రాచీనత్వ ప్రాధాన్యతను భావి తరాల ప్రజలు మరిచి పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రశ్నార్థకంగా వారసత్వ కట్టడాల మనుగడ

అంతర్జాతీయ మానవాళిని ఆకర్షిస్తున్న సహజ సిద్ధమైన లేదా మానవ నిర్మిత కట్టడాలు లేదా ప్రదేశాలను "వారసత్వ కట్టడాలు (హెరిటేజ్ స్ట్రక్చర్స్)" లేదా "స్మారక చిహ్నాలు (మాన్యుమెంట్స్)" లేదా" ప్రదేశాలు (సైట్స్)" అని పిలుస్తారు. అత్యంత పురాతన దేవాలయాల నుంచి అత్యద్భుత కట్టడాల వరకు అన్ని ప్రదేశాలు అనాదిగా మానవ నాగరికత చిహ్నాలుగా, గత వారసత్వ సంపద పునాదులుగా కొనసాగుతూనే ఉన్నాయి. వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు మానవ సమాజ మానసిక ఆరోగ్య ప్రదాతలుగా, మానవాళి గత చరిత్రకు సాక్షాలుగా గంభీరంగా నిలబడి ఉన్నాయి. మన పునాదులను పటిష్ట పరుచుకోవడం, వాటి భద్రతకు నడుం బిగించడం నేటి ఆలోచనాపరమైన మానవాళి కర్తవ్యం. మనం నివసిస్తున్న ప్రదేశానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వాటిలో పురాతన కట్టడాలు, గత వైభవం కలిగిన దేవాలయాలు, అద్భుత సహజ ప్రకృతి ప్రదేశాలు, మనం సగర్వంగా చెప్పుకునే వారసత్వ కట్టడాలు ఉంటాయి. మన వారసత్వ కట్టడాలు, ఆకర్షణీయ స్థలాల మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారడం, విపత్తులు/సంక్షోభాల విష వలయంలో చిక్కి విధ్వంసానికి గురి కావడం జరుగుతున్న వేళ, మన వారసత్వ నిర్మాణాలను కాపాడుకోవాలనే సదుద్దేశంతో "ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్" సంస్థ చొరవతో పాటు యునెస్కో సౌజన్యంతో ప్రతి ఏట 18 ఏప్రిల్ రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ స్మారక చిహ్నాలు–ప్రదేశాల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్)" లేదా " ప్రపంచ వారసత్వ దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే)" పాటించుట 1983 నుంచి కొనసాగుతున్నది. వారసత్వ కట్టడాలు, ఇతర ప్రజాదరణ పొందిన కట్టడాలు తరతరాలుగా మానవాళి విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక ప్రశాంతతను, పర్యాటకాన్ని అందిస్తూనే ఉన్నాయి. వీటిని అపురూపంగా కాపాడుకోవడం, వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవడం, మన సాంస్కృతిక వైభవ చిహ్నాలను సంరక్షించుకోవడం, వాటిని జాతీయ గుర్తింపు కలిగిన కట్టడాలుగా నిలబెట్టడం మన కనీస కర్తవ్యమని గమనించాలి. ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఏర్పడి 60 ఏండ్లు పూరితి అవుతున్న శుభ గడియల్లో 2025 అంతర్జాతీయ స్మారక చిహ్నాలు–ప్రదేశాల దినోత్సవ ఇతివృత్తంగా "విపత్తులు, సంక్షోభాలతో ప్రమాదంలో వారసత్వ కట్టడాలు – 60 ఏండ్ల ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ సంస్థ పకడ్బందీ కార్యాచరణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి సహజ విపత్తులు, మానవ సాయుధ సంక్షోభాలు, వాతావరణ ప్రతికూల మార్పులతో మన వారసత్వ కట్టడాల ఉనికి ప్రమాదపు అంచున నిలుస్తున్న వేళ ప్రభుత్వాలు, సంస్థలు, వృత్తి నిపుణ కళాకారులు, పౌర సమాజం, యువత చేయి చేయి కలిపి మన గత ఘన చరిత్రను కాపాడుకోవడం విధిగా జరగాలి. ప్రపంచవ్యాప్తంగా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదలు 1,092 ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 845 సాంస్కృతిక, 209 సహజ, 38 మిశ్రమ కట్టడాలు లేదా ప్రదేశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో అత్యధిక వారసత్వ కట్టడాల్లో ఇటలీలో 54, చైనాలో 53, స్పెయిన్‌లో 47, జర్మనీలో 44, ఫ్రాన్స్‌లో 44, ఇండియాలో 43 ఉన్నాయి. 2024లో భారతంలో 43వ యునెస్కో గుర్తింపు పొందిన కట్టడంగా అస్సాంలోని "మెయిడమ్ –అహోం రాజవంపు కట్టడం" జాబితాలో చేరింది. మన దేశంలోని యునెస్కో గుర్తింపు పొందిన 43 కట్టడాల్లో ముఖ్యమైనవిగా అజంతా గుహలు, ఎల్లోరా గుహలు, ఆగ్రా కోట, తాజ్‌మహల్, కోనార్క్ సూర్య దేవాలయం, మహాబలిపురం, కాజిరంగా నేషనల్ పార్క్, ఖజురాహో స్మారక చిహ్నం, ఫతేపూర్ సిక్రీ, కుతుబ్ మినార్, ఢిల్లీ ఎర్ర కోట, రామప్ప దేవాలయం, శాంతినికేతన్ లాంటివి ఉన్నాయి. మన పునాదులను కాపాడుకుంటూ, గత వైభవ చిహ్నాల నుంచి ప్రేరణ పొందుతూ, వాచి నుంచి విజ్ఞానాన్ని జుర్రుకుంటూ, పర్యాటక ప్రదేశాలుగా తలచి మానసిక ప్రశాంతతను పొందుతూ భాధ్యతాయుతంగా కొనసాగుదాం. మన వారసత్వ మనుగడను మనమే సంరక్షించుకుందాం.



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు పిలుపు



గద్వాల ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి) మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వివి నరసింహ, జి రాజు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను పిలుపునిచ్చాయని తెలిపారు ఈ సమ్మెకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రైతు సంఘం సంపూర్ణ మద్దతు నిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలకు సవరణలు చేస్తూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఉపాధి హామీని దూరం చేస్తూ, రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశ సహజ సంపదను కొంతమంది పెట్టుబడి దారులకు అప్ప జెప్పి కార్మికులు, కర్షకులు, రైతాంగాన్ని యాజమాన్యాలకు బానిసలుగా చేసే విధానాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని కార్మికులు కర్షకులు ఉపాధి కూలీలు మే 20న పని బంద్ చేసి సార్వత్రిక సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జయన్న, పాల్గొన్నారు.

# వేసవిలో త్రాగునీరు అందించేందుకు తగిన ఏర్పాట్లు,

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి,

## జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి) గురువారం నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వేసవిలో త్రాగునీరు, అంశాల పై అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం , సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ..........

జిల్లా వ్యాప్తంగా 754 హబిటేషన్ కేంద్రాలకు గాను 739 కేంద్రాలకు గ్రిడ్ ద్వారా వాటర్ సప్లై చేస్తున్నట్లు, 15 (పదిహేను) ఐసోలేటెడ్ కేంద్రాలకు లోకల్ సోర్స్ ద్వారా సోలార్ కరెంటు ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో త్రాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఆదేశించారు. వేసవి లో త్రాగునీటిపై కార్యాచరణ ప్రణాళిక ప్రకారం మున్సిపల్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ మరియు, మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (%వీూణూ%లు) గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీరు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా త్రాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరుల ద్వారా సరఫరా చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ఏప్రిల్, మే, నెలల్లో వేసవి తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, అందుకు తగిన ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని అధికారులకు సూచించారు. నీటి ట్యాంకర్ల ఏర్పాటు, మరమ్మతులు అవసరమైన పైపులైన్ల గుర్తింపు మరియు వాటిని వెంటనే మరమ్మత్తులు చేపట్టడం, అదనపు నీటి వనరుల గుర్తింపు వంటి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న బోర్ వెల్ లని ఉపయోగంలోకి తీసుకురావాలని, గ్రామాల్లో ఎక్కడ కూడా నీటి నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ పరిధిలోని నీటి వనరులు, సరఫరా వ్యవస్థ మరియు సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలపై నివేదికను సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్రాగునీటిని అందించేందుకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సూచించారు.

తదనంతరం ఇందిరమ్మ ఇండ్ల గురించి సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించి మాట్లాడుతూ %ొూ%.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరతగతిన ఇళ్ల నిర్మాణ%శీ% చేపట్టేలా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం మొదటి దశలో పునాది నిర్మాణం కొరకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని లబ్ధి దారులకు తెలియజెప్పాలని సూచించారు. ఎటువంటి పైరవీలకు తావు లేకుండా పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులు నిర్వహించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు అప్లై చేసుకున్న దరఖాస్తులను పూర్తి స్థాయిలో లోతుగా పరిశీలించాలన్నారు. ఏట్టి పరిస్థితుల్లోనూ అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని అధికారులకు గుర్తు చేశారు. ఇల్లు మంజూరైన వారందరు వెంటనే నిర్మాణాలు ప్రారంభించేలా తగిన తోడ్పాటును అందించాలన్నారు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వారు నిర్దేశిత గడువులోపు, నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో నిర్మాణ పనులు పూర్తి చేసుకునేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. వివిధ కారణాల వల్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేకపోయిన లబ్దిదారులను కలిసి, వారికి ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక తోడ్పాటు మహిళా సంఘాల ద్వారా రుణ సౌకర్యం అందేలా ఏర్పాటు చేయాలని, దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు అవసరమైన ఇసుకను లబ్ది దారులకు అందేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్దేశిత గడువు లోపు నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ చూపాలని, నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,సూచించారు.

ఈ కార్యక్రమంలో , %ణ=ణూ% చిన్న ఓబులేసు, డిపిఓ, మిషన్ భగీరథ అధికారులు, %ఓజూ% డిప్యూటీ సీఈఓ గోపాల్, ఆర్ డి వో లు, , ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాటూరు ఉన్నత పాఠశాలకు గోడగడియారం అందజేసిన కరాటే మాస్టర్ కళ్యాణ్



మధిర ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి) మోటమర్రి గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ కళ్యాణ్ మాటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి ద్వారా పాఠశాలకు 2వేల రూపాయల విలువైన గోడగడియారం ఉచితంగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎమ్ శ్రీ హరి మాట్లాడుతూ కళ్యాణ్ నిరుద్యోగి ఐనప్పటికి తను నేర్చుకున్న కరాటే ద్వారా జిల్లా లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాల,బాలికలకు ఆత్మరక్షణ విద్యను సులువైన పద్ధతిలో చక్కని తర్ఫీదు అందిస్తున్న కళ్యాణ్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. పాఠశాలకు ఉపయోగపడే గోడగడియారం వితరణగా అందించినందుకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నదానిలోనే పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేస్తున్న కళ్యాణ్ రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దీవి సాయి కృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు ,కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, బొగ్గుల శ్రీనివాస రెడ్డి, లావుడ్య రవికుమార్, ప్రసాద్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి శెట్టి కిషోర్



మధిర ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి)సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్ అన్నారు. మధిర మండల కాంగ్రెన్ పార్టీ కార్యాలయంలో మధిర నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన మధిర మండల పరిధిలోని లబ్ధిదారులకు 6 లక్షల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మధిర, మల్లారం, రొంపి మల్ల, దెందుకూరు, సిరిపురం, గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సూరం శెట్టి కిషోర్ మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. లబ్ధిదారులు వైద్య సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్,మండల కిసాన్ సేల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు చిలివేరు బుచ్చిరామయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, నిడమనూరు వంశీకృష్ణ,పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, కాంగ్రెస్ నాయకులు ఆదూరి శీను, బోడెపుడి గోపి, కోట డేవిడ్, సంపసాల రామకృష్ణ, మోదుగు బాబు, యన్నం కోటేశ్వరరావు, ఎర్రగుంట రమేష్, ఆవుల కిరణ్, ఆవుల శీను, పగిడిపల్లి డేవిడ్, దూదేకుల జానీ తదితరులు పాల్గొన్నారు

# నీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతిపత్రం...



కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 17,(వుదయం ప్రతినిధి),కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ భౌరంపేట్ బిఅర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ను, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారంలో ఒక్క రోజు కూడా సరిగ్గా సరఫరా కావడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా వారు స్పందించి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. రెండు మూడు రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బిఅర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బెంబేడి బుచ్చిరెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మన్నె శేకర్ ముదిరాజ్, కటకం వీరేశ్, గోపాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

## సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్.



ఏప్రిల్ 17 భూపాలపల్లి వుదయం ప్రతినిధి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డానియల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నటువంటి అన్ని మండలాల్లో అకాల వర్షంతో వరి మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయినారు వరి ధాన్యం తడిసి ముద్దయినది మొక్కజొన్న మొత్తం కింద పడిపోయింది తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎకరానికి 25 వేల రూపాయల పంట నష్టపరం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం తక్షణమే జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లాలో ఉన్నటువంటి అన్ని మండలాలలో గ్రామాలలో పంటనష్టపోయిన రైతులను ఆదుకునే విధంగా సర్వేలు నిర్వహించి నష్టపోయిన రైతులను గుర్తించి పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు ఒకపక్క కెనాల్ పక్కన ఉన్నటువంటి భూములకు నీళ్లు అందక ఎండిపోతున్నాయి డిబిఎం 38 ద్వారా నీళ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఇవ్వలేదు ఉమ్మడి వరంగల్ జిల్లా అయినా దేవాదుల ప్రాజెక్టు ఉన్న కాలేశ్వరం ప్రాజెక్టు ఉన్న కెనాల్ పక్కన ఉన్నటువంటి రైతులకు సుక్కనీళ్లు మాత్రం అందడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే నీళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో శంకర్ అంకుష్ డానియల్ పాల్గొన్నారు.

# భీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి) ఛలో వరంగల్ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు మహాదేవపూర్ మండలం నుంచి గులాబీ శ్రేణులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని బిఆరెస్ పార్టీ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు.గురువారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని గ్రామాలలోని బీర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సభ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆరెస్ పార్టీ మంథని నియోజకవర్గం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు వరంగల్ బహిరంగ సభ వాల్ పోస్టర్ను ఆవిష్కరించడం జరిగిందని అన్నారు టిఆర్ఎస్ పార్టీ గా పుట్టి 24 సంవత్సరాలు పూర్తి చేసుకొని ప్రస్తుతం 25 సంవత్సరం లో విజయవంతంగా అడుగు పెడుతున్న సందర్భంగా అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఎప్రిల్ 27 న నిర్వహించబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు,ఏప్రిల్ 27 గులాబీ పార్టీ పండుగ రోజని, ఆ రోజు గ్రామ గ్రామాన గులాబీ జెండాలు రెపరెపలాడాలని తెలిపారు,మండలాలంలోని ప్రతి గ్రామంలో భీఆర్ఎస్ కార్యకర్తలు గులాబీ జెండా ను ఆవిష్కరించాలన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమవుతోంది. హామీల అమలు దగ్గర నుంచి, పాలనా పరమైన నిర్ణయాల వరకు అభాసుపాలవుతోందని విమర్శించారు కేసీఆర్ స్పీచ్ కోసం ప్రజలంతా ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారన్నారు, ఎప్పటికైనా తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు, ఈనెల 27న వరంగల్ లో జరగనున్న భీఆర్ఎస్ రజతోత్సవ సభకు సకాలంలో చేరుకునేలా అంతా సిద్ధం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అలీమ్ ఖాన్, కూరాతోట రాకేష్, వంశి వర్ధన్ రావు, తోపాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థుల నమోదు పెంచండి:

## మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్



మధిర ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి) మాటూరు ఉన్నత పాఠశాల లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీహరి ఆధ్వర్యంలో పాఠశాల సముదాయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ హాజరై, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటి నుండే బడిబాట నిర్వహించి , పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచాలని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని, బోధనాభ్యసన సామాగ్రి తో బోధన సులువు అవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీహరి చొరవతో, కాంప్లెక్స్ నిధులు నుండి 22,500 ప్రతి పాఠశాల కు రూ 2500 విలువ గల బోధనాభ్యసన సామాగ్రిని కొనుగోలు చేసి,మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ చేతులు మీదుగా కాంప్లెక్స్ పరిధిలో ని తొమ్మిది పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలో ని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆకాల వర్షం కారణంగా నష్టపోయిన వరి మొక్కజొన్న మిర్చి రైతులను ఆదుకోవాలి

## బి .ఎస్. పి. జిల్లా అధ్యక్షులు పొన్నం. బిక్షపతి గౌడ్.



ఏప్రిల్ 17 భూపాలపల్లి వుదయం ప్రతినిధి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో గత మూడు రోజులుగా ఆకాల వర్షం వడగళ్ల వానకు కోతకు వచ్చిన వరి పంట మొక్కజొన్న మిర్చి పంటలకు తీవ్ర నష్టం జరిగిందని ఆరుగాలం కష్టించిన రైతుల రెక్కల కష్టం పోయి పెట్టిన పెట్టుబడి వస్తాదో రాదో అని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారని మార్కెట్ కు వెళ్లే సమయంలో వడగళ్ల వాన మిగిల్చిన దుఃఖ%శీ% వర్ణనాతీతంగా ఉందని గ్రామాల పర్యటనలో భాగంగా

బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టేకుమట్ల మండలం దుబ్యాల గ్రామాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించిన రాష్ట్ర ఈసీ మెంబర్ సంగి రవి బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ పంటలు నష్టపోయిన స్థానిక రైతులు ఆరుముళ్ళ సమ్మయ్య కౌలు రైతు సంగి మల్లయ్య శనిగారపు సారయ్య గసిగంటి రమేష్ సంగి కొమురయ్య సంగి సురేష్ లతో కలిసి పరిశీలించిన అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంరైతులను కష్టకాలంలో ఆదుకోవాల్సిన అవసరం ఉన్నది అని"ఎద్దు ఏడ్చిన వ్యవసాయంరైతు ఏడ్చిన రాజ్యం నిలబడదని " అన్నారుస్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు గారు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షం వడగళ్ల వానకు నష్టపోయిన రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన అవసరం ఉన్నదని లేనియెడల నష్టపోయిన రైతులతో కలిసి పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో టేకుమట్ల మండల అధ్యక్షులు సంగి రవివర్మ మండల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు .

# నేడు అజిలాపూర్ లో వెంకటరమణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



వెల్దండ ఏప్రిల్ 17 (వు దయం ప్రతినిధి)నేడు మండల పరిధిలోని అజలాపూర్ గ్రామంలో కల్వకుర్తి వెంకటరమణ ఆసుపత్రి డాక్టర్ విరమళ్ళ శరత్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని శిబిరం ఇన్చార్జి ఎస్బిహెచ్ మేనేజర్ ఆంజనేయులు ఫిజియోథెరపీ డాక్టర్ నాగరాజు లు ఒక ప్రకటనలో తెలిపారు డాక్టర్ శరత్,డాక్టర్ రంజిత్ కుమార్ నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు అజిలాపూర్ గ్రామానికి చెందిన వాస కుటుంబ సభ్యులు కోరిక మేరకు వెంకటరమణ హాస్పిటల్ కల్వకుర్తి ఆసుపత్రి వైద్యులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు వెంకటరమణ హాస్పిటల్ మార్కెట్ మేనేజర్ రాజేష్ తెలిపారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రి శిబిరంలో గుండెకు సంబంధించిన 2%ణ వఎష్ట్రశీ% , ఈసీజీ, %+=దీూ% పరీక్షలు చేయబడును వెంకటరమణ హాస్పిటల్ వారి వైద్యులు షుగర్ , బిపి, థైరాయి డ్, గ్యాస్ ట్రబుల్ ,విష జ్వరాలు మలేరియా , చిన్నపిల్లలకు దగ్గు, జలుబు ,జ్వరం ,నిమోనియా మరియు ఫిజియోథెరపీ, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, మెడ నొప్పులు, నడుము నొప్పులు, పక్షవాతం, సంబంధించిన వైద్య సమస్యలు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు

# ఐదు నెలల స్కావెంజర్ల వేతనాలు విడుదల

నారాయణఖేడ్, ఏప్రిల్16వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలోని 1,213 పాఠశాలలకు రూ. 3. 58 కోట్ల నిధులను విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్ల వేతనాల కోసం ఈ నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. ఐదు నెలల వేతనాలను వెంటనే స్కావెంజర్లకు చెల్లించాలని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకుడికి నివాళి

మక్తల్, ఏప్రిల్16వుదయం ప్రతినిధి):మాగనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ సోదరుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించాడు. మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసు రాజకీయ ప్రతీకారమే!

- కేంద్రంలోని బీజేపీ దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రతీకారానికి దిగుతోంది.
- నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లు చార్జిషీట్‌లో పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : నాయిని

హనుమకొండ, ఏప్రిల్ 17(వుదయం జిల్లా ప్రతినిధి) : హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎం.ఎల్.ఏ నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ రోజు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట అశోక జంక్షన్లో నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గారిపై బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా చార్జిషీట్ లో పేర్లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ సర్కారు దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రతీకారాలకు వాడుకుంటోందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ.. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రతీకారానికి దిగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. సోనియా, రాహుల్, ఇతర అగ్రనేతలపై చార్జిషీట్ దాఖలు చేయడం అనేది ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేయడమే" అని అన్నారు. ఈ చర్య.. ప్రజాస్వామ్యబద్ధమైన విపక్ష పార్టీపై దాడి అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఈ చర్యలను చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ పత్రికకి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగలేదన్నారు.



మోడీ హవా తగ్గుతున్న క్రమంలో రాహుల్ గాంధీ ఇమేజ్ ను బద్నాం చేసేందుకు అక్రమ కేసులు బనాయిస్తున్నారని గాంధీ కుటుంబం ఏనాడు కేసులకు భయపడింది లేదన్నారు.

రాహుల్ గాంధీ ఒక ఫైటర్ అని ఆయన దేశ ప్రజల గొంతుక అన్నారు. కుల గణనతో రాహుల్ గాంధీ మోడీకి రాజకీయ మరణ శాసనం రాశారని బీహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీ, సోనియా గాంధీపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు ఎన్నికలు రాగానే ప్రతి పక్షాలపై ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను వాడడం మోడీ, అమిత్ షాకు అలవాటుగా మారిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏం.పి. కావ్యా, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈ.వి. శ్రీనివాస్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, మామిండ్ల రాజు, ఇనుగుల మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ ఏ. నాగరాజు, పులి రాజు, బంక సరళ, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, బొమ్మతి విక్రం, అంబేద్కర్ రాజు, గుంటి స్వప్న, రహీమున్నిస్సా బేగం, నాయిని లక్ష్మా రెడ్డి, బంక సంపత్ యాదవ్, పల్లె రాహుల్ రెడ్డి, అలువాల కార్తిక్, తోట పవన్, పల్లకొండ సతీష్, మహమ్మద్ ఖుర్షీద్, కొంటె సుకన్య, మాదిశెట్టి సతీష్, లహరి, గాండ్ల స్రవంతి, లహరి, బైరబోయిన రమేష్, నేహాల్, ఇప్ప శ్రీకాంత్, ఎస్. కుమార్ యాదవ్, ఓరుగంటి పూర్ణ శ్రీదర్ యాదవ్, హరిసింగ్, తడక సుమన్, మధు, సంగీత్. దొంగల కుమారస్వామి, సిరిల్ లారెన్స్, ఝాన్సి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య రక్షణే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ లక్ష్యం

## –కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ బానోత్ రూప్ సింగ్



కొత్తగూడ ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి) :రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ బానోత్ రూప్ సింగ్ అన్నారు. గురువారం మండలం లోని దొరవారి వేంపల్లి, చెరువు ముందు తండా, వెలిబెల్లి గ్రామంలోమంత్రి సీతక్క ఆదేశాల మేరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. అనంతరం డా, బి. ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడాబాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గాంధీ అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చల్ల నారాయణరెడ్డి, కొత్తగూడ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు సుంకర బోయిన మొగిలి. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లావణ్య వెంకన్న.కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్.మాజీ ఎక్స్ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య.బొల్లు రమేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్.కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్,వేలుబెల్లి మాజీ సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్,కొత్తగూడ కాంగ్రెస్ బ్లాక్ కార్యదర్శి కాయితోజు ఉపేంద్ర చారి.కొత్తగూడ టౌన్ ఉపాధ్యక్షులు వెలుదండి వేణు.జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు నోముల ప్రశాంత్ యాదవ్. రాజు, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దుద్దెడలో కరాటే బెల్ట్ టేస్ట్ ల నిర్వహణ



కొండపాక ఏప్రిల్16(వుదయం ప్రతినిధి): మండల పరిధిలోని దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం రోజు కరాటేలో బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ అయినా తిరుపతి నర్సింలు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేడింగ్ టెస్ట్ లోమంచి ప్రతిభ కనబరిచిన ఎం.డి సోయల్ , ఏ. గౌరీ ప్రసాద్ లు బ్రౌన్ బెల్టు కైవసం చేసుకోగా మిగతా కరాటే విద్యార్థుల్లో 10 మంది ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, మెరూన్ బెల్టులు సాధించారు. కరాటేలో నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పచ్చిమడ్ల మానస గౌడ్ చేతుల మీదుగా బెల్టులను ఉత్తరము ఆమె మాట్లాడుతూ కరాటే విద్య ఆత్మ రక్షణకోసం చాలా ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కరాటే కళ అనేక దశాబ్దాలుగా ప్రాచుర్యం పొందిందని అన్నారు. ఈ రోజుల్లో ముఖ్యంగా ఆడపిల్లలకు ,మహిళలకు కరాటే నేర్పడం వల్ల ఆత్మ రక్షణ తో పాటు మానసిక ధైర్యాన్ని కూడా అందిస్తుందని అన్నారు. శత్రువుల నుంచి తమను తాము కాపాడుకోవడానికి కరాటేను సాధన తప్పకుండా చేయాలని సూచించారు. కరాటే సాధన వల్ల ఆరోగ్యం, శరీర దృడత్వం కలుగుతుంది అన్నారు. గ్రేడింగ్ టెస్టులో బెల్టులు పొందిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ మున్ముందు ఇంటర్నేషనల్ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# భూభారతి పోర్టల్ దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తుంది

నారాయణపేట టౌన్ ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి) దేశంలో భూభారతి చట్టం రోల్డ్ మోడల్ గా నిలుస్తుందని రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, పౌర సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి రైతుకు భరోసా, భద్రత కల్పించాలని ఎన్నో రాత్రులు నిద్ర పోకుండా మేధావులతో కలిసి భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. భూభారతి చట్టం పై అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సు కు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టానికి, భుభారతి చట్టానికి ఎంతో తేడా ఉందని, భూభారతి చట్టం రైతు భూ సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. తమ భూములు ధరణి వల్ల ఇంకా తమ పేరిట నమోదు కాలేదని ప్రతి పక్ష శాసన సభ్యులే అసెంబ్లీలో తనను అడిగారని, కానీ ప్రతి పక్ష నేత శాసన సభలో భూభారతి చట్టానికి ఆమోదం తెలపకుండా అడ్డుపడ్డారని విమర్శించారు. ధరణి చట్టం వల్ల ప్రజలు అధికారుల వద్దకు వెళ్లాల్సి ఉండేదని, కానీ భూభారతి చట్టం వల్ల ప్రజల వద్దకే అధికారులు వారి వారి గ్రామాలకు వచ్చి ఒక్క రూపాయి తీసుకోకుండా భూ సమస్యలను పరిష్కరిస్తారని మంత్రి తెలిపారు. రైతుకు,భూమికి మధ్య ఉన్న బంధాన్ని ఈ చట్టం ధృడం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ధరణితో వేలాది ఎకరాలను కొల్లకొడితే, భూ భారతి ద్వారా అర్హులైన పేదలకు భూములు పంచాలనే ఆలోచన తమ ప్రజా ప్రభుత్వానిది అన్నారు. అసైన్డ్ భూములకు కూడా హక్కులు కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, వీఆర్ఏ వీఆర్వో వ్యవస్థను కుప్ప కూల్చిందని, కానీ





ఈ ప్రజా ప్రభుత్వంలో గ్రామానికి ఒక రెవిన్యూ అధికారిని నియమించి, అర్హులైన వారిని మళ్లీ తీసుకువచ్చి గ్రామాల్లో ఇలాంటి భూ సమస్య ఉన్నా అక్కడే పరిష్కారం చూపిస్తామన్నారు. కోర్టులో లేని ప్రతి భూ సమస్యను పరిష్కరించడమే భూభారతి ముఖ్య ఉద్దేశమన్నారు. ఎవరి పేరుతో ఎంత భూమి ఉందో అది వారికే చెందేలా చూస్తామన్నారు. మొదటి విడత 6 వేల మంది లైసెన్స్ డ్ సర్వేయర్లను ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇచ్చి మ్యాప్ పై సర్వేయర్ సంతకంతో కంప్యూటర్ లో అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో, మనస్సాక్షిగా పేదవారికి మేలు చేయాలని అద్భుతమైన ఈ చట్టాన్ని చేసుకున్నామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే కలెక్టర్లను పిలిచి భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని స్పష్టంగా చెప్పారన్నారు. మొదటగా 4 మండలాలను పైలెట్ గా తీసుకున్నామని, మే 1 నుంచి రాష్ట్రంలోని అన్ని మండలాలకు జిల్లా కలెక్టర్లు వెళ్లి ఈ చట్టం గురించి ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అయితే జూన్ 2 లోపు ఎంపిక చేసిన మొదటి నాలుగు పైలెట్ గ్రామాల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇదే పద్ధతిలో అధికారులే రైతుల వద్దకు వస్తారన్నారు. భవిష్యత్తు లో ఇబ్బందులు రాకుండా ప్రతి రైతుకు పూర్తి భద్రత కల్పిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. తాము అమలు చేస్తున్న కొత్త భూభారతి చట్టాన్ని ప్రతిపక్షం లో ఉన్న వాళ్లు కూడా వినియోగించుకోవచ్చని మంత్రి సూచించారు. తమ భూ సమస్యల గురించి తనతో చెప్పిన ప్రతి పక్ష ఎమ్మెల్యేలు, చెప్పని వారు కూడా కొత్త చట్టం వినియోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవచ్చని సలహా ఇచ్చారు. ధరణితో ప్రజలకు ఎంతో ఘోష పెట్టారో భూ భారతి అమలు లోకి వచ్చిన తర్వాత తెలుస్తుందన్నారు. ప్రభుత్వం ఏదైనా మంచి పని చేస్తే మంచి చేసిందని చెప్పకపోయినా పర్వాలేదు కానీ మంచిని చెడుగా చెప్పి ప్రచారం చేస్తే మాత్రం ప్రతిపక్షానికి వచ్చే ఎన్నికలలో రెండు అంకెల సీట్లు కూడా రావని, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల మాదిరిగా శాసన సభ ఎన్నికలలో రిపీట్ అవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముందు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ధరణి స్థానంలో సరళమైన భూ భారతి పోర్టల్ ను ఈ నెల 14 న ప్రారంభించిందని, అందులో భాగంగా నారాయణ పేట జిల్లాలోని మద్దూరు మండలాన్ని పైలెట్ మండలము గా ఎంపిక చేసిందని తెలిపారు. భూ పరిపాలనలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పోర్టల్ ను జిల్లా అధికార యంత్రాంగం, ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తామని చెప్పారు. సమస్యల తక్షణ పరిష్కారంలో భాగంగా తీసుకొచ్చిన ఈ సంస్కరణలు అమలు చేసేందుకు నారాయణపేట జిల్లాకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీ, రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా ప్రజల తరపున కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యే లు డాక్టర్ వాకిటి శ్రీహరి, డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి, బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతాదయాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి, భూభారతి ప్రత్యేక అధికారి యాదగిరి, ప్రిన్సిపల్ సెక్రెటరీ రెవిన్యూ శాఖ, జ్యోతి బుద్ధ ప్రకాష్ ఐ ఏ ఎస్, ప్రిన్సిపాల్ సెక్రటరీ రెవిన్యూ శాఖ,సీసీ ఎల్ ఏ సెక్రెటరీ మంద మకరంద్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్,జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, న్యాయవాది భూమి సునీల్, ఆర్డీఓ రామచందర్ నాయక్, డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి,మద్దూరు సింగిల్ విండో చైర్మన్ నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం, రెవిన్యూ అవగాహన సదస్సులో సంగారెడ్డి కలెక్టరం

ఆందోల్, ఏప్రిల్16(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మక కార్యక్రమం భూభారతి చట్టం –2025 అవగాహన సదస్సు గురువారం సదాశివపేట మండల కేంద్రంలోని దుర్గా ఫంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం, రెవిన్యూ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పాల్గొని భూ భారతి, రెవిన్యూ అవగాహన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

# మహీంద్రా విశ్వవిద్యాలయంలో


## ఈనెల 23, 24 తేదీలలో వీసీల సమావేశం

## – నెక్ట్స్ జనరేషన్ లీడర్స్ పై దృష్టి

హైదరాబాద్, ఏప్రిల్ 17, 2025: భారత్‌లోని 150 పైగా ప్రముఖ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు ఈనెల 23, 24వ తేదీలలో హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో సమావేశం కానున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (సీఐపీయూ) సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ చైర్‌పర్సన్, మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేడురి తెలిపారు. భారత్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2025 (బీహెచ్ఈఎస్)గా పిలిచే ఈ సదస్సును కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (సీఐపీయూ), మహీంద్రా యూనివర్సిటీకి చెందిన ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ తో కలిసి నిర్వహిస్తుందన్నారు. 'భారత ఉన్నత విద్యలో నెక్ట్స్ జనరేషన్ లీడర్ల నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సమావేశం జరగనుందన్నారు. రెండు రోజుల ఈ సమావేశంలో ప్రముఖ ఆలోచనాపరులు, విధాన రూపకర్తలు, విద్యా దార్శనికులు, పరిశ్రమ నాయకుల ముఖ్య ఉపన్యాసాలు, ప్లీనరీ సెషన్లు, ప్యానల్ చర్చలు కలవన్నారు. నెక్ట్స్ జనరేషన్ లీడర్స్ తయారు చేయడంపై వంద మంది వైస్ చాన్సలర్స్ చర్చించనున్నారని తెలిపారు.

ఈ చర్చలు విద్యా నాయకత్వం, పరిశోధన సామర్థ్యం అభివృద్ధి, డిజిటల్ మార్పులు, ఆవిష్కరణలు వంటి రంగాల్లో ఉన్న అవకాశాలు, సవాళ్ళపై జరగనున్నాయని తెలిపారు. గ్లోబల్ స్థాయిలో పోటీ చేయగల విద్యా సంస్థలను నిర్మించే దిశగా చేపట్టిన ప్రయత్నం అన్నారు. పరిశ్రమ, విద్య మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందన్మారు. ఈ సమాలోచనలో భాగం కావడం మహీంద్రా యూనివర్సిటీకి గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (సీఐపీయూ) చీఫ్ ప్యాట్రన్, ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ డాక్టర్ రాహుల్ వీ కరాడ్, మాట్లాడుతూ ఈ యుగంలో విద్యా నాయకత్వానికి వేగవంతమైన దృష్టి, గ్లోబల్ ఆలోచన, విలువలతో కూడిన దృక్పథం అవసరమన్నారు. ఇది సమాజ మార్పు, ప్రపంచ పోటీకి సిద్ధమైన దార్శనికులను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం హాజరు కానున్నారని చెప్పారు. గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా నాక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్, ఎన్బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్ధే పాల్గొంటారన్నారు. ఇంకా సీఐపీయూ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాల్ పాఠక్, గ్లోబల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ టీఐఈ చైర్మన్ మురళి బుక్కపట్నం, సీఐపీయూ గౌరవ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ జీకే. శిరూడే పాల్గొంటున్నారు. ఏప్రిల్ 24న జరగనున్న ప్లీనరీ సెషన్‌లో ముఖ్యాంశాలు.. వచ్చే దశాబ్దంలో విద్యా నాయకత్వ వికాసం, విద్యను 'సాఫ్ట్ పవర్'గా ఉపయోగించే దిశగా దృష్టికోణం, పరిశోధన సామర్థ్య నిర్మాణంలో ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం, డిజిటల్ యుగానికి అనుగుణమైన నాయకత్వ నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలలో నాయకత్వాన్ని తీర్చిదిద్దడం తదితర ఉంటాయి. ఈ సదస్సు భారత ఉన్నత విద్యకు ఒక దిశానిర్దేశక వేదికగా నిలవనుంది. ఈ సెషన్లలో వర్జీనియా టెక్, సావిత్రీబాయి పూలే పుణే యూనివర్సిటీ, నిక్‌మార్ యూనివర్సిటీ, బిట్స్ పిలాని, ఐఐఎం తిరుచిరాపల్లి, సార్లా బిర్లా యూనివర్సిటీ, శ్రీశ్రీ యూనివర్సిటీ, సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, బెర్లిన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అండ్ ఇన్నోవేషన్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) వంటి దేశీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి ప్రముఖ అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొననున్నారు. సీఐపీయూ అనేది లాభాపేక్షలేని సంస్థగా పని చేస్తుంది. ఇది దేశ, విదేశీ వేదికలలో తృతీయ, ఉన్నత విద్య, విశ్వవిద్యాలయ స్థాయిల అభివృద్ధి, ప్రయోజనాల కోసం ప్రోత్సహిస్తూ ఉంటుంది.

# దుద్దెపూడి లో పోషణ పక్వాడ కార్యక్రమాలు



సత్తుపల్లి ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి)సత్తుపల్లి. ప్రాజెక్ట్ పరిధిలోని వేంసూరు మండలం దుద్దెపూడి 1, 2 3 అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లుల ఉద్దేశించి సూపర్వైజర్ వసంత రాణి మాట్లాడుతూ, 1000,ల ప్రాముఖ్యత రెండు సంవత్సరముల లోపు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని , పోషకాహార లోపం ఏ గ్రామంలోనూ ఏ ఇంటిలోనూ ఉండకూడదని దానికోనవే ప్రతి సంవత్సరం పోషణ పక్వాడ ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని ప్రతి తల్లి కుటుంబ సభ్యులు ప్రతినెల అంగన్వాడీ కేంద్రానికి ఒకటవ తారీఖున తీసుకువచ్చి పిల్లల బరువులు ఎత్తులు జబ్బ కొలతలు తీయించుకొని పిల్లల పోషణస్థితి తెలుసుకోవాలని ప్రతి గర్భిణీ బాలింతలు అంగన్వాడీ కేంద్రంలోని భోజనం చేయాలని సూపర్వైజర్ వసంత రాణి ఈ సమావేశంలో చెప్పడం జరిగింది ఎప్పుడైతే గర్భిణీ మంచి ఆహారం తీసుకుంటుందో ఆ తల్లి ఆరోగ్యంతో పాటు బిడ్డ ఆరోగ్యం కూడా బాగుంటుందన ప్రతి బిడ్డ మంచి బరువుతో జన్మిస్తాడని తల్లులకు తెలిపారు తల్లులకు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తల్లులు ఉద్దేశించి సూపర్వైజర్ మాట్లాడటం జరిగింది. ఈ సందర్భంగా దుద్దెపూడి గ్రామంలోని రెండు సంవత్సరాల లోపు పిల్లల కుటుంబాల సందర్శించి పిల్లల ఆరోగ్యం గురించి కుటుంబ సభ్యులకు చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, భారతి, రాణి,సుజాత, ఆశ వర్కర్స్ తల్లులు , ఆయాలు పిల్లలు హాజరయ్యారు

## సమస్యలపై పరిష్కారం కోరిన ప్రజలు, రైతులు

షాద్‌నగర్, ఏప్రిల్17(వుదయం ప్రతినిధి): షాద్ నగర్ మున్సిపాలిటీలో గురువారం జరిగిన భూభారతి చట్టం 2025 అవగాహన సదస్సులో పాల్గొన్న పలువురు రైతులు నాయకులు ప్రజలు జిల్లా కలెక్టర్ ను పలు విషయాలు సమస్యలు ప్రస్తావించి పరిష్కార మార్గాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డీఓ సరిత, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఉర్సు ఉత్సవాలు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్17(వుదయం ప్రతినిధి):కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని జీతేపీర్ దర్గాలో గురువారం నిర్వహించిన ఉర్స్ ఉత్సవాలకు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై చాదర్ ను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక ఉర్సు ఉత్సవాలు అని, ఇక్కడ జరిగే ఉర్స్ వేడుకల్లో కులమతాలకతీతంగా అందరూ పాల్గొంటారన్నారు.

# డి 2 ప్రాంతంలో కొనసాగుతున్న మట్టి తవ్వకాలు.

**టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి.**



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి)శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో జరిగిన ప్రమాద ప్రదేశంలో నీ %ణ% 2 ప్రాంతంలో సహాయక చర్యల్లో భాగంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు.

గురువారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలోని ఎస్ ఎల్ బి సి టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ....... ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ తెలుసుకునేందుకు %ణ 1, ణ% 2, ప్రాంతాలలో అన్వేషణ జరిగిందని, ప్రస్తుతం %ణ% 2 ప్రాంతంలో పూర్తిస్థాయిలో మట్టి తవ్వకాలు టిబిఎం కత్తిరింపు పనులు జరుపుతూ కార్మికుల జాడకై నిరంతరం సహాయక బృందాలు శ్రమిస్తున్నట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలియజేశారు.

%ణ% 2 ప్రాంతంలో 5 ఎస్కవేటర్ల సహాయంతో పెద్ద పెద్ద బండ రాళ్లను తొలగిస్తూ , అత్యధికంగా ఉన్నటువంటి మట్టిని కన్వీయర్ బెల్ట్ గుండా టన్నెల్ బయటకి పంపుతున్నట్లు, ఊట నీటిని నిర్విరామంగా బయటకు పంపించేస్తున్నట్లు తెలియజేశారు. టన్నెల్ లోపల ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని నిషిద్ధ ప్రదేశంగా గుర్తించి కంచె ఏర్పాటు చేసినట్లు, టన్నెల్ నిపుణులు ప్రమాద ప్రదేశాన్ని నిరంతరం పరిశీలనలో ఉంచినట్లు, సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బందికి తగు జాగ్రత్తలు సూచించినట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి వివరించారు. మట్టి తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న బండ రాళ్లను టీబీఎం భాగాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేసినట్లు ప్రత్యేక అధికారి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో కేంద్ర రాష్ట్ర సహాయక బంధాల ఉన్నతాధికారులు జేపీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండి

**హెచ్ఎం నరసింహారావు**



ఏప్రిల్ 17 దమ్మపేట, (వుదయం ప్రతినిధి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం

యుపిఎస్ లింగాలపల్లి పాఠశాల హెచ్ఎం అండ్ స్టాఫ్ గ్రామంలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను గుర్తించి మరియు ప్రైవేటు పాఠశాల కు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి లింగాలపల్లి పాఠశాలకు పంపించవలసిందిగా విజ్ఞప్తి చేయటం జరిగింది ప్రభుత్వ పాఠశాలలో ఇచ్చే సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేయడం జరిగింది ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, ఉచిత దుస్తులు ,ఉచిత భోజనం ,ఉచిత రాగిజావ ,వారానికి ఉచితంగా మూడు కోడిగుడ్లు మరియు సన్న బియ్యంతో పౌష్టికాహారం మరియు క్రీడల యందు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం క్విజ్ కాంపిటేషన్ వంటి పోటీ పరీక్షలకు జిల్లా స్థాయిలో తర్ఫీ దివటం నవోదయ వంటి ఎంట్రన్స్ ఎగ్జామ్స్ కి ఉచితంగా తర్ఫీదిని ఇవ్వటం జరుగుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో యుపీఎస్ లింగాలపల్లి హెచ్ఎం నరసింహ రావు, పి ఎస్ ఎస్ సి ప్రసాద్, హీరోలాల్, మారుతి రామకృష్ణ, శ్రీమతి జారే వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

# నర్సంపేటలో వ్యభిచార గృహం పై పోలీసుల దాడి.



నర్సంపేట ఏప్రిల్17వ్రుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో గురువారం మధ్యాహ్నం సమయంలో నమ్మదగిన సమాచారమ్ మేరకు టాస్క్ ఫోర్స్ మరియు నర్సంపేట పోలీసు ల ఆధ్వర్యంలో వ్యభిచారం నిర్వహిస్తున్న గృహం పై దాడి చేయడం జరిగిందని ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. ఇందులో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళా కిన్నెరపు ఉమా నర్సంపేట, కొయ్యల రమేష్ భాంజీపేట్, కొయ్యల నితిన్ బాంజిపేట, కేసనపల్లి విక్రమ్ అను వ్యక్తులని అదుపులోకి తీసుకోనీ వ్యభిచార గృహం లోని ఇద్దరు మహిళలను కాపాడడం జరిగిందని ఇట్టి రైడ్ లో భాగంగా 29 హెచ్ ఐ వి పరీక్ష కిట్లను, కండోమ్ ప్యాకెట్లను, 5 సెల్ ఫోన్లు, 1 టూ వీలర్, 2750/- ల నగదు ను స్వాధీన పర్చుకోవడం జరిగిందని తెలిపారు.

# రైతుబంధు రైతు భీమా ఇచ్చిన రైతు బాంధవుడు కేసీఆర్

**మాజీ ఎమ్మెల్యే గండ్ర**





జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి) రైతుబంధు ఏడాదికి రూ. 10000/-, రైతు భీమా రూ. 5,00,000/- ఇచ్చిన రైతు బాంధవుడు కేసీఆర్ అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. గురువారం టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి (బి),బూర్ణపల్లి, ద్వారక పేట, రామకృష్ణాపూర్ (వి),వెలిశాల, గర్మిళ్లపల్లి,రాఘవాపూర్ గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం పోరాడి రాష్ట్రాన్ని సాధించుకొని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ప్రభుత్వ పథకాలు అందే విధంగా కార్యచరణ చేపట్టిందే కెసిఆర్ అని అన్నారు 27వ తేదీన వరంగల్ లో జరిగే బహిరంగ సభలో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాలనా పై ప్రజలలో అసహనం వ్యక్తం అవుతుందని అన్నారు రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచులుగా జెడ్పిటిసిలు గా ఎంపిటిసిలుగా గెలుస్తారని అన్నారు అదే కాక రానున్నది టిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు ఇలా ఉంటే భూపాలపల్లి నియోజకవర్గం లో నియంతృత పాలన కొనసాగుతుందని ఆరోపించారు టేకుమట్ల మండలంలో ప్రతి రోజు ఇసుక ట్రాక్టర్ల ర్యాలీ నడుస్తున్న అధికారులు మౌనం వీడని పరిస్థితి ఉందని ఇసుకాసుర్ల రాజ్యం మండలంలో నడుస్తుందని ఆరోపించారు. రైతుల పంట పొలాలు ఎండిపోతున్నాయి మొర్రో అని స్థానిక ఎమ్మెల్యే ముందు మొర పెట్టుకుంటే పట్టించుకోలే, రైతుల కొరకు నిర్మించిన చెక్ డ్యామ్ కి బాంబులు పెట్టి పేల్చిన వారిని శిక్షించాలని కోరితే పట్టించుకోకుండా తన అసమర్ధతను వ్యక్తపరుస్తున్నారని ఆరోపించారు ముఖ్య మంత్రి స్థాయి నుండి కింది స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల కు ఒక్క హెచ్చరిక కావాలి అంటే ఏప్రిల్ 27న జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమాంతరం పలువురు నాయకులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జై బాపు, జై భీమ్ జై సమీదాన్ కార్యక్రమం నిర్వహణ

భువనగిరి, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి):: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మహబూబ్ పేట మల్లిగూడెం చోల్లేరు చిన్నకందుకూరు పెద్ద కందుకూరు గ్రామాలలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జై బాపు, జై, జై సమీదాన్ కార్యక్రమాన్ని యాదగిరిగుట్ట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకొండ కోర్టు ఎదురుగా చలివేంద్రం ఏర్పాటు

దేవరకొండ, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి): దేవరకొండ కోర్టు ఎదురుగా లయన్స్ క్లబ్ మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి కే. అనిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. రవీందర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హరీష్ బాబు, సెకండ్ క్లబ్ మెజిస్ట్రేట్ జడ్జి పొట్ట చెన్నయ్య, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు, సభ్యులు పాల్గొన్నారు.

# ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేసిన పోచారం, కాసుల

బాన్సువాడ, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి):కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ మహిళలకు అందిస్తున్న ఉచిత కుట్టు మిషన్ లను గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా కార్పొరేషన్ ఏడీ దయానంద్ పాల్గొన్నారు.

# శ్రీ బేతాళ స్వామి జాతరలో చలివేంద్రం ఏర్పాటు

కామారెడ్డి, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో గురువారం శ్రీ బేతాళ స్వామి జాతర సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆద్యర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రమేష్ యాదవ్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కాశీనాథ్, మంజూర్, దామోదర్, రాము, అశోక్, భాస్కర్, అరవింద్, నాగరాజు, సురేష్, పవన్, సుధాకర్, గొల్ల నరేందర్, శంకర్, చాంద్‌పాష పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



జన్నారం,ఏప్రిల్ 17(వుదయం విలేకరి) ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ తగలకుండా ఉదయం సమయంలో పని చేసుకోవాలని పని ప్రదేశంలో ఎండ తగలకుండా టోపీ లేదా టవల్ చుట్టుకోవాలని డిహైడ్రేషన్ కాకుండా ఓ ఆర్ ఎస్ ద్రావణం తీసుకోవాలని వడదెబ్బ లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి జన్నారం ఆరోగ్య కార్యకర్త సుభక్త ఉపాధి హామీ కూలీలకు తెలియజేసారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు

.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీ పాల్ , జి.రాజు గౌడ్, సౌందర్య, ఆశా కార్యకర్త మాధవి, ఉపాధి హామీకూలీలు పాల్గొన్నారు.

# ఐ ఎన్ టి ఎస్ ఓ లో సత్తా చాటుకున్న శ్రీచైతన్య విద్యార్థులు



హనుమకొండ, ఏప్రిల్ 17(వుదయం జిల్లా ప్రతినిధి) : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఐ ఎన్ టి ఎస్ ఓ ఒలింపియాడ్లో శ్రీ చైతన్య – సి.ఐ.పి. ఎల్, ఎమ్.పి.ఎల్ బ్రాంచ్ నక్కలగుట్ట విద్యార్థులు అద్భుతంగా రాణించారు. పాఠశాలనుండి 225 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనగా 185 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 65 మంది విద్యార్థులకు ప్రధాన బహుమతులు, బంగారు పథకాలు మెరిట్ సర్టిఫికెట్స్ రాగా, 119 మంది విద్యార్థులకు బంగారు పథకాలు మెరిట్ సర్టిఫికెట్స్ ను సాధించుకున్నారు. ప్రధాన బహుమతిగా ల్యాప్టాప్, మరియు 5 ప్రత్యేక బహుమతులు (2 ట్యాబ్స్ . 2స్మారవాచ్ 2 హెడ్సెట్స్, 1 బ్యాక్ ప్యాక్, 1 లంచ్ బాక్స్) సాధించుకున్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవానికి అతిథిగా విచ్చేసినటువంటి పశ్చిమ వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.... విద్యార్థులలోని ప్రతిభ పాఠవాలను వెలికి తోసే ఇటువంటి పరీక్షలను నిర్వహిస్తున్నందుకు శ్రీచైతన్య యాజమాన్యాన్ని, %×మీూ% ఇంచార్జ్ సంతోష్ గారిని అభినందించారు. శ్రీచైతన్య డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ శ్రీధర్, టి.ఏమ్ చేతన, ఏ.టి.ఎమ్ రాజేశ్వర రెడ్డి, కే. ఆర్డినేటర్ శివకోటేశ్వర, పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ, ఐ.పి.ఎల్, ఎమ్.పి.ఎల్ ఇంచార్జ్లు ఉదయ్,ఆనంద్, విద్యార్థులను అభినందిస్తు ఈ పరీక్షలో గొప్పగా రాణించినందుకు ఉపాధ్యాయ బృందం. విద్యార్థుల కృషి – తల్లిదండ్రుల ప్రోత్సాహం కారణమని అభినందించారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి...



కోరుట్ల ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి) కథలాపూర్ మండలంలోని తక్కలపల్లి, బొమ్మెన గంభీర్ పూర్ తండ్రియాల అంబారి పేట పోతారం గ్రామాలల్లో కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి రిబ్బన్ కట్ చేసి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు

అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున మార్కెట్ యార్డల్లో ఉన్న రైతులు సిబ్బంది తగు జాగ్రత్త తీసుకోవాలని ప్రతి మార్కెట్లోనూ మంచినీటి సౌకర్యం కల్పించి రైతులు అలాగే సిబ్బంది ఎండ దెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుండ్ర నారాయణరెడ్డి తో పాటు కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితి నాగరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి అజీమ్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షురాలు పులి శిరీష హరి ప్రసాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేగ్యారపు శ్రీహరి ఏపిఎం నరహరి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కారపు గంగాధర్ అల్లం కొండ విజయ్ బీసీ సెల్ అధ్యక్షులు లింగ గౌడ్ రైతులు కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు

# న్యాయవాదుల విధుల బహిష్కరణ





లక్షెట్టిపేట, ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి): కోదాడ న్యాయవాది కిషోర్ పై జరిగిన దాడికి నిరసిస్తూ గురువారం బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోమిరెడ్డి సత్తన్న మాట్లాడుతూ...న్యాయవాది పై దాడి చేయడం హేయమైన చర్య అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణకు వెంటనే ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. జనరల్ సెక్రటరీ ఎస్. ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షుడు నలినికాంత్, కోశాధికారి సుమన్ చక్రవర్తి, లైబ్రరీ సెక్రటరీ షెఫీఖ్, స్పోర్ట్స్ సెక్రెటరీ బనావత్ సంతోష్, లేడీ రెప్రెసెంటేటివ్ జి. పద్మఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ రహేమతుల్లా,రెడ్డిమల్ల ప్రకాశం, సదాశివ, సీనియర్ న్యాయవాదులు భూమరెడ్డి, గడికొప్పుల కిరణ్,కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, న్యాయవాదులు తాజొద్దీన్,రుమాన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ పోస్టర్ పై బురద జల్లిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**ఎస్ఐ శ్రీనివాసరావు కి పిర్యాదు చేసిన అంబేద్కర్ వాదులు**



అలంపూర్ ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగి దొడ్డి గ్రామంలో బుదవారం సాయంత్రం గ్రామస్తులు పోలీస్ వారీ సమక్షంలో పాఠశాల భవనం పై ఏర్పాటు చేసినా భారత రాజ్యంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పోస్టర్ పై గ్రామానికి 8 మంది వ్యక్తులు అందజ రాత్రి 10 గంటల సమయంలో బురద జల్లడం జరిగింది. దీనితో మండలంలో గల ఎమ్ ఆర్ పి ఎస్ నాయకులు, అంబేద్కర్ వాదుల సమక్షంలో దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అయిజ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ శ్రీనివాస రావు కు ఫిర్యాదు చెయ్యడం జరిగింది.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

మంథని, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల సింగిల్ విండో, ఐకెపి ఆధ్వర్యంలో గురువారం దేవునిపల్లి, కొదురుపాక, నారాయణపూర్, చిన్నకల్వల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఎలాంటి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు.

# ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది: ఎమ్మెల్యే ఆది

వేములవాడ,ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని పున: ర్నిర్మాణం చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆలయ విస్తీర్ణం చేయడం కోసం రూ. 76 కోట్లు, అన్నసత్రం నిర్మాణం కోసం రూ. 35కోట్లు కేటాయించి గతంలో సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేసుకున్నట్లు గురువారం గుర్తుచేశారు. ఆలయ, పట్టణ అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి వెడల్పు కోసం రూ. 47 కోట్లు మంజూరైనట్లు చెప్పారు.

# పదేండ్లు అసమర్థత పాలన కొనసాగింది

నకిరేకల్, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి):నకిరేకల్ పట్టణంలో ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెఆర్ఎంబి జలాల విషయంలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 10 ఏండ్లు అసమర్థ పాలన కొనసాగించారని అన్నారు. తెలంగాణ ఉద్యమం నడిచింది నీళ్లు, నిధులు, నియామకాల కోసమని అన్నారు.

# నర్సింగాపురం అంగన్వాడి కేంద్రాల్లో అన్నప్రాసన కార్యక్రమం

జనగామ, ఏప్రిల్16వ్రుదయం ప్రతినిధి): జనగామ జిల్లా కొడకండ్ల మండల పరిధిలోని నర్సింగాపురం గ్రామం అంగన్వాడి కేంద్రాలు 1& 2 లలోని అంగన్వాడి టీచర్లు D. పద్మ,. నిర్మల గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా అన్న ప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామ కార్యదర్శులచే ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘం వీఏఓలు, ఆశా వర్కర్, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# మనుబోతులగడ్డ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ పక్షోత్సవాలు.

*చంటి పిల్లలకు అక్షర అభ్యాసం. అంగన్వాడీ టీచర్ తేజావత్ కవిత.*



ఖానాపురం ఏప్రిల్ 17 వుదయం ప్రతినిధి. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ-2 కేంద్రంలో పోషణ పక్షోత్సవాల సందర్భంగా చంటి పిల్లలకు అక్షర అభ్యాసం చేయించినట్లు అంగన్వాడీ టీచర్ తేజవత్ కవిత తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుండి 22 వరకు పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలుపుతూ పోషణ పక్షోత్సవంలో భాగంగా గురువారం అంగన్వాడి కేంద్రం పరిధిలోని చంటి పిల్లలకు అక్షర అభ్యాసంను పాఠశాల ఉపాధ్యాయులు వీరన్న, అశోక్ వెంకట్ రెడ్డి ల చేతుల మీదుగా చంటి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించినట్లు అంగన్వాడీ టీచర్ తెలిపారు. అలాగే గర్భిణీ స్త్రీలు బాలింతలు తీసుకోవాల్సిన పలు రకాల జాగ్రత్తలను వివరించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త దేవేంద్ర, అంగన్వాడి ఆయా తేజవత్ జ్యోతి, గర్భిణీ స్త్రీలు బాలింతలు శిరీష, లత, ఉమా, శాంతమ్మ, పవిత్ర, లింగమ్మ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డులో భూభారతి-2025 అవగాహన సదస్సు

## - జిల్లా కలెక్టర్ బి.ఎమ్.సంతోష్



గద్వాల ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడు తుందని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. గురువారం గద్వాల్ మార్కెట్ యార్డ్ లోని భూ భారతి చట్టం-2025 పై అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలున్నాయని తెలిపారు. గతంలో ధరణిలో మన జిల్లా టాప్ 10 స్థానంలో ఉందని తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో 'భూధార్' తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పని చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. మే 1వ తేదీ నుంచి గ్రామ పాలన అధికారుల నియామకంతో భూ సమస్యలు సులభతరం అవుతుందని తెలిపారు. గ్రామాల్లో మండల వ్యవసాయాధికారుల సహకారంతో రైతు వేదికల వద్ద ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని, భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డీవో శ్రీనివాస రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ సుభాన్ గద్వాల్ తహసీల్దార్ మల్లికార్జున్, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో హిమోఫిలియాపై అవగాహన ర్యాలీ




మధిర ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి): మధిర ప్రభుత్వ హాస్పిటల్లో గురు వారం నాడు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హిమోఫిలియా వ్యాది అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బానోత్ కళావతిబాయ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఈ హిమో ఫిలియా కొన్ని కుటుంబాలలో మేనరిక వివాహ సంబంధంల ద్వారా పుట్టిన పిల్లలకు వస్తుందని, తీవ్రమైన రక్త స్రావం ఉంటుందని, రక్తం గడ్డ కట్టక పోవడం లాంటి సమస్య లు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ హాస్పిటల్ వైద్యుల ను సంప్రదించ వలసినదిగా కోరారు. ఆరోగ్య సిబ్బంది హిమోఫీలియా పై ప్రజలకు అవగాహనా కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర మండలం పీహెచ్ సి దెందుకు రు, పీహెచ్ సి మాటూరు పేట మధిర పీపీ యూనిట్ వైద్యులు పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల మొదటి విడతలో ప్రతిభ కనపర్చి సీటు సాధించిన బన్న మృదుల్



కాసిపేట ఏప్రిల్ 17 (వుదయం విలేకరి): తెలంగాణ గురుకుల సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన కాసిపేట మండల కేంద్రానికి చెందిన బన్న మృదుల్ 5 వ తరగతి లో మొదటి విడత ఫలితాలలో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, బెల్లంపల్లి లో సీటు సాధించడం జరిగింది బన్న .మృదుల్ కాసిపేట గ్రామానికి చెందిన బన్న సంపత్ కుమార్ -సంధ్య ల రెండవ కుమారుడు. బన్న మృదుల్ కాసిపేట మండల కేంద్రంలోని విస్ డమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో అక్షరాభ్యాసం చేసి రెండవ తరగతి వరకు, 3,4 వ తరగతులు అక్షర ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో చదివి టి జి సెట్ 2025లో సీటు సాధించడం తో బన్న మృదుల్ ను పాఠశాల పాధ్యాయులు,సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందించారు.

# మై హోమ్ ఇండస్ట్రీస్ నందు అగ్నిమాపక వారోత్సవాలు

## - హుజూర్నగర్ ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో



మేళ్లచెరువు /హుజూర్నగర్ ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి): జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు - 2025 లో భాగంగా స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేల్లచెరువు నందు తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక శాఖ, హుజూర్ నగర్ వారి ఆధ్వర్యంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరామిరెడ్డి మరియు ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్స్ నిర్వహించి ఉద్యోగులకు,కార్మికులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్లాంట్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలపై ప్రభుత్వ అగ్నిమాపక అధికారులు చేసిన పలు సూచనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని, వేసవికాలం దృష్ట్యా ఉద్యోగులందరూ పరిశ్రమ లో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచన చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక కేంద్రం హుజూర్నగర్ వారు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అలాగే మంటల్లో చిక్కుకున్న వ్యక్తులను రక్షించేందుకు, పరిశ్రమలో ఎత్తు ప్రదేశాలలో మంటల్లో చిక్కుకున్న బాధితులను కిందకు చేర్చే విధానాన్ని,అగ్ని ప్రమాదానికి గురైన బాధితులను రక్షించే విధానాలను మాక్ డ్రిల్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా హుజూర్నగర్ ఫైర్ అధికారి సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికులంతా అగ్ని ప్రమాదాల్లో మాక్ డ్రిల్స్ ద్వారా వివరించిన సూచనలను శ్రద్ధగా తెలుసుకుని ఏమైనా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వాటిని పాటించాలని కోరారు అలాగే మై హోమ్ ఇండస్ట్రీస్ వారు అగ్ని ప్రమాదాలు అరికట్టడం కోసం సుమారు కోటి రూపాయలు వెచ్చించి అధునాతన మైనటువంటి ఫైర్ టెండర్ కొనుగోలు చేసినందుకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫైర్ అధికారి లక్ష్మయ్య, ఫైర్ విభాగం ఉద్యోగులు, సేఫ్టీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నాచారం సెక్టార్ పరిధిలో ఘనంగా పోషణ పక్షం



ఏప్రిల్ 17 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారం సెక్టార్ పరిధిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా పోషణ పక్షం కార్యక్రమంలో జరిగింది గురువారం రోజు జరిగిన ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు అధికారిణ్ణి సిడిపిఓ హేమసత్య పాల్గొన్నారు ఈ సందర్భంగా పిఓ హేమ సత్య మాట్లాడుతూ తల్లులు తీసుకోవలసిన ఆహార భద్రత తల్లి ప్రాముఖ్యత గురించి, మరియు వెయ్యి రోజుల యొక్క ప్రాముఖ్యత గురించి తల్లులకు క్షుణంగా అవగాహన కల్పించారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో అన్నప్రాసనలు, శ్రీమంతాలు, అక్షరాభ్యాసాలు,నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రఘుపతి, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఆయాలు గ్రామ పెద్దలు,వివో లు,పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు



లక్సెట్టిపేట, ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి): మండలంలోని సూరారం గ్రామంలో గల రైతువేదికలో గురువారం పోషణ పక్షం మాసాన్ని పురస్కరించుకొని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జ్ సంక్షేమ అధికారి రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గర్భిణులు పోషకాహారాన్ని తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అనంతరం గర్భిణులకు పూలు, పండ్లు అందజేసి గాజులు తొడిగి సీమంతాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రేష్మ, సూపర్వైజర్స్ మమత, వనితా, వాక్కు ఫౌండేషన్ కో ఫౌండర్ కవిత, జిల్లా సమన్వయ అధికారిణి రజిత,సమన్వయ సహాయక అధికారి శ్యామల, జిల్లా మహిళా సాధికారిత అధికారిని సౌజన్య, బ్లాక్ కో ఆర్డినేటర్ లక్ష్మీ, అంగన్వాడీ టీచర్లు,ఆయాలు, తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు దెబ్బ తిన్న పంటల నివేదిక అందచేయాలి

## - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి): అకాల వర్షాలకు దెబ్బ తిన్న వ్యవసాయ, వాణిజ్య పంటల నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు గురువారం ఐడిఓసి కార్యాలయంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల నివేదిక రూపకల్పనపై వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టం అంచనాలు ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం అందచేయుటకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరు నాయక్, జిల్లా ఉద్యాన అధికారి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాపాడేందుకే కాంగ్రెస్ పాదయాత్ర



వెల్దండ ఏప్రిల్ 17 (వు దయం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని బొల్లంపల్లి మరియు బండోన్ పల్లి గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు భారత రాజ్యాంగంపై బిజెపి చేస్తున్న అరాచకాలు మరియు రాజ్యాంగాన్ని తీసివేయాలని చేస్తున్నా బిజెపి నాయకులు కేంద్ర మంత్రులు కుట్ర భాగంగా కాంగ్రెస్ పార్టీ మంచి ప్రతిష్టమైన కార్యక్రమం బాపు నడిపిన బాటలోనే అందరు నడవాలని అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అందరూ కలిసికట్టుగా ఉండాలని ఈ భారతదేశంలో ప్రజలకు హక్కులు రావాలని స్వేచ్ఛ ఉండాలని కాంగ్రెస్ పార్టీ నినాదం అన్నారు కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్. కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వతి రెడ్డి. బొల్లంపల్లి ఎంపీటీసీ. వెంకట్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాణావత్ శంకర్నాయక్. తక్కలపల్లి శేఖర్. ప్రసాద్. సేవాదళ ఉపాధ్యక్షుడు పుల్లయ్య. యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్. గుత్తి చంద్రశేఖర్. మహిళ నాయకురాలు. కొప్పు రాణి. ఎనుముల శేఖర్ రెడ్డి. శంకరయ్య. పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం రైతుల పాలిట వరం


## - ఎమ్మెల్యే సత్యనారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి): భూ భారతి చట్టం రైతుల పాలిట వరమని భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణరావు తెలిపారు. గురువారం ఘనపురం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025 అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవగాహన సదస్సు ప్రారంభానికి ముందు భూభారతి నూతన చట్టంపై రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతుల భూములకు పట్టాలు, భూమి హక్కులు లేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చట్టాన్ని తెస్తామని తెలిపిన విధంగా వివిధ రాష్ట్రాల్లో అధ్యయం చేసి భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు స్పష్టం చేశారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూములపై రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ పటిష్టమైన నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చినట్లు ఆయన వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూ భారతి చట్టంపై ప్రజలు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 4 జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిందని, మే మాసం నుండి మన జిల్లాలో కూడా ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు. సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని చట్టంలో జత చేసేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని అన్నారు. ధరణి పోర్టల్ వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులకు పంట రుణాలు రాక అమ్మకానికి అవకాశం లేక ఎంతో వేదన అనుభవించారని ఆయన పేర్కొన్నారు. సింగరేణి, జన్కో ఏర్పాటులో భూములు కోల్పోయిన నిర్వాసిత ప్రజలు పరిహారం రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దరణిలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని అందుకే ధరణిని స్వస్తి చెప్పి కర్షకులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 12 నెలలు సుదీర్ఘంగా చర్చించి పటిష్టమైనటువంటి చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టం ద్వారా వచ్చిన హక్కులు వంద సంవత్సరాలు అయినా ఎవరూ మార్చడానికి అవకాశం లేకుండా పటిష్టంగా తయారు చేసినట్లు ఆయన వివరించారు. భూపాలపల్లి జిల్లాలో 10,900 ఎకరాలకు పట్టాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఈ చట్టం ద్వారా వారందరి సమస్య తీరుతుందని ఆయన తెలిపారు. ధరణి ద్వారా దళారులు భూములను అన్యాక్రాంతం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే దరణిని బంగాళాఖాతంలో కలిపి రైతులకు అనుకూలమైనటువంటి చట్టాన్ని తీసుకొస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, ప్రకటించిన ప్రకారం నూతన చట్టాన్ని తెచ్చినట్లు ఆయన తెలిపారు. రైతులకు అండదండలు ఉండే విధంగా అవినీతి రహిత చట్టాన్ని తీసుకొచ్చామని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చి బ్యాంకు రుణాలు, భూ హక్కులు కల్పిస్తామని స్పష్టంచేశారు. 12 సంవత్సరాలు రికార్డుల ఆధారంగా చుట్టుపక్క రైతులను విచారించి పట్టా రైతు బీమా కల్పిస్తామని చెప్పారు. దళారీలకు, పైరవీకారులకు అవకాశం లేకుండా ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా ఈ నూతన చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. మనందరం రైతు బిడ్డలమని రైతు కుటుంబాలనుంచి వచ్చిన వాళ్ళమేనని, రైతే దేశానికి వెన్ను ముఖ అని మనందరం రైతులకి అండగా నిలిచి వాళ్లకు న్యాయం చేద్దామని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూభారతి చట్టంపై ప్రతి ఒక్కరు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భూ మాత చట్టం ఈ నెల 14వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రారంభించినట్లు తెలిపారు. భూమాత చట్టం ద్వారా ప్రజలకు వేగంగా సేవలందించేందుకు ఈ ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో దాదాపు 70 నుండి 80 శాతం సమస్యలు భూములకు సంబంధించినవే వస్తున్నాయని అన్నారు. అట్టి దీర్ఘకాలిక సమస్యలను సివిల్ కోర్టు ద్వారా మాత్రమే పరిష్కరించాల్సి ఉన్నందున పరిష్కరించలేకపోయామని భూ భారతి చట్టం ద్వారా ఇప్పుడు పరిష్కరించడానికి అవకాశం కలిగిందని తెలిపారు. ధరణిలో అప్పీలు చేయడానికి అవకాశం లేదని, కేవలం సివిల్ కోర్టు ద్వారా మాత్రమే పరిష్కరించడానికి అవకాశం ఉందని, ఈ నూతన చట్టం ద్వారా వచ్చే పిర్యాదు ఆధారంగా ఆర్డిఓ, కలెక్టర్ ల్యాండ్ ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఏ విధంగా అయితే ఆధార్ కార్డు ఉందో భూములకు ప్రభుత్వం భూదార్ కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఉచిత న్యాయ సేవలు కూడా ఈ చట్టం ద్వారా అందించేందుకు అవకాశం కల్పించారని స్పష్టం చేశారు. పెండింగ్ సమస్యలకు ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రతి మండలంలో జరుగుతున్న అవగాహన సదస్సుల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని చట్టంపై సమగ్ర అవగాహన రావాలని ఆయన సూచించారు. ఈ చట్టం ద్వారా జరుచేయనున్న పాసు బుక్కులో భూ మ్యాపి కూడా ఉంటుందని తెలిపారు. ఈ యొక్క అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, తహసిల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీవో భాస్కర్, సింగిల్ రెండో చైర్మన్లు కుమార్ యాదవ్, సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి.

## - నర్సంపేట పట్టణ బి ఆర్ స్ కమిటీ.



నర్సంపేట ఏప్రిల్ 17.(వుదయం ప్రతినిధి): నర్సంపేట బిఆర్ఎస్ పార్టీ 2 వ వార్డు అధ్యక్షులు పోతరాజు ఆధ్వర్యంలో ముఖ్య అతిథిలుగా హాజరైన పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్ రెడ్డి లు మాట్లాడుతూ మాదన్నపేట చెరువులోకి గోదావరి జలాలు తీసుకువచ్చి నర్సంపేటను సస్యశ్యామలం చేసిన చరిత్ర పెద్ది సుదర్శన్ రెడ్డిదని మాదన్నపేట చెరువును మినీ ట్యాంక్ బండ్ కు నిధులు తీసుకువచ్చి చెరువు అభివృద్ధికి కృషిచేశారు. పట్టణ ప్రజల తాగునీటి కోసం అర్బన్ మిషన్ భగీరథ తో ఇంటింటికి నల్లాల ద్వారా తాగునీరు సౌకర్యం కల్పించారని వైద్య రంగంలో డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, మెడికల్ కళాశాల, టీ డయాగ్నొస్టిక్ సెంటర్ , నర్సంపేట కి తీసుకు వచ్చిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డి కి దక్కుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ అందించిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. ఈనెల 27 న జరిగే బిఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల రజతోత్సవ సభకు 2 వ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు గోనె యువరాజ్, మాజి కౌన్సిలర్లు బండి ప్రవీణ్, శివరాత్రి స్వామీ, బండి రమేష్, వాసం సాంబయ్య, పట్టణ యువజన విభాగం ఉపాధ్యక్షులు పైసా ప్రవీణ్, 2 వ బిఆర్ఎస్ వార్డు పార్టీ ముఖ్యనాయకులు ముత్తినేని వీరస్వామి, ముత్తినేని వీరన్న, ముత్తినేని శ్రీను, ముత్తినేని సోమేశ్, పోతురాజు అచ్చయ్య, పోతరాజు రాజు, వడిజర్ల శీను, పొన్నల ప్రభాకర్, ముస్కు శీను, జడల శీను, మల్లేష్ గూడెపు, యాకు భాష, గూడెప్ రాకేష్, ఆకుల చందు, ఆకుల వీరన్న, మిటబెల్లి శీను, చందు రాజు, మల్లూరు దేవన్న, హంస రవి, వంశీ, ఆకుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రేపే బారసా పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



కొండపాక ఏప్రిల్17(వుదయం ప్రతినిధి): ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తి లో బిఆరెస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్న క్రమంలో గజ్వేల్ నియోజకవర్గం లోని కొండపాక మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంఈ శనివారం తేదీ 19/4/2025 న దుద్దెడ వైష్ణవి గార్డెన్లో నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ తెలిపాడు. శనివారంఉదయం 11:30 గంటలకు మొదలయ్యే ఈ సమావేశానికి అతిథులుగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి , మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి , మాజీ గ్రంథాలయ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో పాటు ముఖ్య నాయకులు హాజరవుతున్నందున కొండపాక మండల బిఆర్ఎస్ పార్టీ తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు నూనె కుమార్ యాదవ్.

# ఈనెల 18 న ప్రతినిధుల సమావేశం!

హన్మకొండ, ఏప్రిల్ 17(వుదయం జిల్లా ప్రతినిధి) : సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రతినిధుల సమావేశం ఈనెల 18న హన్మకొండ,సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10-30 గంటలకు ఏర్పాటు చేసినట్లు జాతీయ అధ్యక్షులు శ్రావణ్ కుమార్,వరంగల్,హన్మకొండ జిల్లాల కన్వీనర్లు ఎన్.వేణుమాధవ్,కె.శంకరరావు,హన్మకొండ జిల్లా కోకన్వీనర్ దళపతి లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ 2008 అక్టోబర్ 2 తేదీన జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కోల్ బెల్ట్ లో ఏర్పడి రెండు తెలుగు రాష్ట్రాలలో నేత్ర,అవయవ,శరీర,చర్మ దనాలపై కృషి చేస్తున్నట్లు వేణుమాధవ్ పేర్కొన్నారు.శరీరదాన స్ఫూర్తి ప్రదాత,మహానుభావుడు కాళోజీ నారాయణ రావు ఆశయాల మేరకు ఈ సంస్థ ఏర్పడిందని ఆయన తెలిపారు.
సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఇప్పటి వరకు 1400 నేత్ర,85 అవయవ,140 మంది శరీర దానాలు చేయడానికి కృషి చేసినట్లు వేణు మాధవ్ తెలిపారు.మానవ మనుగడకు తోడ్పడుతున్న సదాశయ ఫౌండేషన్ సేవలను గ్రామ గ్రామానికి విస్తరించాలనే ఉద్దేశంతో ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రతినిధులసమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.సకాలంలో ప్రతినిధులు హాజరై విజయవంతం చేయగలరని వేణుమాధవ్ కోరారు.

# కోర్టుకు గైర్హాజరు అవుతున్న వ్యక్తి అరెస్ట్, జైలుకు తరలింపు



బెల్లంపల్లి, ఎప్రిల్17 (వుదయం ప్రతినిధి) బెల్లంపల్లి పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 సంవత్సరంలో నమోదు అయిన దొంగతనం కేసు లో చాలా రోజుల నుండి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుంటూ తిరుగుతున్న హారదీప్ సింగ్, పంజాబ్ రాష్టానికి చెందిన వ్యక్తి ని బెల్లంపల్లి టూ టౌన్ పోలీసులు ఛత్తీస్ గడ్ లో పట్టుకొని బెల్లంపల్లి కి తీసుకు వచ్చి గురువారం బెల్లంపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చి, అనంతరం ఆసిఫాబాద్ జిల్లా జైలుకు తరలించడం జరిగిందని బెల్లంపల్లి టూటౌన్ ఎస్ ఐ మహేందర్ తెలిపారు .

# అటవీ అధికారులపై దాడి కేసులో ఇద్దరి అరెస్ట్




జన్నారం, ఏప్రిల్ 17(వుదయం విలేకరి) అటవీ బీట్ అధికారులపై దాడి చేసిన కేసులు ఇద్దరిని అరెస్ట చేసి రిమాండ్ కు తరలించినట్లు జన్నారం ఎస్సై రాజ వర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ బర్తన్ పెట్ బీట్ నందు విధుల్లో ఉన్న ఎఫ్బిఓ రుబీనా తలత్,ఆమె భర్త అఫ్రోజ్ అలీ పై దాడి చేసినా కవ్వాల్ గ్రామానికి చెందిన ఎండీ.రియాజుద్దీన్,ఎండీ ఏజాజుద్దీన్ అను వారి పై నమోదు అయిన కేసు లో గురువారం రోజున వారిని లక్షెట్టిపేట జడ్జి ఎదురుగా హాజరు పరచగా న్యాయస్థానం వారికి 14 రోజులు రిమాండ్ విధించగా అక్కడే ఉన్న జైలుకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

# శ్రీ జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకున్న

ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి



అలంపూర్ ఏప్రిల్ 17 (వుదయం ప్రతినిధి)శ్రీ జోగులాంబ,బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఉమ్మడి నల్గొండ జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మ, స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి అర్.పురందర్ కుమార్ వారికి అమ్మ వారి, స్వామి వారి చిత్ర పఠమును అందజేశారు.

# తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ ని కలిసిన క్రాంతి కుమార్ బృందం.



హైదరాబాద్,ఏప్రిల్17(వుదయం పతినిధి): నూతనంగా చార్జ్ తీసుకున్న తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ శ్రీ డాక్టర్. షమీం అక్తర్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ జర్నలిస్టు క్రాంతి కుమార్ మరియు వారి బృందం అలాగే పూర్వపు తెలంగాణ ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి-( చైర్ పర్సన్ )శ్రీమతి శివాది ప్రవీణ, పదోన్నతి పొందిన జిల్లా న్యాయమూర్తి (రిటైర్డ్)-మెంబర్ జ్యూడిషియల్ మరియు డాక్టర్. బి. కిషోర్ ఐఏఎస్ రిటైర్డ్ , మెంబర్ నా జ్యుడీషియల్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ క్రాంతికుమార్, విఐపి హ్యూమన్ రైట్స్ నేషనల్ అసోసియేషన్ డైరెక్టర్ మున్నా, మరియు నేషనల్ సెక్రెటరీ అహమ్మద్,ఇక్బాల్, హైకోర్టు అడ్వకేట్స్ సుధా,జయ,ఎడ్విన్ మరియు పడాల రామిరెడ్డి కాలేజ్ "లా విద్యార్థులు జి.ప్రశాంత్, నర్సిరెడ్డి, దినేష్ పాల్గొన్నారు. తెలంగాణరాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ చైర్మన్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి మరియు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద పీస్ ఫుల్ ప్రొటెస్టు చేసిన సీనియర్ జర్నలిస్టు క్రాంతి మరియు వారి బృందం అట్టి కార్యక్రమం యొక్క కష్టం ఫలించిందని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ గారితో చర్చించడం జరిగింది. అలాగే చైర్మన్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తారని క్రాంతి కుమార్ వారి బృందం కోరారు, అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పెండింగ్ కేసులు తొందరగా పరిష్కరించే విధంగా తోడ్పడుతామని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ శ్రీ డాక్టర్. షమీం అక్తర్ అన్నారు.

# ఎలుకతుర్తి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి.

**గోడ పత్రిక ఆవిష్కరించిన బి ఆర్ ఎస్ పార్టీ నర్సంపేట మండల నాయకులు.**





నర్సంపేట వుదయం ప్రతినిధి ఏప్రిల్ 17. నర్సంపేట మండలంలోని ఇటుకలపల్లి, ఆకుల తండా, ఏనుగుల తండా, ఇప్పల్ తండ గ్రామలలో బి ఆర్ ఎస్ పార్టి బహిరంగ సభ ను జయప్రదం చేయాలని గ్రామ గ్రామ నా పార్టి సమావేశాలు నిర్వహించినారు. రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని మండల కమిటీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ రంగాల్లో విఫలం అయిందని మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ తెలిపారు. పార్టీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలని నర్సంపేట రూరల్ మండలం లోని ఇటుకలపల్లి, ఆకుల తండా,ఏనుగుల తండా, ఇప్పల్ తండ గ్రామాలలో సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 27 న ఎల్కతుర్తి లో నిర్వహించే బహిరంగ సభకు అందరు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలనీ కోరారు. అదేవిధముగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల్లో విఫలం అయిందని ఇట్టి విషయాన్ని ప్రజలకు తెలియజేసి బహిరంగ సభ కు తరలించాలని తెలిపారు. రైతు భరోసా కేవలం 3 ఎకరాలు ఉన్న రైతులకు మాత్రమె ఈ సీజన్ లో ఇచ్చారని మిగత రైతులకు వెంటనే రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నరసింహరాములు, క్లస్టర్ ఇన్చార్జి లు మోటూరి రవి, కడారి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ భూక్యా వీరన్న, మండల పార్టీ ఉపధ్యక్షుడు అల్లి రవి, ఇటుకాపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, ఆకుల తండ గ్రామ పార్టి అధ్యక్షుడు కూకట్ల రవి, ఇప్పల్ తండ గ్రామ పార్టి అధ్యక్షుడు ధరావత్ బద్దు, ఏనుగుల తండ గ్రామ పార్టి అధ్యక్షుడు (మాజీ సర్పంచ్) బానోతు రవి, మాజీ సర్పంచ్ లు మండల రవీందర్, భానోత్ శంకర్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ జమాల చంద్రమౌళి, వాడికారి గోపాల్,కుసుంబ కోటి, మండల రాజమౌళి, రాధరపు రాజు, నకినబొయిన సారంగం,
జామచెట్ల చేరాలు, సాంబయ్య, గజ్జి బాబు, హరీష్, సుమన్, కిషన్ నాయక్, బోయిని సమ్మాలు, పాసికంటి శంకర్ లింగం, కన్నెబోయిన రాజు, కూకట్ల కుమార్ ఉప్పునూతల వీరాచారి, గోపు సాంబయ్య, బానోతు దశ్రు, కిషన్, ధరావత్ దసురు, జై కిసాన్, బద్రు గ్రామ కమిటీ సభ్యులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత దంత వైద్య శిబిరం

పటాన్చెరు, ఏప్రిల్16(వుదయం ప్రతినిధి): రుద్రారంలోని ప్రభుత్వ పాఠశాలలో 'బ్రదర్ హుడ్ డే'ని ఇటీవల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థి విభాగం చరైవేతి నిర్వహించింది. గీతం ఆతిథ్య విభాగం ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం, బాలల మనస్సులో సామాజిక అవగాహన, ఐక్యత, కరుణను పెంపొందించేందుకు లక్ష్యించారు.
ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా నోటి ఆరోగ్యం, పరిశుభ్రతను ప్రోత్సహించడానికి మహేశ్వర మెడికల్ కళాశాల వైద్యులతో ఉచిత దంత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు.

# తాత్కాలిక షెడ్లు నిర్మించాలి వ్యాపారస్తుల వినతి పత్రం



రామకృష్ణాపూర్/ఏప్రిల్ 17(వుదయం ప్రతినిధి) క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ చౌక్ లో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారస్తులకు తాత్కాలిక షెడ్లని నిర్మించాలని మాజీ జెడ్పీటీసీ యాకూబ్ అలీ డిమాండ్ చేశారు. గురువారం వ్యాపారస్తులతో కలిసి కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్న వారికి గత సంవత్సరం మంజూరు అయిన నిధులతో షెడ్ నిర్మాణం ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి, చలి, వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాపారస్తులకు షెడ్ నిర్మాణం చేస్తే అటు వ్యాపారస్తులకు, ఇటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే షెడ్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వ్యాపారస్తులు పుల్లూరి సత్యనారాయణ, వెంకటి, స్వరూప, అనిల్, రమేష్, అపర్ణ, లక్ష్మి, బాగ్య, గంగమ్మ తదితరులు ఉన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ నర్సింగరావు



అలంపూర్ ఏప్రిల్ 17 (వు దయం ప్రతినిధి)మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన గ్రామీణ అభివృద్ధి పనులను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు పరిశీలించారు. బుధవారం మానవపాడు మండలంలోని మానవపాడు నుండి చందాపూర్ వరకు రైతులకు ఉపయోగపడే రహదారి నిర్మాణ పనులు పరిశీలించి, గ్రామీణ ప్రాంత రైతుల రవాణా సౌకర్యాల మెరుగుదలకు తోడ్పడే ఈ రోడ్ ఫార్మేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆలంపూర్ మండలంలోని ర్యాలంలాడు గ్రామంలో పశు కొట్టాల నిర్మాణం, నర్సరీ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల నాణ్యతను సమీక్షించిన అధికారులు వేగవంతంగా సమయపాలనతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలను సమర్థవంతంగా నిర్వహించి జూన్ నాటికి నర్సరీలోని మొక్కలు కనీసం మీటర్ ఎత్తులో ఉండేలా అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం అలంపూర్ లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగ్గా ఉండేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు వంద శాతం పని దినాలు కల్పించాలి. లేబర్ డిమాండ్ పై ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షగ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి పనిని సమర్థవంతంగా అమలు చేయాలనీ, ఉపాధి హామీ కూలీలకు నిరంతరంగా ఉపాధి కల్పించాలనీ అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా మైక్రో ప్లాన్లు సిద్ధం చేసి, లేబర్ మోబిలైజేషన్కు గ్రామస్థాయి లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో 100 మంది కూలీలు హాజరు అయ్యేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. కూలీలకు వేసవి కాలం నేపథ్యంలో త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతో పాటు కనీస వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు పద్మావతి, భాస్కర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఏపీఓలు పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులకు స్థలాల పంపిణీ



కాసిపేట ఏప్రిల్ 17 (వుదయం విలేకరి) కాసిపేట మండలం దుబ్బగూడెం గ్రామంలో కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ సంబంధిత భూ నిర్వాసితులకు ఆర్%ఆ%ఆర్ సెంటర్ స్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఈ సందర్భంగా 299 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వచ్చే ఏడాది వరకు ఆర్%ఆ%ఆర్ కాలనీలో వాటర్ ట్యాంక్, బడి, గుడి గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్వాడి కేంద్రం అన్నిరకాల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు సింగరేణి లో భూములు కోల్పోయిన మిగత భూ నిర్వాసితులను గుర్తించి పూర్తి స్థాయిలో సర్వే చేసి వారికి కూడా స్థలాలు కేటాంచాలని ఆర్డీవో హరికృష్ణ మందమర్రి సింగరేణి జిఎం దేవేందర్ ను ఆదేశించారు
ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, సింగరేణి అనుబంధ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# స్టిక్కర్ చాటున లిక్కర్ దందా..!

**ఏ షాప్ స్టాక్ ఆ షాప్ కె దిగుతుందా ఒక షాప్ ఇన్వాయిస్ స్టాక్ ఇంకో షాపు లో దిగుతుందా .?**
**సిండికేట్ బెల్ట్ షాప్ మద్యాన్ని తరలించే అడ్డగా మారిన ఉప్పరపల్లి వైన్స్ షాప్ నిర్వాహకులు**
**ఎస్ టి ఎఫ్ అధికారులు పట్టించుకోకపోవడంపై కారణాలేంటి..!**
**మా ముడుపులు 30 తారీఖున ముడుతాయి లేదా ఒకటి. నువ్వు ఎంత చెప్పుకున్నా చెప్పుకో నిర్వాహకులు**
**ఆటోలో మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తూ ఎమ్మార్పీ ధరల కంటే అధిక రేట్లకు అమ్ముతూ బెల్టు షాపులను పెంచి పోషిస్తున్న వైన్ షాప్ యజమాన్యం.**
**షాపులు సిండికేట్ అయి మద్యాన్ని ఇష్టానుసారంగా అధిక రేట్లకు బెల్ట్ షాపులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న యజమాన్యం పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు..!**



చెన్నరావుపెట. ఏప్రిల్17(వుదయం ప్రతినిధి): చెన్నారావుపేట మండలం లోని పలు గ్రామాల్లో తండాలో మద్యం ఏరులై పారుతుంది. అధికారుల అలసత్వంతో మద్యం మాఫియా గల్లికో బెల్టు షాపు ఏర్పాటు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నది. నివాస గృహాలు చిన్నచిన్న కిరాణా షాపుల్లోనూ కావాల్సినంత మద్యం దొరుకుతుంది. వైన్స్ బార్ షాపుల్లో సమయం ప్రకారం మద్యం లభ్యమవుతుండగా బెల్ట్ షాపుల్లో 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుంది. ఎప్పుడంటే అప్పుడు ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ వైన్ షాప్ లో దొరకని బ్రాండ్ బెల్ట్ షాపులో దొరుకుతున్నాయి. కిలోమీటర్ల మేర దూరంలోని వైన్ షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే రూ. 30 లేదా 40 ఎక్కువ ఇస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతుంది. మద్యం విక్రయాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో వైన్ షాపుల నిర్వాహకులు ఇస్తా రీతిగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో వైన్ షాప్ పరిధిలో కనీసం 20 నుండి 30చొప్పున బెల్టు షాపులు అనుబంధంగా పనిచేస్తున్నాయి. తమ టార్గెట్లు చేరుకునేందుకు బెల్టు షాపులను ఏర్పాటు చేయిస్తూ అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వైన్ షాప్ నిర్వాహకులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
వారి పరిధిలో ఉన్న షాపులోనే స్టాక్ తీసుకోవాలి. వేరే షాప్ లో తీసుకువస్తే వైన్ షాప్ నిర్వాహకులే వారి వర్కర్లని పెట్టి ఎక్సైజ్ అధికారుల మాదిరిగా చెకింగ్ చేపించి స్టాక్ గుంజుకోస్తారు...!
వైన్ షాప్ లో నుంచి ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఆటోలో డోర్ డెలివరీ చేస్తూ బెల్టు షాప్ లకు వైన్స్ షాప్ నిర్వాహకులు తరలించడం జరుగుతుంది. బెల్టు నిర్వాహకులు ఒక్కో క్వాటర్, బాటిల్ పై వారు కొనుగోలు చేసిన ధరపై 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో తండాల్లో అనే తేడా లేకుండా వాడ వాడన ఎక్కడ చూసిన బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. బెల్టు నిర్వాహకులు సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తూ మందు బాబులకు అందజేస్తున్నారు. బెల్ట్ షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే అమ్మకాలు ఏర్పాటు చేసి బార్ అండ్ రెస్టారెంట్ తలపించే విధంగా చికెన్,గుడ్లు, ఆమ్లెట్, తదితర ఆహార పదార్థాలను వండి వడ్డిస్తున్నారు. మరికొందరైతే ఆయా షాపు ఇన్వాయిస్ స్టాకు ఆ షాపులోనే దిగుతుందా లేదా లాభాల బాట చూపుతూ బెల్టు షాప్ లకు మద్యం తరలించే షాపులో దిగుతుందా.? అంటూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు..!

నిద్ర వ్యవస్థలో అబ్కారి శాఖ

విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్న విక్రయాలు కొనసాగుతున్న అబ్కారి శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అడ్డు అదుపు లేకుండా అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లిప్తతతో మద్యం కల్తీ కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. కల్తీ మద్యం కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. వైన్ షాప్ నిర్వాహకుల నుండి బెల్టు షాపుల నిర్వాహకుల నుండి అబ్కారి శాఖ అధికారులకు మామూళ్ళు అందుతున్నట్టున్నాయి. అందుకే పట్టించుకోవడంలేదని ప్రచారం జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని బెల్టు షాపులను పోషిస్తున్న వైన్ షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# బిజినెస్



## భారత్‌లో స్కోడా కోడియాక్ నయా వెర్షన్ లాంచ్..

భారతదేశంలో ప్రీమియం కార్లకు పెట్టింది పేరైన స్కోడా కంపెనీ తన కోడియాక్ కారు 2025 వెర్షన్‌లో భారత మార్కెట్‌లో లాంచ్ చేసింది. వినియోగదారులకు ఆకట్టుకోవడానికి సూపర్ ఫీచర్లతో ఈ కారును లాంచ్ చేయడంతో ఈ కారు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న టయోటా ఫార్చ్యూనర్, ఎంజీ గ్లోస్టర్ కార్లకు గట్టి పోటీనిస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. స్కోడా ఆటో ఇండియా తన సెకండ్ జెనరేషన్ 2025 స్కోడా కోడియాక్‌ను భారత మార్కెట్లో కస్టమర్ల కోసం విడుదల చేసింది. ఏడు రంగుల ఎంపికల్లో లాంచ్ చేసిన ఈ ఎస్‌యూవీను కంపెనీ రెండు వేరియంట్స్‌లో లాంచ్ చేసింది. స్పోర్ట్‌లైన్, ఎల్ అండ్ కే వెర్షన్స్‌లో లేటెస్ట్ అధునాతన లక్షణాలతో వస్తుంది. ముఖ్యంగా డిజైన్ విషయం గురించి మాట్లాడితే నూతన బంపర్లు, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, 18 అంగుళాల అల్లాయ్ వీల్స్, సీ షేప్డ్ ఎల్‌ఈడీ టెయిల్ లైట్లు, రూఫ్ రెయిల్‌లు వంటి మార్పులు స్కోడా కోడియాక్‌లో కనిపిస్తున్నాయి. ఈ ఫీచర్ల కారణంగా ఈ కారు లుక్ ప్రీమియంగా ఉంటుంది. ముఖ్యంగా స్కోడా 2025 వెర్షన్‌లో సైడ్ ప్రొఫైల్‌లో క్యారెక్టర్ లైన్లు లేకపోవడం వల్ల ఈ ఎస్‌యూవీ చాలా పొడవుగా కనిపిస్తుంది. ఈ కారు పొడవు దాదాపు 15 అడుగుల 7 అంగుళాలు. ఈ వెనుక భాగంలో కనెక్ట్ చేసిన ఎల్‌ఈడీ టెయిల్ లాంప్‌లు ఉండడం వల్ల ఈ కారుకు మంచి ప్రీమియం లుక్ వస్తుంది. అలాగా కోడియాక్ ఇంటీరియర్ విషయానికి వస్తే సాఫ్ట్ టచ్ మెటీరియల్‌తో ఆకట్టుకుంటుంది. ఈ కారులో మసాజ్, యాంబియంట్ లైటింగ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, కార్ ప్లే వరకు అనేక అధునాతన ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా మొబైల్ చార్జింగ్ కోసం సీట్ల వద్ద ప్రత్యేకంగా సీ–టైప్ ఛార్జింగ్ పోర్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. స్కోడా కోడియాక్ కారులో 12.9–అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, త్రీ జోన్ క్లైమేట్ కంట్రోల్ సిస్టమ్, పనోరమిక్ సన్‌రూఫ్, ముందు సీట్లలో హీటింగ్, వెంటిలేషన్ సిస్టమ్, మసాజ్ ఫంక్షన్, స్లైడింగ్, రిక్లైనింగ్ సీటు, సబ్‌వూఫర్‌తో ప్రీమియం 13 స్పీకర్ ఆడియో సిస్టమ్ వంటి తాజా ఫీచర్లు ఆకట్టుకుంటున్నాయి. స్కోడా కోడియాక్ కారును డిజైన్ చేసేటప్పుడు కస్టమర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ ఎస్‌యూవీలో 9 ఎయిర్‌బ్యాగ్‌లతో పాటు 360 డిగ్రీల వ్యూ కెమెరా, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, యాంటీ–బ్రేకింగ్ సిస్టమ్, ఈబీడీ, హిల్ స్టార్ట్ అసిస్ట్, హిల్ డీసెంట్ కంట్రోల్ వంటి భద్రతా లక్షణాలు ఆకట్టుకుంటాయి. స్కోడా కోడియాక్ 2025 వెర్షన్‌లో 2.0 లీటర్ నాలుగు సిలిండర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో, 7 స్పీడ్ డీసీటీ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో వస్తుంది. ఈ శక్తివంతమైన ఇంజిన్ 201 బీహెచ్‌పీ శక్తిని మరియు 320 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు స్పోర్ట్‌లైన్ వేరియంట్ ధరను రూ.46 లక్షల 89 వేలు (ఎక్స్–షోరూమ్)గా నిర్ణయించారు. అలాగే ఎల్ అండ్ కే వేరియంట్‌ను కొనుగోలు చేస్తే మీరు రూ. 48 లక్షల 69 వేలు (ఎక్స్–షోరూమ్) ఖర్చు చేయాల్సి ఉంటుంది. స్కోడా కంపెనీ నుంచి అప్‌డేటెడ్ కోడియాక్ రిలీజ్ చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న టయోటా ఫార్చ్యూనర్, ఎంజీ గ్లోస్టర్ వంటి వాహనాలకు గట్టి పోటీని ఇస్తుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.






## సూపర్ స్మార్ట్ ఫీచర్లు తెలిస్తే షాక్..!

భారతదేశంలో స్కూటర్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో స్కూటర్ల వాడకాన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఆటోమొబైల్ కంపెనీలు స్కూటర్లను లాంచ్ చేశాయి. దేశంలో స్కూటర్ల అమ్మకాల్లో అగ్రగామిగా ఉన్న హోండా తాజాగా తన డియో 2025 వెర్షన్ లాంచ్ చేసింది. హోండా మోటార్ సైకిల్ & స్కూటర్ ఇండియా 2025 డియోను ఇటీవల భారత మార్కెట్లో విడుదల చేసింది. అప్‌డేటెడ్ డియో స్కూటర్ కాస్మెటిక్ మార్పులు, ఓబీడీ2–కంప్లైంట్ ఇంజిన్, కొత్త ఫీచర్లతో వస్తుంది. 2025 హోండా డియో రెండు వేరియంట్లలో అమ్ముతున్నారు. డీఎల్ఎక్స్, హెచ్–స్మార్ట్ పేరుతో రిలీజ్ చేసే అప్‌డేటెడ్ స్కూటర్ల ధర రూ.96,749,రూ.1,02,144గా ఉంటుంది. 2025 హోండా డియో ఇప్పుడు కొత్త 4.2 అంగుళాల టీఎఫ్‌టీ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్‌తో వస్తుంది. తాజా అప్‌డేటలో మైలేజ్ ఇండికేటర్లు, ట్రిప్ మీటర్, ఎకో ఇండికేటర్, పరిధి వివరాలను చూడవచ్చు. నావిగేషన్, కాల్/మెసేజ్ అలర్ట్ వంటి ఫంక్షన్లను ఎనేబుల్ చేసే హోండా రోడ్ సింక్ యాప్ సపోర్ట్ కూడా ఉంది. ముఖ్యంగా రైడర్లు ప్రయాణంలో ఉన్నప్పుడు కనెక్ట్ అయి ఉండటానికి వీలు కల్పిస్తుంది. మొబైల్ పరికరాలను ఛార్జ్ చేయడానికి స్మార్ట్ కీ, యూఎస్‌బీ టైప్–సీ పోర్ట్ కూడా ఉన్నాయి. 2025 హోండా డియో ఐదు రంగుల ఎంపికల్లో అందుబాటులో ఉంటుంది. మ్యాట్ మార్వెల్ బ్లూ మెటాలిక్, పెర్ల్ డీప్ గ్రౌండ్ గ్రే, పెర్ల్ స్పోర్ట్స్ ఎల్లో, పెర్ల్ ఇగ్నియస్ బ్లాక్, ఇంపీరియల్ రెడ్ కలర్స్‌లో అందుబాటులో ఉంటుంది. 2025 హోండా డియో 123.92 సీసీ, సింగిల్–సిలిండర్ ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది ఎయిర్–కూల్డ్, ఫ్యూయల్– ఇంజెక్టెడ్ 8.19 బీహెచ్‌పీ, 10.5 ఎన్ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. ఇంధన వినియోగం, ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడే ఐడ్లింగ్ స్టార్ట్/స్టాప్ సిస్టమ్ ఈ స్కూటర్ ప్రత్యేకతగా ఉంటుంది. ఈ లాంచ్‌పై హోండా మోటార్ సైకిల్ %ు% స్కూటర్ ఇండియా సేల్స్ %ు% మార్కెటింగ్ డైరెక్టర్ యోగేష్ మాథుర్ మాట్లాడుతూ కొత్త ఓబీడీ2బీ వెర్షన్ డియో 125 రిఫ్రెష్డ్ గ్రాఫిక్స్, అధునాతన టీఎఫ్‌టీ డిస్‌ప్లే, మెరుగైన కనెక్టివిటీ లక్షణాలతో ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. ఈ స్కూటర్ ట్రెండీ, నమ్మకమైన మోటో–స్కూటర్ కోసం

## అమెరికాపై సరికొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తున్న డ్రాగన్

సుంకాల సెగతో హీట్ పుట్టిస్తున్న ట్రంప్ నిర్ణయాలు పారిశ్రామిక ప్రగతిని అడ్డుకుంటుందనే చర్చ జరుగుతోంది. టారిఫ్‌ల పెంపుతో చైనా నుంచి దిగుమతి చేసుకునే మెటల్ కాస్ట్ పెరుగుతుందని.. దీంతో వినియోగదారులపై అధిక భారం పడుతుందని ఇప్పటికే కంపెనీలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పుడు ఏకంగా చైనా ఎగుమతులే నిలిపివేయడంతో అమెరికా ఏం చేయబోతుందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా కనిపిస్తోంది. అమెరికా – చైనా మధ్య ట్రేడ్ వార్ పీక్స్‌కి వెళ్తోంది. టారిఫ్‌లలో ఇరు దేశాలు తగ్గబోమని తేల్చేసన్తా.. ఉద్రిక్త పరిస్థితులను అంతకంతకు పెంచుతున్నాయి. ఈ క్రమంలో చైనా కీలక ఖనిజాల ఎగుమతిని నిలిపివేసింది. వెపన్స్, ఎలక్ట్రానిక్స్, కార్లు, విమానాలు, సెమీ కండక్టర్ల తయారీలో కీలకమైన ఖనిజాల ఎగుమతులను నిలిపివేసింది. చైనా కొత్త ఎగుమతి విధానాన్ని రూపొందిస్తుండటంతో అమెరికా ఇబ్బందికర పరిస్థితుల్లో పడటం ఖాయంగా కనిపిస్తోంది. ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా – చైనా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకి ముదురుతోంది. ఈసారి



చైనా ఓ కొత్త ఆయుధాన్ని బయటకు తీసింది. అదే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్. ఈ ఖనిజాలు లేకుంటే ఆధునిక ప్రపంచ స్తంభించిపోతుంది. కార్ల తయారీ నుంచి క్షిపణుల వరకు.. స్మార్ట్ ఫోన్ల నుంచి విమానాల వరకు.. ప్రతిదీ ఈ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌తోనే తయారవుతాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా వస్తువులపై ప్రతీకార పన్నులు పెంచడంతో డ్రాగన్ కంట్రీకి కోపం వచ్చింది. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఎగుమతి నిలిపివేసింది. దీంతో అమెరికాలో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఆయుధ పరిశ్రమలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ప్రపంచంలో 90–శాతం రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ చైనాలోనే ఉత్పత్తి అవుతున్నాయి. అమెరికాలో ఒక్క గని మాత్రమే ఉంది. దీంతో అగ్రరాజ్యం పూర్తిగా చైనాపైనే ఆధారపడాల్సి వస్తోంది. శాశ్వత అయస్కాంతాల్ను, ఇతర ఉత్పత్తుల ఎగుమతిని కూడా చైనా నిలిపివేయడంతో వీటిని భర్తీ చేయడం అమెరికాకు కష్టమే. ఈ నిర్ణయం రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. కేవలం అమెరికాకు మాత్రమే కాకుండా మిగతా దేశాలకు కూడా చైనా ఎగుమతులు నిలిపివేసింది. ఖనిజాల తవ్వకం.. ప్రాసెసింగ్‌పై తన ఆధిపత్యాన్ని చూపించేందుకు చైనా ఈ నిర్ణయం తీసుకున్నట్టు క్లియర్‌గా కనిపిస్తోంది. అమెరికా కొన్ని రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ నిల్వ చేసినప్పటికీ.. అది సైనిక కాంట్రాక్టర్లకు శాశ్వతంగా సరఫరా చేయడానికి ఏమాత్రం సరిపోదు. హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌పై ఆంక్షలు చాలా కీలకంగా మారాయి. అయస్కాంతాలు ఎలక్ట్రిక్ కార్లు, డ్రోన్లు, రోబోట్లు, క్షిపణులు, అంతరిక్ష నౌకలు, గ్యాసోలిన్–శక్తితో నడిచే కార్ల తయారీకి అవసరం. ఇవి జెట్ ఇంజన్లు, లేజర్‌లు, కార్ హెడ్‌లైట్లు, కొన్ని స్పార్క్ ప్లగ్‌లు, కెపాసిటర్‌ల తయారీకి అవసరం. ఇవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సర్వర్‌లు, స్మార్ట్‌ఫోన్‌లకు శక్తినిచ్చే కంప్యూటర్ చిప్‌లలోని విద్యుత్ భాగాలు. చైనా ఈ చర్యతో అమెరికాకు పెద్ద షాక్ ఇచ్చింది. అమెరికా ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటుందో చూడాలి..!

## పెళ్లి అయినవారి దగ్గర ఎంత బంగారం ఉంచుకోవచ్చు..?

భారతీయులకు బంగారానికి అవినాభావ సంబంధం ఉంది. భారతదేశంలో బంగారం అనేది ఆభరణాలుగా మాత్రమే కాకుండా.. ఆర్థిక భద్రతకు కూడా కీలకంగా ఉంటుంది. సంక్షోభ సమయాల్లో ఇది ఆదుకుంటుందనే భరోసా. సురక్షిత పెట్టుబడి సాధనంగా కూడా భావిస్తారు. పెద్దమొత్తంలో కొని రేట్లు పెరిగినప్పుడు అమ్ముతుంటారు. గోల్డ్ ఫండ్స్‌లో




పెట్టుబడులు పెట్టి సంపాదిస్తున్న వారు కూడా ఉన్నారు. అందుకే ఇప్పుడు బంగారంపై పెట్టుబడి బహురూపాలుగా విస్తరించింది. అయితే గతంలో బంగారానికి లెక్కా పత్రం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మాత్రం ఖచ్చితంగా లెక్కలుండాల్సిందే. పన్ను కట్టాల్సిందే. ఆభరణాలు, నాణేలు, బార్లు రూపంలో బంగారాన్ని కొనుగోలు చేస్తే వాటిని ఎంత కాలానికి విక్రయించారు అనే అంశంపై పన్ను ఆధారపడి ఉంటుంది. బంగారాన్ని కొనుగోలు చేసిన 3 సంవత్సరాల్లోపు విక్రయిస్తే స్వల్ప కాలంగానూ.. మూడేళ్లు మించితే దీర్ఘకాలంగానూ పరిగణించి మూలధన లాభంపై పన్ను విధిస్తారు. దీర్ఘ కాల పెట్టుబడులపై లాభాలు వస్తే పన్నులు కట్టాల్సి ఉంటుంది. బంగారాన్ని అమ్మి లాభాలు సంపాదిస్తే అందులో 20 శాతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ఖచ్చితంగా కట్టాల్సిందే. బంగారం కొన్న మూడేళ్ల తర్వాత అమ్మితే ఎంత మొత్తంలో లాభం వచ్చిందో అందులో ఇరవై శాతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ కింద ప్రభుత్వానికి చెల్లించాల్సిందే. దానికి మినహాయింపులు లేవు. అలాగే గోల్డ్ బాండ్స్‌లో పెట్టుబడులు పెట్టినప్పుడు కూడా ఆ బాండ్స్‌లో వచ్చే లాభంలో ప్రభుత్వానికి కొన్ని స్కీములను బట్టి 10 నుంచి 20 శాతం వరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇక భారత ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం.. ఇంట్లో ఎంత బంగారం అయినా దాచుకోవచ్చు. అయితే దీనికి కచ్చితమైన ప్రూఫ్స్ ఉండాలి. నిర్ణీత పరిమితికి మించి బంగారాన్ని ఇంట్లో ఉంచుకుంటే.. దానికి సంబంధించిన రుజువులు చూయించాలని చెబుతోంది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్. బంగారం కొనుగోలు రిసిప్ట్స్ నుంచి దానికి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేది చూయించాల్సి వస్తుంది. పరిమితికి మించి బంగారం ఉన్నట్లయితే అప్పుడు రుజువులు చూయించాలి లేకుంటే ఆదాయపు పన్ను శాఖ దీనిని సీజ్ చేస్తుంది.

## బిల్‌గేట్స్ నుంచి విడాకులకు ఆదే కారణం..

### ఓపన్ అయిన మెలిండా..



ఇటీవల కాలంలో లేటు వయసు విడాకులు ఎక్కువఅవుతున్నాయి. ఇన్నేళ్ల దాంపత్యం తర్వాత తాము ఏం కోల్పోయామో వెతుకుతూ విడిపోతున్నారు. మానసిక నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో లేటు వయసు విడాకులు ఎక్కువఅవుతున్నాయి. ఇన్నేళ్ల దాంపత్యం తర్వాత తాము ఏం కోల్పోయామో వెతుకుతూ విడిపోతున్నారు. మానసిక నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, మెలిండా ఫ్రెంచ్ గేట్స్ దంపతులు అధికారికంగా విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. 1994లో పెళ్లి చేసుకున్న ఈ జంట 2021లో తమ 27 ఏళ్ల దాంపత్యానికి గుడ్‌బై చెప్పారు. అయితే తమ విడాకులపై ఇరువురు పెద్దగా స్పందించింది లేదు. అదో విచారకర సందర్భంగా బిల్‌గేట్స్ విడాకుల తొలినాళ్లలో పేర్కొన్నారు. మెలిండా ఫ్రెంచ్ గేట్స్ కూడా ఇప్పటి వరకు మళ్లీ ఆ ఊసే ఎత్తలేదు. అయితే ఆమె తొలిసారిగా విడాకులు గురించి ఓ ఇంటర్వ్యూలో స్పందించడం ఆసక్తిగా మారింది. "అత్యంత సన్నిహిత బంధంలో విలువలతో జీవంచలేని పరిస్థితి ఎదురైతే విడాకులు తప్పనిసరి అవసరంగా మెలిండా చెప్పుకొచ్చారు. అయితే బిల్‌గేట్స్ గురించి మాత్రం మాట్లాడనని చెప్పేశారు. ఇప్పుడు ఎవరి సొంత జీవితాలు వారివి అయిపోయాయి. ప్రస్తుతం చాలా సంతోషంగా ఉన్నాను. నిజానికి విడాకులు అనేది భావోద్వేగంతో కూడుకున్న భారమైన చర్య అన్నారు. విడాకుల సమయంలో తానెంతో భయపడినట్లు చెప్పారు. దాంపత్య బంధం వదులుఉంటున్నప్పుడు ఎంతో బాధగా ఉంటుందన్నారు. ఆ తర్వాత తాను నెమ్మదిగా దాని విలువ అర్థం చేసుకుని నిశబ్దంగా నిష్క్రమించానన్నారు. తాను భయాందోళనలకు గురవ్వడం అంటే తాను దెబ్బతిన్నట్లు కాదన్నారు మెలిండా. కొన్ని కష్టాలను ఎదుర్కొన్నందువల్లే విడిపోవాల్సి వచ్చిందని చెప్పారు.

## 10 గ్రాముల గోల్డ్ ధర ఎంతో తెలిస్తే.

ఒకప్పుడు మనదేశంలో పది గ్రాముల బంగారం ధర 100 రూపాయలుండేది. ఇప్పుడు అదే పది గ్రాములు లక్షకు చేరుకుంటోంది. వంద నుంచి లక్ష దాకా సాగిన బంగారం జర్నీలో ఎన్నో మలుపులు. ప్రతీ మలుపూ ఆసక్తికరమే. మీరు నమ్మేరు నమ్మకపోయేరు.. 1959లో పది గ్రాములు పసిడి ఫస్ట్‌టైమ్ 100 రూపాయలను టచ్ చేసింది. 20 ఏళ్ల తర్వాత 1979లో అదే పదిగ్రాముల బంగారం ధర వెయ్యి రూపాయలైంది. అది కాస్తా 2007 నాటికి 10వేలు అయింది. ఇలా పదింతలు పెరగడానికి పట్టిన సమయం 28 ఏళ్లు. వెయ్యి నుంచి 10వేలు పెరగడానికి దాదాపు మూడు దశాబ్దాలు తీసుకున్న కనకం.. 40వేల రూపాయలు పెరగడానికి జస్ట్ నాలుగంటే నాలుగే ఏళ్లు తీసుకుంది. 2021లో తులం బంగారం 50వేలుంటే.. ఈ ఏడాది ఏకంగా 90వేలు దాటింది. గోల్డ్ రేట్ వంద నుంచి వెయ్యి రూపాయలు పెరగడానికి 20 ఏళ్లు పట్టింది. వెయ్యి నుంచి 10వేల రూపాయలకు పెరగడానికి ఏకంగా 28 ఏళ్లు తీసుకుంది. అదే తులం బంగారం 10వేల నుంచి 50వేల రూపాయలను టచ్ చేయడానికి జస్ట్ 14 ఏళ్లు మాత్రమే పట్టింది. జాగ్రత్తగా గమనిస్తే.. 10వేలు ఎప్పుడైతే దాటిందో అప్పటి నుంచి బంగారం పరుగులు మొదలయ్యాయి. ఈ 14 ఏళ్ల పీరియడ్‌లోనే.. ప్రపంచంలో అత్యంత విలువైన మెటల్‌గా ఉన్న ప్లాటినంను కూడా క్రాస్ చేసి.. దాన్ని తొక్కుకుంటూ పైకి ఎగబాగింది గోల్డ్. అప్పటి వరకు అత్యధిక ధర పలికి.. మెటల్స్‌లో రారాజుగా బతికిన ప్లాటినం.. బంగారం దూకుడును తట్టుకోలేకపోయింది.

# జాతీయం – అంతర్జాతీయం



## ఈడి సమన్లు రాజకీయ ప్రతీకార చర్య

న్యూఢిల్లీ :ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) సమన్లు రాజకీయ ప్రతీకార చర్యగా వ్యాపారవేత్త, ప్రియాంకగాంధీ భర్త రాబర్ట్ వాద్రా అభివర్ణించారు. ప్రతిపక్షాల గొంతుకలను అణచివేసేందుకు మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. గురువారం కూడా ఆయన విచారణకు హాజరయ్యారు. వరుసగా మూడవ రోజు విచారణ కోసం ఈడి కార్యాలయానికి చేరుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. బిజెపియేతర పార్టీల నేతలు లక్ష్యంగా చర్చలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడి నిష్పాక్షిత ఏముందని ప్రశ్నించారు. అన్యాయంపై తన పోరాటం కొనసాగుతుందని ప్రతిజ్ఞ చేశారు. తనను ఒత్తిడికి గురిచేసినా, వేధించినా కుంగిపోనని, అంతే బలంగా ఎదుగుతానని అన్నారు.

ప్రజల బలం తనకు ఉందని అన్నారు. ప్రజల తరపున, వారికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటానని, తనని ఎవరూ ఆపలేరని అన్నారు. గురుగ్రామ్ భూమి కేసులో రాబర్ట్‌వాద్రాకు ఈడి సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. విచారణ కొనసాగుతోందని, తాను 2019లో సమాధానం ఇచ్చిన ప్రశ్నలనే తిరిగి అడిగారని అన్నారు. తప్పు చేసినట్లు ఆధారాలు లేవని,

ఈ కేసులో బిజెపి ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖతార్ తనకు రెండుసార్లు క్లీన్‌చిట్ ఇచ్చారని అన్నారు. మళ్లీ సమన్లతో వేధిస్తున్నారని అన్నారు.

## పనికి మాలిన హార్వర్డ్ ప్రముఖ వర్శిటీపై ట్రంప్ ఫైర్



వాషింగ్టన్ : హార్వర్డ్ వర్శిటీ పేరు గొప్ప ఊరు దిబ్బ బాపతు అని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. హార్వార్డ్ ఓ జోక్ అని, అది చదవుకునే వేదిక కాదని తెలిపారు. ఇటీవలే అమెరికాలో ట్రంప్ అధికార యంత్రాంగం హార్వర్డ్ విద్యాసంస్థకు దాదాపుగా 2.3 బిలియన్ డాలర్ల గ్రాంటును నిలిపివేసింది. ఇకపై ఈ సంస్థ కార్యకలాపాలను కుదించాల్సి ఉందని కూడా ఉత్తర్వులు వెలువరించారు. దీనితో ఈ ప్రముఖ సంస్థ మనుగడ ప్రశ్నార్థకం అయింది. హార్వర్డ్ ఎప్పుడూ జాతి విద్వేషకర ధోరణులకు పాల్పడుతూ వస్తోంది. సంకుచిత భావాల వారితో వర్శిటీని నింపుతున్నదని, ఫలితం కూడా ఈ విధంగానే ఉంటోందని చెప్పారు. హార్వర్డ్‌కు ఇంతవరకూ ఉన్న పన్నుల మినహాయింపు సౌకర్యాన్ని ఎత్తివేయడం జరుగుతుందని కూడా ట్రంప్ హెచ్చరించారు. కొన్ని నగరాల మేయర్ల నుంచి ఈ సంస్థకు అడ్డగోలుగా నిధులు అందుతున్నాయి. వీటి దుర్వినియోగం జరుగుతోందని విమర్శించారు. న్యూయార్క్, చికాగోల డెమోక్రాట్ మేయర్లు వామపక్ష భావజాలంతో వ్యవహరిస్తున్నారని, వీరి ధోరణి ప్రమాదకరంగా మారిందని విమర్శించారు. హార్వర్డ్ ఇటీవలి కాలంలో అగ్రశ్రేణి వర్శిటీల జాబితాలో ఎక్కడా కన్పించడం లేదని, వెనుకబడుతోందని, పైగా విద్వేషకర భావజాలానికి వేదిక అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విద్యాసంస్థ వ్యవహారం ఇప్పుడు ఓ జోక్‌గా మారింది. అందరికి షాకు ఇస్తోందని విమర్శించారు.

## డ్రగ్స్ దందాలో ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సిఎస్ కుమారుడు?

అమెరికాలోని ఫ్లోరిడా, కాలిఫోర్నియాలో పండించే ఓజీ కుష్ అనే డ్రగ్స్‌తో పాటు విదేశీ మ ద్యం బాటిళ్లను తెలంగాణ ఎస్‌టిఎఫ్, ఎక్సైజ్ పోలీసులు సం యుక్తంగా పట్టుకున్నారు. ఇద్దరు డ్రగ్స్ పెడ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి చెప్పారు. వీరిద్దరిలో ప్రితీష్ భట్ అనే వ్యక్తి ఉత్తరప్రదేశ్ మాజీ సిఎస్ తనయుడిగా భావిస్తున్నారు. స్కోడా కారు, గంజాయి, సింథటిక్ డ్రగ్స్, చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నాంపల్లి ఎక్సైజ్ భవన్‌లో ఏ ర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. 'కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద బైక్‌పై ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. స్కోడా కారులో మరో వ్యక్తి ఓజీ కుష్ డ్రగ్స్‌ను మార్పిడి చేసుకునే సమయంలో ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీలు చేయగా 500 గ్రాముల ఓజీ కుష్ డ్రగ్, కెజి గంజాయి, 6 గ్రాముల చరస్, 4.38 గ్రాముల సింథటిక్ డ్రగ్స్‌తో పాటు 5 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాం. ఇద్దరు నిందితులు లను అరెస్టు చేశా'మని ఖురేషి వెల్లడించారు. మరో వ్యక్తి జయసూర్యగాగా గుర్తించారు. కాగా, అతడు ప్రీతిష్ భట్ స్నేహితుడిగా భావిస్తున్నారు.

## చదువుకు వస్తే గెటౌట్ అంటావా ట్రంప్



వీసా రద్దు, దేశం నుంచి వెళ్లిపోవాలనే హెచ్చరికలపై భారతీయ విద్యార్థిని ఒక్కరు ట్రంప్‌పై కేసు వేశారు. వందలాది మంది అంతర్జాతీయ విద్యార్థుల కోత, వారిని స్వదేశాలకు పంపించడం జరుగుతున్న నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసకుంది. భారత్‌కు చెందిన చిన్మయ్ డియోరె అమెరికాలోని వాయ్నే విశ్వవిద్యాలయ విద్యార్థిని. తాను అమెరికాకు చదువుకోవడానికి వచ్చానని, నేరం చేయడానికి కాదని, తనను ట్రంప్ ఏ అధికారంతో తిప్పి పంపిస్తారని ఈ చిన్మయ్ ప్రశ్నించారు. తమకు అమెరికాలో చట్టపరంగా ఉండే అవకాశాలు కల్పించాలని ఇప్పటికే పలువురు విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. తమ చదువులకు గండి కొడితే తమ భవిత ఏమవుతుందని వీరు వేస్తున్న పిటిషన్లు ఇప్పుడు తీవ్రస్థాయి చర్చనీయాంశాలు అయ్యాయి. తమపై నేరపూరిత చర్యలు పైగా మరీ చిల్లర దొంగతనాలు, ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి కేసులను పెట్టి తిప్పి పంపే వ్యవహారం సాగుతోందని భారతీయ విద్యార్థులు మండిపడుతున్నారు. ట్రంప్ ఏకపక్ష చర్యలను తాము చట్టపరంగా కోర్టులోనే ఎదుర్కొంటామని, తమకు న్యాయం జరుగుతుందని చిన్మయ తెలిపారు. ఒకే వర్శిటీలో విద్యార్థులు ముగ్గురు ట్రంప్‌పై కేసు పెట్టారు, వీరిలో చైనాకు చెందిన ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నారు. ట్రంప్‌తో పాటు హోంల్యాండ్ సెక్రెటరీ, ఇమిగ్రేషన్ అధికారులను కేసులో ప్రతివాదులుగా చేర్చారు. తమకు ఎటువంటి వివరణకు అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించారని, తమ స్టూడెంట్ ఇమిగ్రేషన్ స్థాయిని ట్రంప్ ఒక్క వేటుతో రద్దు చేసి పారేశారని, ఇది అన్యాయం అని ఓ ప్రభుత్వాధినేత వైఖరి వల్ల విద్యార్థులు విద్యా అవకాశాలు కోల్పోవాల్సిందేనా? అని పిటిషన్లలో ప్రశ్నించారు.

స్టూడెంట్ స్టేటస్, విద్యార్థుల వినిమయ సంబంధిత సెవిస్ వ్యవస్థను ట్రంప్ ఏ విధంగా బేఖాతరు చేస్తారని భారతీయ విద్యార్థిని తమ పిటిషన్‌లో సమగ్ర రీతిలో నిలదీశారు. విచారణ తరువాత పరిణామాలను పక్కకు పెడితే ఇప్పటికే ఈ అమ్మాయి పిటిషన్ మీడియా పరంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రకంపనలకు దారితీసింది.

## ట్రంప్ టారిఫ్‌లతో పెరగనున్న ద్రవ్యోల్బణం



చికాగో : ట్రంప్ ప్రతీకార సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగనుందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ హెచ్చరించారు. ట్రంప్ పరిపాలనలో విధాన మార్పులు అమెరికా కేంద్ర బ్యాంకును ఊహించని ప్రమాదంలో పడేశాయని అన్నారు. ట్రంప్ టారిఫ్‌లతో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వాణిజ్య యుద్ధం దేశీయ పరిశ్రమలపై కూడా పడనుందని అన్నారు. ట్రంప్ టారిఫ్‌లపై బుధవారం ఆయన చికాగోలో ప్రసంగించారు. ఇప్పటివరకు ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల పెంపుదల స్థాయి ఊహించిన దానికంటే అధికంగా ఉందని, ఈ సమస్య చుట్టూ కొనసాగుతున్న అనిశ్చితి శాశ్వత ఆర్థిక నష్టాన్ని కలిగించవచ్చని పావెల్ హెచ్చరించారు. ఉపాధిని ప్రోత్సహించడం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం ఫెడ్ బాధ్యత. కానీ ట్రంప్ సుంకాలు ఆ రెండింటి లక్ష్యాలను ప్రభావితం చేయనున్నాయని అన్నారు. తాజా సమాచారం ప్రకారం.. అమెరికా ఆర్థిక వ్యవస్థ బాగానే ఉందని, కానీ మందగించే సూచనలు ఉన్నాయని అన్నారు. సుంకాలు కొనసాగుతూ ఉన్నప్పుడు, వాటిలో కొంతభాగాన్ని ప్రజలు చెల్లించాల్సివచ్చినపుడు ద్రవ్యోల్బణం పెరుగుతుందని సూచించారు. అధిక అనిశ్చితి నెలకొనడంతో మార్కెట్లలో అస్థిరతను గుర్తించామని అన్నారు.

## హిందూయేతరులను దేవాలయాల నిర్వహణకు అనుమతిస్తారా?



న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) చట్టంలో చేసినట్లుగా, దేవాలయాలను నిర్వహించే సంస్థలలో హిందూయేతరులను చేర్చడానికి అనుమతిస్తారా.. అని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం నిలదీసింది. హిందూ ఎండోమెంట్ల సలహా బోర్డులో హిందూయేతరులను ఎందుకు ఉంచకూడదు.. అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. వక్ఫ్ సవరణ బిల్లు చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం ప్రారంభించింది. వక్ఫ్ సవరణ చట్టంలో మూడు అంశాలపై స్టేకు అవకాశం ఉందని, కాబట్టి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను చేర్చడం, వక్ఫ్ ఆస్తులపై వివాదాలను పరిష్కరించడంలో కలెక్టర్ల అధికారాలు, వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను కోర్టులు డీ-నోటిఫై చేయడం వంటి నిబంధనలు ఇందులో ఉన్నాయి. అయితే ధర్మాసనం ఆ మేరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. కానీ నేడు (గురువారం) ఈ విషయాన్ని మళ్ళీ విచారించనుంది. సవరణ చట్టంలోని కొన్ని నిబంధనలు తీవ్రమైన పరిణామాలను కలిగి ఉన్నాయని, అందువల్ల, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడాన్ని పరిశీలిస్తామని పేర్కొంది. వక్ఫ్ బిల్లు చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసి, కాంగ్రెస్ ఎంపి మహమ్మద్ జావేద్, టిఎంసి ఎంపి మహువా మొయిత్ర, ఎస్‌పి ఎంపి జియా ఉర్ రెహమాన్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్, సిపిఐ, వైసిపి, డిఎంకె పార్టీలు, టివికె అధినేత విజయ్, జమైత్ ఉలేమా హింద్, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చరాదని ధర్మాసనం ముందు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు. "చట్టం ప్రకారం" అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని కపిల్ సిబాల్ విన్నవించారు. "చట్టం ప్రకారం" అనే పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని ఆయన కోర్టుకు తెలిపారు. వక్ఫ్-అలల్-ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదని అన్నారు. దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదు? అంటూ కపిల్ సిబాల్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.



## సొంత పౌరులపైనే ఇజ్రాయెల్ బాంబు దాడి

గాజా : గాజా స్ట్రిప్‌లోని హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ బాంబు దాడులు చేస్తున్న విషయం విదితమే. హమాస్‌ను తుడిచిపెట్టడమే తమ లక్ష్మమని, అప్పటి వరకు గాజాపై దాడులు ఆపబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇదివరకే ప్రకటించారు. ఈ క్రమంలో బుధవారం గాజా స్ట్రిప్‌పై దాడికి బయలుదేరిన ఒక ఫైటర్‌జెట్ పొరపాటుప ఇజ్రాయెల్ భూభాగంపైనే బాంబు జార విడిచింది. దక్షిణ గాజా సరిహద్దుకు రెండు మైళ్ల ఇవతల నిర్ యితాక్ అనే ప్రాంతంలో క్షిపణి దాడి జరిగింది.అయితే, ఈ క్షిపణి మైదాన ప్రాంతంలో పడడంతో ప్రాణ నష్టం తప్పిందని, పౌరులు ఎవరికీ ఎటువంటి గాయాలూ కాలేదని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) ఒక ప్రకటనలో తెలిపింది. టెక్నికల మాల్‌ఫంక్షన్ వల్లే ఈ పొరపాటు చోటు చేసుకుందని ఐడిఎఫ్ వివరణ ఇచ్చింది. ఇజ్రాయెల్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రకారం నిర్ యితాక్ ప్రాంతంలో సుమారు 550 మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రధాని నెతన్యాహు ఉత్తర గాజాలో పర్యటిస్తున్న సమయంలోనే ఈ పొరపాటు జరగడం గమనార్హం.

## ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ పారిస్‌లో జర్నలిస్టుల ర్యాలీ



పారిస్: గాజాలో జర్నలిస్టులపై దానికి ఖండిస్తూ పారిస్‌లోని ఐఫెల్ టవర్ వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. జర్నలిస్టులు, పత్రికా స్వేచ్ఛా కార్యకర్తలు ర్యాలీగా ఐఫెల్ టవర్ వద్దకు చేరుకొని ఇజ్రాయిల్ దాడుల్లో 200 మంది పాలస్తీనియన్ జర్నలిస్టులకు నివాళులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాజాలోని మీడియా కార్మికులపై ఇజ్రాయెల్ దాడులను వెంటనే నిలిపివేయాలని ప్రధాన ఫ్రెంచ్ జర్నలిస్టుల సంఘాలు పిలుపునిచ్చాయి. అంతర్జాతీయ జర్నలిస్టులకు ఆ ప్రాంతంలోకి ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశాయి.

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధంలో మరణించిన పాలస్తీనియన్ల స్మరిస్తూ, గాజాలో శాంతిని నెలకొల్పాలని పారిస్‌లోని ఐఫెల్ టవర్‌పై నినాదాలు చేశారు. గాజాలో కాల్పుల విరమణ, శాంతిని కోరుతూ వారు ప్లేకార్డులతో నినాదాలు చేశారు.

## ముడా కేసులో సిద్ధరామయ్యకు, భార్యకు కర్నాటక హైకోర్టు నోటీసు

ముడా స్థలం కేటాయింపు కేసు దర్యాప్తును సిబిఐకి బదలీ చేయాలనే ఆదేశాన్ని కోరుతూ ఆర్‌టిఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, ఆయన భార్యకు, ఇతరులకు కర్నాటక హైకోర్టు బుధవారం నోటీసు జారీ చేసింది. మైసూరు పట్టణ అభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) సిద్ధరామయ్య భార్య పార్వతి బిఎంకు 14 స్థలాలు కేటాయించడంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలను ఆయన ఎదుర్కొంటున్నారు. సదరు కుంభకోణంపై లోకాయుక్త పోలీసుల దర్యాప్తును సిబిఐకి బదలీ చేయాలనే పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ ఫిబ్రవరి 7న జారీ చేసిన ఉత్తర్వును అప్పీల్ సవాల్ చేస్తున్నది. ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి అంజారియా, న్యాయమూర్తి కెవి అరవింద్‌తో కూడిన ధర్మాసనం నోటీసుకు ఈ నెల 28లోగా స్పందించాలని ఆదేశించారు.

'ప్రతివాదులు 28 లోగా స్పందించేలా నోటీసు పంపాలి. సదరు వివాదానికి సంబంధించిన అప్పీళ్లను ఆ రోజు విచారణ చేయవలసి ఉందని పేర్కొన్నారు' అని బెంచ్ తెలిపింది. అసలు పిటిషన్‌ను ఈ ఏడాది మొదట్లో తిరస్కరించారు. లోకాయుక్త దర్యాప్తు ఎటువంటి పక్షపాతాన్ని గాని, లోపాన్ని గాని ప్రదర్శించలేదని సింగిల్ జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

## మే 20న గ్రామీణ హర్తాళ్

న్యూఢిల్లీ: ఈ ఏడాది మే 20న గ్రామీణ హర్తాళ్ నిర్వహిస్తున్నట్లు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల వేదిక పిలుపు ఇచ్చింది. ఆ రోజున గ్రామీణ ప్రాంతాల్లోని పని ప్రదేశాల్లో అన్ని రకాల కార్యకలాపాలను బంద్ చేయాలని పేర్కొంది. బుధవారం నాడిక్కడ అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల వేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, బికెఎంయు నేతలు జిఎస్ గోరియా, విఎస్ నిర్మల్, ఎఐఆర్‌ఎల్‌ఎ నేత ప్రసేన్‌జిత్ కుమార్ పాల్గొన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల వేదిక పిలుపు ఇచ్చిన అఖిల భారత సమ్మెకు మద్దతు ఇవ్వాలని, గ్రామీణ కార్మికులు, పేదల డిమాండ్లపై గ్రామీణ బంద్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో తిరోగమన సంస్కరణలు, విధానాలను అమలు చేస్తుందని సమావేశంలో వ్యక్తలు విమర్శించారు. కోవిడ్ సమయంలో మూడు నల్ల వ్యవసాయ చట్టాలను అమలు చేయడానికి ప్రయత్నించిందని, వీటిని అఖిల వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల సమాఖ్య పెద్ద ఎత్తున తిరస్కరించడంతో మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఇది మొత్తం శ్రామిక ప్రజలపై బానిసత్వం లాంటి షరతులను విధిస్తుందని, ఈ కోడ్‌లతో పరిశ్రమల్లో, కార్పొరేట్ కార్యాలయాల్లోని కార్మికులకు దాదాపు అన్ని హక్కులు హరించబడతాయని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే, ఆహార సంక్షోభాన్ని తగ్గించడానికి, గ్రామీణ జీవనోపాధిని స్థిరీకరించడానికి, వేతనాలను పెంచడానికి ఎటువంటి ఖచ్చితమైన చర్యలను లేవని పేర్కొన్నారు. దేశ ఆహార భద్రతకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయ కార్మికులు ప్రభుత్వ విధాన ప్రాధాన్యతల్లో కనిపించకుండా ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ కేటాయింపులు అంతాంతమాత్రంగానే ఉన్నాయని అన్నారు. గ్రామీణ నిరుద్యోగం ఉందని, కూలి బకాయిలను చెల్లింపులను విస్మరిస్తున్నారని అన్నారు. ఈ విధానాలన్నీ గౌరవప్రదమైన పని హక్కును నిర్వీర్యం చేస్తాయని, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని అన్నారు. ఈ విధానాలు కేవలం కేంద్ర ప్రభుత్వం దగ్గరే ఆగిపోకుండా బిజెపి, బిజెపి భాగస్వామ్య రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా విస్తరించాయన్నారు.

## తదుపరి సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ బిఆర్ గవాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ గవాయ్ పేరును ప్రస్తుత సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫారసు చేశారు. మే 13న సిజెఐ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుంది. దీంతో 51వ సిజెఐగా జస్టిస్ గవాయ్ మే 14న బాధ్యతలు చేపడతారు. ఆయన సిజెఐగా 6 నెలలు పదవిలో ఉండనున్నారు. నవంబర్‌లో ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. కాగా, సిజెఐగా బాధ్యతలు నిర్వహించే రెండో దళిత వ్యక్తి జస్టిస్ గవాయ్. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. ఆయన 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. 1985 మార్చి 16న న్యాయవాద వృత్తిలో చేరారు. 1987 నుంచి 1990 వరకూ ముంబయి హైకోర్టులో ఆయన లా ప్రాక్టీస్ చేశారు. 1992లో నాగపూర్ బెంచ్ అసిస్టెంట్ గవర్నమెంట్ లాయర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులై 2005లో శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019లో ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

## భారత్ చైనా సంబంధాలు బలపడాలి



న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని సిపిఎం ప్రధాన కార్యాలయాన్ని చైనా రాయబారి జు ఫీహాంగ్, దౌత్యవేత్తలు జౌ గువోహురు, గువో డోంగ్‌డాంగ్ బుధవారం సందర్శించారు. సిపిఎం నూతన ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియా, చైనా మధ్య సంబంధాలు బలపడాలని సిపిఎం నేతలు, చైనా నేతలు అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య సత్సంబంధాలు బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పురాతన నాగరిత ఉన్న రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత పెరగాలన్నారు. ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జి జింగ్ పింగ్ మధ్య చర్చలు ఆహ్వానించదగినదని అన్నారు. రెండు దేశాల మధ్య, రెండు దేశాల ప్రభుత్వాల మధ్య, రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాల బలోపేతం అవసరమని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.అరుణ్ కుమార్ ఉన్నారు.

# చక్కని ఆరోగ్యం



## తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు.. ఇవి డైట్‌లో ఉండాల్సిందే..!

వేసవి కాలంలో పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. ఇవి చల్లదనాన్ని ఇచ్చే లక్షణాలు కలిగి ఉండటం వల్ల వేడిలో ఉపశమనం కలుగుతుంది. ఉల్లిపాయల్లో ఉండే పోషకాలు శక్తిని ఇస్తాయి, జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. వేసవిలో ఆరోగ్యంగా ఉండేందుకు ఇవి సహాయపడుతాయి. వేసవి కాలంలో పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీరానికి ఎన్నో రకాల ఉపయోగాలు కలుగుతాయి. ఉడికించకుండా తినడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఉల్లిపాయలు ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాల నిలయం లాంటివి. ప్రతి రోజూ కొంతమేర తినడం మంచిది. తక్కువ ధరలో ఎక్కువ లాభాలు అందించేవి. ఈ ఉల్లిపాయల్లో సల్ఫర్, ఫైబర్, పొటాషియం, కాల్షియం, విటమిన్ బి, విటమిన్ సి వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని ఇస్తాయి. శక్తి వృద్ధికి తోడ్పడతాయి. ఉల్లిపాయలు తినడం వల్ల రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి అని నిపుణులు చెబుతున్నారు. హృదయ ఆరోగ్యానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. ఆరోగ్యంగా ఉండాలంటే ఇది ఒక మంచి ఆహార పదార్థం. వేసవిలో ఎక్కువగా కనిపించే హీట్ స్ట్రోక్ సమస్య నుంచి ఉల్లిపాయలు రక్షిస్తాయని అంటారు. ఇవి శరీరాన్ని చల్లగా ఉంచే లక్షణాలు కలిగి ఉంటాయి. ఎండలో ఎక్కువ సమయం గడిపేవారు ఇవి తినడం వల్ల ఉపశమనం పొందవచ్చు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. ఎండలో నుంచి వచ్చే వేడిని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. వేసవిలో ఒత్తిడి తగ్గించేందుకు ఇది సహజ మార్గం. ఉల్లిపాయలు సహజ చల్లదనాన్ని కలిగిస్తాయి. వేసవిలో వీటిని తినడం వల్ల శరీరం లోపల నుంచే చల్లగా మారుతుంది. ఇది శరీరానికి తక్షణ ఉపశమనం ఇస్తుంది. ఉల్లిపాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను బాగా పనిచేసేలా చేస్తుంది. వేసవిలో తరచుగా వచ్చే కడుపు సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణక్రమం చక్కగా సాగుతుంది. ఉల్లిపాయలలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. విటమిన్ సి కూడా ఎక్కువగా ఉంటుంది. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. వ్యాధులు రాకుండా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పచ్చి ఉల్లిపాయలు తినడం మంచి అలవాటు. ఇది ప్రతి ఇంట్లో ఉండే సులభమైన ఆహారం అయినా.. దాని ప్రభావం మాత్రం గొప్పదే.

## రోజుకో అరటిపండు తింటే

### ఈ వ్యాధి నయమవుతుందా?



అధిక రక్తపోటు అనేది ఇప్పుడున్న అతిపెద్ద ఆరోగ్య సమస్యలలో ఒకటి. దీనిని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక నష్టాన్ని బీపీ ఉన్నవారు రోజుకు కనీసం ఒక అరటిపండు తినాలని ఎక్కువగా సిఫారసు చేస్తున్నారు. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ రీనల్ ఫిజియాలజీ ప్రచురించిన ఒక కొత్త అధ్యయనంలో అధిరోజుకో అరటిపండు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను కనుగొన్నారు. బీపీ పేషెంట్లు రోజుకు ఒక అరటిపండు తినాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ముఖ్యంగా రక్తపోటు సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరమని చెప్తున్నారు. రోడ్డు మీద ఎంతో చౌకగా దొరికే ఈ పండులో ఉండే గుణాలు ఎన్నో సమస్యలకు చెక్ పెడుతుందని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి. అరటిపండులో పొటాషియం అధికంగా ఉంటుంది. పొటాషియం అనేది రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషించే ఒక ముఖ్యమైన ఖనిజం. ఇది శరీరంలోని సోడియం ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది, తద్వారా ఆరోగ్యకరమైన రక్తనాళాల పనితీరును ప్రోత్సహిస్తుంది. అధిక రక్తపోటును కంట్రోల్ చేయడానికి డాక్టర్లు తరచుగా అరటిపండు వంటి పొటాషియం అధికంగా ఉండే ఆహారాలను సిఫార్సు చేస్తారు. అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో పాటు, సహజంగా సోడియం తక్కువగా ఉంటుంది. అధిక పొటాషియం తక్కువ సోడియం కలయిక ఆరోగ్యకరమైన రక్తపోటు స్థాయిలను నిర్వహించడానికి చాలా ప్రయోజనకరం. అధిక రక్తపోటు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారంలో సోడియం తగ్గించడం ఒక ముఖ్యమైన సూచన. అరటిపండులో కరిగే కరగని ఆహార ఫైబర్ బాగా ఉంటుంది. ఫైబర్ మొత్తం హృదయ సంబంధిత ఆరోగ్యానికి తోడ్పడుతుంది ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలు మరియు బరువు నిర్వహణకు మద్దతు ఇవ్వడం ద్వారా రక్తపోటును పరోక్షంగా నియంత్రించడంలో సహాయపడుతుంది. అరటిపండు సహజ చక్కెరల (ఫ్రక్టోజ్, గ్లూకోజ్ సుక్రోజ్) గొప్ప మూలం, ఇది తక్షణ మరియు నిలకడగా ఉండే శక్తిని అందిస్తుంది. ఇది అధిక సోడియం మరియు అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ప్రాసెస్ చేసిన స్నాక్స్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, ఇవి రక్తపోటును ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. అరటిపండు ఒక అనుకూలమైన బహుముఖమైన పండు, దీనిని రోజువారీ ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. వీటిని స్నాక్‌గా తినవచ్చు, స్మూతీలు, ఓట్‌మీల్, పెరుగులో కలపవచ్చు లేదా బేకింగ్‌లో ఉపయోగించవచ్చు. ఈ సౌలభ్యం కారణంగా ప్రజలు దీని ఆరోగ్య ప్రయోజనాలను క్రమం తప్పకుండా పొందడం సులభం అవుతుంది. అరటిపండు అధిక పొటాషియం తక్కువ సోడియం కలిగి ఉండటం వల్ల, అలాగే ఫైబర్ శక్తి మంచి మూలం కావడం వల్ల ఒక ప్రయోజనకరమైన సూపర్ ఫ్రూట్ అని, ముఖ్యంగా రక్తపోటును నియంత్రించే వారికి ఇది చాలా మంచిదని నిపుణులు చెప్తున్నారు. గుండె ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా రోజుకు కనీసం ఒక అరటిపండు తినాలని సూచిస్తున్నారు.

## వెయిట్ చెక్ చేసుకోవడానికి

### కరెక్ట్ టైమ్ ఎప్పుడో తెలుసా..?



ప్రతి రోజూ బరువు చూస్తే కరెక్ట్ గా చూపెట్టకపోవచ్చు. నిజమైన బరువును తెలుసుకోవాలంటే సరైన సమయం లోనే చూడాలి. ఉదయం ఖాళీ కడుపుతో చూసినప్పుడు కరెక్ట్ ఫలితం తెలుస్తుంది. పీరియడ్స్ ముందు, మలబద్ధకం ఉన్నపుడు, తిన్న వెంటనే బరువు చూడకూడదు. కారణాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రస్తుతం మనం తీసుకునే ఆహారం, జీవనశైలి కారణంగా శరీర బరువు పెరగడం, తగ్గడం సహజం. అయితే శరీర బరువును తెలుసుకోవడం ద్వారా ఆరోగ్యంపై దృష్టిపెట్టే అవకాశం ఏర్పడుతుంది. కానీ ప్రతి రోజు బరువు చూసే తప్పు చాలా మంది చేస్తుంటారు. నిజంగా శరీర బరువు తెలుసుకోవాలంటే సరైన సమయం, సరైన విధానం పాటించడం ముఖ్యం. అప్పుడు మాత్రమే అసలైన ఫలితం తెలుస్తుంది. ప్రతి రోజు బరువు చెక్ చేయడం వల్ల మనలో అసహనం పెరగచ్చు. రోజు రోజుకు శరీరంలో ఉండే నీటి శాతం, తిన్న ఆహారం మీద ఆధారపడి బరువులో తేడాలు వస్తుంటాయి. అందుకే నిపుణుల సూచన ప్రకారం వారానికి ఒక్కసారి మాత్రమే బరువు చూసుకోవడం ఉత్తమం. ఉదయం లేచి ఏం తినకముందే బరువు చూసే అలవాటు పెంచుకోవాలి.

ఎందుకంటే నిద్ర లేచిన వెంటనే శరీరంలోని నీటి శాతం స్థిరంగా ఉండటంతో ఆ సమయంలో తీసుకునే బరువు చాలా సమర్థవంతంగా ఉంటుంది. ఇది నిజమైన బరువును సూచిస్తుంది. మహిళలు పీరియడ్స్ రాక ముందు బరువు చూసినప్పుడు నిజమైన బరువు కంటే కొంచెం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఆ సమయంలో శరీరంలో హార్మోన్ల మార్పుల వల్ల నీరు ఎక్కువగా నిలిచిపోతుంది. దీంతో కడుపు ఉబ్బినట్టు అనిపించవచ్చు, బరువు పెరిగినట్టు కూడా అనిపిస్తుంది. కానీ ఇది తాత్కాలికం మాత్రమే. అందుకే పీరియడ్స్‌కు ముందు బరువు చూసి బరువు పెరిగారని బాధపడకండి. ఆ సమయంలో చూడకుండా తర్వాత చూడటం మంచిది. మలబద్ధకం సమస్యతో బాధపడుతున్నపుడు బరువు చూసినా అది అసలైన బరువు కాకపోవచ్చు. శరీరంలో వ్యర్థాలు సరిగ్గా బయటపడకపోవడం వల్ల బరువు ఎక్కువగా చూపించవచ్చు. కాబట్టి ముందుగా ఫైబర్ ఉన్న ఆహారం తినండి, నీటిని ఎక్కువగా తాగండి. తర్వాత బరువు చెక్ చేయండి. చాలా మందికి రాత్రి పడుకునే ముందు బరువు చూడడం ఓ అలవాటుగా ఉంటుంది. అయితే ఇది సరైన పద్ధతి కాదు. ఎందుకంటే అప్పటి వరకూ మనం తిన్న ఆహారం పూర్తిగా జీర్ణం కాలేదు కాబట్టి బరువు అసలైనదిగా కనిపించదు. ఫలితంగా ఎక్కువగా ఉందని అనిపించవచ్చు. అందుకే బరువు చూడటానికి రాత్రి సమయం సరైనది కాదు. కొంతమందికి తిన్న వెంటనే బరువు చూడడం అలవాటు. కానీ అది అసలైన బరువు చూపించదు. ఎందుకంటే తిన్న ఆహారం ఇంకా పూర్తిగా జీర్ణం కాలేదు. అందుకే భోజనం చేసిన తర్వాత కనీసం 12 నుంచి 24 గంటలు గ్యాప్ ఇచ్చి బరువు చూడాలి. అప్పుడు మాత్రమే మీ నిజమైన శరీర బరువు ఎంత ఉందో స్పష్టంగా తెలుస్తుంది.

## ఈ పండు ఎక్కడ కనిపించినా వదలొద్దు..!



ఈ పండులోని ఫైబర్, ఫైటోకెమికల్స్ కడుపు, పెద్దపేగుల్లో క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. అంతేకాదు..కివీ పండులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి చాలా అవసరం. కివీ పండులోని విటమిన్ సి, ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆక్సిడేటివ్ నష్టం నుంచి రక్షించి యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. పండ్లు ఆరోగ్యానికి చాలా మంచిది. మంచి ఆరోగ్యం కోసం రోజుకో పండు తినమని వైద్యులు చెబుతుంటారు.

మార్కెట్లో మనకు అనేక రకాల పండ్లు అందుబాటులో ఉంటాయి. వాటిలో కొన్ని మన దేశవాలీ పండ్లు కాగా, మరికొన్ని విదేశీ పండ్లు ఉంటాయి. అలాంటి పండ్లలో కివీ కూడా ఒకటి. ఖరీదులో కాస్త ధర ఎక్కువగా ఉంటుంది. కానీ, ఈ పండులో అనేక పోషకాలు నిండి ఉన్నాయి. ముఖ్యంగా విటమిన్ సి అధికంగా ఉండే కివీ పండు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. రోజుకో కివీ పండు తినటం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ఇకపై అస్సలు వదిలిపెట్టారు..


శరీరంలోని ప్రోటీన్ల జీర్ణక్రియకు సహాయపడే ఎంజైమ్ కివీలో ఉంటుంది. ఇది దీర్ఘకాలిక మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. కివీ పండులోని ఫైబర్, ఫైటోకెమికల్స్ కడుపు, పెద్దపేగుల్లో క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. అంతేకాదు..కివీ పండులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి చాలా అవసరం. కివీ పండులోని విటమిన్ సి, ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆక్సిడేటివ్ నష్టం నుంచి రక్షించి యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. కివీ పండులో ల్యూటిన్, జియాక్సంతిన్ ఉంటాయి. ఇవి వయసు సంబంధిత మాక్యులర్ డిజెనరేషన్ నుంచి రక్షించి, దృష్టిని మెరుగుపరుస్తాయి. కివీ పండులోని ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కివీ పండులో కేలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కివీ పండులోని విటమిన్ కె ఎముకలను ఆరోగ్యంగా ఉంచి, ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

## ప్రతిరోజూ గుప్పెడు పల్లీలు ఇలా తింటే.. పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు..



అధిక పనిభారం వల్ల చాలామంది వెన్నునొప్పితో బాధపడుతుంటారు. రోజంతా కూర్చోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. అలాంటి వారు రోజూ నానబెట్టిన పల్లీలను బెల్లంతో కలిపి తింటే ప్రయోజనం చేకూరుతుంది. వేరుశనగల్లోని విటమిన్లు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. ఉదయాన్నే నానబెట్టిన పల్లీలు తినడం వల్ల పిల్లలు, పెద్దల్లో మెదడు పనితీరు మెరుగుపడుతుంది. పల్లీలు వీటిని వేరు శనగలు అని కూడా అంటారు. ఇవి చాలా మంచి స్నాక్ ఐటమ్.. సాధారణంగా చాలా మంది పల్లీలను ఇష్టంగా తింటారు. ఇందుల్లో లిపిడ్లు, ఫాస్పరస్, ప్రోటీన్స్, విటమిన్స్, ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. అందుకే పల్లీలు కేవలం టైమ్‌పాస్ స్నాక్ మాత్రమే కాదు.. మంచి పోషకాహారం కూడా అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పల్లీలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు. అయితే ఈ పల్లీలను నానబెట్టి ప్రతిరోజూ ఉదయం తినడం వల్ల రెట్టింపు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. శరీరానికి కావాల్సిన శక్తిని అందించడానికి నానబెట్టిన పల్లీలు తినడం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పల్లీల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని నానబెట్టి తినడం వల్ల జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. నానబెట్టిన పల్లీలు ప్రతిరోజూ ఉదయం తినడం వల్ల గ్యాస్, ఎసిటిడీ తగ్గుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండే పల్లీలు తింటే టైప్ 2 డయాబెటిస్ రిస్క్ తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన పల్లీలను మితంగా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న పల్లీలు గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఫైబర్ ఉన్న పల్లీలు తింటే కడుపు నిండిన భావన కలిగి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ ఉన్న పల్లీలు చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. వేరు శనగల్లో ప్రోటీన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కండరాల దృఢత్వానికి సహాయపడతాయి. నానబెట్టిన పల్లీలు తినడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. నానబెట్టిన పల్లీల్లో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ప్రాణాంతక క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకుంటాయి. పల్లీల్లోని ఐరన్, ఫోలెట్స్, కాల్షియం, జింక్ క్యాన్సర్ కణాల పెరుగుదలను మందగింపజేస్తాయి. అధిక పనిభారం వల్ల చాలామంది వెన్నునొప్పితో బాధపడుతుంటారు. రోజంతా కూర్చోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. అలాంటి వారు రోజూ నానబెట్టిన పల్లీలను బెల్లంతో కలిపి తింటే ప్రయోజనం చేకూరుతుంది. వేరుశనగల్లోని విటమిన్లు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. ఉదయాన్నే నానబెట్టిన పల్లీలు తినడం వల్ల పిల్లలు, పెద్దల్లో మెదడు పనితీరు మెరుగుపడుతుంది.

## వైట్ హెడ్స్‌తో ఇబ్బందిపడుతున్నారా..?



ముక్కు మీద, చుట్టూ పేరుకుపోయిన వైట్ హెడ్స్, బ్లాక్ హెడ్స్‌ని తొలగించుకోవడానికి చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, వాటితో పెద్దగా ప్రయోజనం ఉండకపోగా, సైడ్‌ఎఫెక్ట్స్ ఎక్కువగా వస్తుంటాయి. కానీ, కొన్ని ఇంటి నివారణలను ఉపయోగించి వైట్ హెడ్స్ ను పూర్తిగా తొలగించవచ్చు అంటున్నారు నిపుణులు. చాలా మందికి ముఖం మీద చిన్న చిన్న రంధ్రాలు ఉంటాయి. చనిపోయిన చర్మ కణాలు, దుమ్ము ఆ రంధ్రాలలో చిక్కుకున్నప్పుడు ముఖంపై ఇలా ఏర్పాడుతుంది. ముక్కు చుట్టూ ఉన్న సేబాషియస్ గ్రంథుల పెరుగుదల వల్ల కూడా ఇలా అవుతుంది. అయితే, ముక్కు మీద, చుట్టూ పేరుకుపోయిన వైట్ హెడ్స్, బ్లాక్ హెడ్స్‌ని తొలగించుకోవడానికి చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, వాటితో పెద్దగా ప్రయోజనం ఉండకపోగా, సైడ్‌ఎఫెక్ట్స్ ఎక్కువగా వస్తుంటాయి. కానీ, కొన్ని ఇంటి నివారణలను ఉపయోగించి వైట్ హెడ్స్ ను పూర్తిగా తొలగించవచ్చు అంటున్నారు నిపుణులు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం. ఇందుకోసం కావలసిన పదార్థాలు..1 టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, 1 టేబుల్ స్పూన్ తేనె, 1 టేబుల్ స్పూన్ నిమ్మరసం తీసుకోవాలి. బేకింగ్ సోడా, తేనె, నిమ్మరసం కలిపి చిక్కటి మిశ్రమాన్ని తయారు చేసుకోవాలి. దాంతో ముక్కు చుట్టూ రాయండి. తర్వాత సున్నితంగా మసాజ్ చేసి 10 నుండి 15 నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగేస్తే చాలు. ఇక్కడ మనం ఉపయోగించే బేకింగ్ సోడా ఒక ఎక్స్‌ఫోలియేటర్‌గా పనిచేస్తుంది. చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సహాయపడుతుంది. తేనె సహజ యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది చర్మాన్ని తాజాగా ఉంచడంలో సహాయపడుతుంది. మొటిమలను తగ్గిస్తుంది. నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మంపై అదనపు నూనెను తగ్గించడంలో సహాయపడుతుంది. తెల్లమచ్చలను తగ్గిస్తుంది.



# సినిమా



## తెలుగు ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే

ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్సే లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందస మేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్ తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. దీంతో ఇప్పుడు మే 1న రిలీజ్ కాబోతున్న సూర్య రెట్రో సినిమాపై బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. పూజా రెట్రో చిత్రంతో పాటు విజయ్‌తో జన నాయగన్ చిత్రంలో నటిస్తుంది. –కాంచన 4 లోనూ నటిస్తుంది. మరోవైపు – కూలీలో స్పెషల్ సాంగ్ చేసింది. అలాగే ఓ హిందీ మూవీలో కూడా నటిస్తుంది. ఇప్పుడు పూజా చేతిలో చాలానే సినిమాలు ఉన్నాయి. అయితే మే 1 రిలీజ్ కాబోతున్న రెట్రో మీద చాలా ఆశలు పెట్టేసుకుంది. ఈ సందర్భంగా టీమ్ లో అందరికంటే ముందుగా తెలుగు ప్రమోషన్లు మొదలుపెట్టింది బుట్టబొమ్మ. ఈ క్రమంలో పూజా హెగ్డేకి టాలీవుడ్‌లో ఎప్పుడు సినిమా చేయబోతున్నారన్న ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానంగా అల వైకుంఠపురములో సినిమాలో చెప్పినట్లుగా నేను గ్యాప్ తీసుకోలేదు.. వచ్చింది. నేను ఏదైనా డిఫరెంట్ గా, కొత్తగా చేయాలని అనుకుంటున్నా. చాలా కథలు విన్నాను కానీ.. ఇప్పటివరకూ నాకు ఏదీ అంతగా కనెక్ట్ కాలేదు. ఈసారి నేను చేసే సినిమా తప్పకుండా బాగుండాలని, వైవిధ్యంగా ఉండాలని అనుకుంటున్నాను అని పేర్కొంది. అయితే త్వరలో పూజా ప్రేమ కథా చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించనుంది. తెలుగు ప్రేక్షకులు తనను ఎంతో ఆదరించారని, హైదరాబాద్ ని సొంత ఇల్లులా ఫీలవుతానని కూడా చెప్పుకొచ్చింది. మూడేళ్ల తర్వాత పూజా తెలుగు ప్రేక్షకులని పలకరించనుందని తెలిసి ఫ్యాన్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు.



## పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో రాధికా ఆప్టే

టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది. ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా తెలియాల్సి ఉంది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం. 2012లో ధోని చిత్రంతో తమిళంలోకి అడుగుపెట్టిన రాధికా ఆప్టే ఆ తర్వాత కబాలి, బాలకృష్ణ లెజెండ్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది.





## బ్లాక్ బస్టర్ సినిమాకు రూ.1 రెమ్యునరేషన్ తీసుకున్న మనోజ్ బాజ్‌పాయ్

అగ్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఆల్ టైం క్లాసిక్ చిత్రాలలో సత్య ఒకటి. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి, మనోజ్ బాజ్‌పాయ్ కథానాయకులుగా నటించగా– ఊర్మిళ మతోండ్కర్, షెఫాలీ షా హీరోయిన్‌లుగా నటించారు. ముంబై మాఫియా గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 1998లో జులై 3న విడుదలై సంచలన విజయం అందుకుంది. అప్పటివరకు మూసధోరణి కథలతో నెట్టుకోస్తున్న బాలీవుడ్‌కి అసలైన సినిమాను పరిచయం చేసింది. అంతేకాకుండా ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులను సొంతం చేసుకుని సత్తా చాటింది. ఉత్తమ సహాయ నటుడిగా మనోజ్ బాజ్‌పాయ్ జాతీయ అవార్డును గెలుచుకున్నారు. అయితే తన కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచిన సత్య సినిమాకు మనోజ్‌కేవలం ఆర్జీవీ నుంచి రూ.1 మాత్రమే పారితోషికంగా తీసుకున్నాడంట.. ఈ విషయాన్ని ప్రముఖ దర్శకుడు, నిర్మాత హన్సల్ మెహతా ఒక ఇంటర్వ్యూలో చెప్పుకోచ్చాడు.



## 'స్పిరిట్' సెట్స్‌లోకి ప్రభాస్ అడుగుపెట్టేది అప్పుడే.!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది ఈ చిత్రం అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఏడాది చివరిలో 'స్పిరిట్' సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాతే సందీప్ రెడ్డి స్పిరిట్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. స్పిరిట్ షూటింగ్ మొత్తం 120 రోజులకు పైగా జరగనుందని, అందులో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని సమాచారం. ఈ సినిమా కోసం ప్రభాస్ జిమ్‌లో తీవ్రంగా వర్కవుట్ చేస్తూ కొత్త లుక్‌ను సిద్ధం చేస్తున్నారట. ఇప్పటివరకూ చూడని ప్రత్యేకమైన లుక్‌లో ఆయన ఈ చిత్రంలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు.



## శ్రీలీలతో స్టెప్పులు.. అతని జన్మ ధన్యమైందంటున్న నెటిజన్స్!

టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తోన్న హీరోయిన్ శ్రీలీల. ఇటీవల నితిన్ సరసన రాబిన్‌హుడ్ చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. వెంకీ కుడుముల డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఊహించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే శ్రీలీల ప్రస్తుతం మాస్ మహారాజా రవితేజతో రెండోసారి జతకట్టింది. మాస్ జాతర పేరుతో వస్తోన్న మూవీలో హీరోయిన్‌గా కనిపించనుంది. గతంలో ధమాకా చిత్రంలో రవితేజ సరసన శ్రీలీల నటించిన సంగతి తెలిసిందే. అయితే శ్రీలీల డ్యాన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పుష్ప-2 కిస్సిక్ సాంగ్‌తో అభిమానులను ఓ ఊపు ఊపేసింది. హీరోలతో పోటీ పడి మరి తన స్టెప్పులతో అదరగొడుతుంది. శ్రీలీలతో డ్యాన్స్ చేయడమంటే మామూలు ఎనర్జీ సరిపోదు అనేలా స్టెప్పులతో ఆలరిస్తుంది. అలా సరదాగా స్టెప్పులతో అదరగొట్టిన ఈ ముద్దుగుమ్మ డ్యాన్స్ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ?అదేంటో చూసేయండి. అయితే తాను సరదాగా డ్యాన్స్ చేసిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఓ ఈవెంట్‌కు వెళ్లిన ముద్దుగుమ్మ బయటికి వస్తున్న సమయంలో అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డ్‌తో ఓ బాలీవుడ్ పాటకు కాలు కదిపింది. దీనికి సంబంధించిన వీడియోను ఓ నెటిజన్స్ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. శ్రీలీలతో డ్యాన్స్ చేయడం అతని జీవితంలో మరిచిపోలేడని రాసుకొచ్చింది. ఈ క్షణాలు అతని జీవితాంతం గుర్తు పెట్టుకుంటాడని పోస్ట్ చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. ఇక శ్రీలీల సినీ కెరీర్ విషయానికొస్తే.. కన్నడ చిత్రం కిస్ (2019)తో శ్రీలీల మరపురాని అరంగేట్రం చేసింది. పెళ్లి సందడి (2021)లో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల.. భగవంత్ కేసరి (2023), స్కంద (2023), ఆదికేశవ (2023), గుంటూరు కారం (2024) చిత్రాల జయాపజయాలతో సంబంధం లేకుండా వరుసపెట్టి సినిమాలు చేస్తోంది.



# ట్రంప్ ఎఫెక్ట్...
# మేకిన్ ఇండియాకు లైఫ్

**ముంబై :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌విధిస్తున్న కొత్త సుంకాలతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా కుప్ప కూలే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల అమలును మూడు నెలలు వాయిదా వేశారు. అయితే చైనాపై మాత్రం సుంకాలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇదే ఇప్పుడు భారత తయారీ రంగానికి బూస్ట్‌గా మారింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త సుంకాలు (టారిఫ్‌లు) చైనా ఉత్పత్తులపై భారీగా ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత తయారీ రంగానికి అనూహ్యమైన అవకాశాలు ఏర్పడుతున్నాయి. చైనాపై అధిక సుంకాలతో పోలిస్తే, భారత్‌పై సాపేక్షంగా తక్కువ సుంకాలు విధించడం ద్వారా భారత్‌కు ట్రంప్ ఒక రకంగా గొప్ప రాజకీయ, ఆర్థిక అవకాశాన్ని అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని భారత్‌సద్వినియోగం చేసుకుంటే, తయారీ రంగంలో చైనాకు గట్టి పోటీ ఇచ్చే స్థాయికి చేరే అవకాశం ఉంది.ఇటీవల ఒకే రోజు మూడు కార్గో విమానాలు భారత్‌లో తయారైన ఐఫోన్‌లతో అమెరికాకు బయలుదేరిన వార్త దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించింది. ట్రంప్ కొత్త సుంకాలు అమల్లోకి రాకముందే ఈ ఉత్పత్తులను అమెరికాకు చేర్చేందుకు ఆపిల్ సంస్థ వేగంగా వ్యవహరించింది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఐఫోన్‌ల తయారీని ఆపిల్ విస్తరిస్తోంది. ప్రస్తుతం, ఆపిల్ ఉత్పత్తిలో 10?15% భారత్‌లో జరుగుతోంది, మరియు దీనిని 2025 నాటికి 25%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.చైనాపై 104% సుంకాలు విధించిన ట్రంప్, భారత్‌పై కేవలం 26% సుంకాలు నిర్ణయించారు. దీనివల్ల చైనాలో తయారైన ఐఫోన్‌లతో పోలిస్తే, భారత్‌లో ఉత్పత్తి చేసిన ఐఫోన్‌లు అమెరికా మార్కెట్‌లో ధర పరంగా గణనీయంగా పోటీదారుగా నిలుస్తాయి. ఒక ఐఫోన్ తయారీ ఖర్చు 450 డాలర్లు అనుకుంటే, చైనాలో ఉత్పత్తి చేస్తే సుంకాలతో కలిపి అమెరికాలో దాని ధర 918 డాలర్లకు చేరుతుంది, అయితే భారత్‌లో తయారైనది కేవలం 567 డాలర్లకే అందుబాటులో ఉంటుంది. ఈ ధరల వ్యత్యాసం ఆపిల్‌ను భారత్‌లో ఉత్పత్తిని విస్తరించేలా ప్రోత్సహిస్తోంది.చైనా?అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు అధిక సుంకాలు విధిస్తూ, వాణిజ్య ఆంక్షలను కఠినతరం చేస్తున్నాయి. ఈ పరిస్థితి చైనా ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో డిమాండ్‌ను గణనీయంగా తగ్గిస్తోంది. ఈ ఖాళీని భర్తీ చేయడానికి భారత్ అనువైన గమ్యస్థానంగా మారుతోంది.కరోనా మహమ్మారి తర్వాత, చైనాపై



ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు 'చైనా+1' వ్యూహాన్ని అనుసరించాయి. ఈ వ్యూహంలో భాగంగా, భారత్‌లో తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపాయి. అయితే, ఊహించిన స్థాయిలో ఈ అవకాశాలను భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయిందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పుడు, ట్రంప్ సుంకాల విధానం ద్వారా భారత్‌కు కొత్త అవకాశాలు తలుపులు తెరుస్తోంది. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ భాగాలు, మరియు ఇతర తయారీ రంగాల్లో భారత్ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ట్రంప్ సుంకాలు భారత్‌కు అవకాశాలను తెచ్చిపెట్టినప్పటికీ, కొన్ని సవాళ్లు కూడా ఎదురవుతాయి. భారత్‌పై విధించిన 26% సుంకాలు, చైనాతో పోలిస్తే తక్కువైనప్పటికీ, ఇతర ఆసియా దేశాలైన జపాన్(24%) మరియు దక్షిణ కొరియా (25%)తో పోలిస్తే ఇది ఎక్కువే. ఈ సుంకాలు భారత ఎగుమతులపై కొంత ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఆభరణాలు, మరియు ఇంజనీరింగ్ వస్తువుల వంటి రంగాల్లో. అయినప్పటికీ, భారత్‌కు ప్రస్తుతం ఉన్న సాపేక్ష ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కొన్ని కీలక చర్యలు అవసరం.
మౌలిక సదుపాయాల అభివృద్ధి: తయారీ కేంద్రాల స్థాపనకు అనువైన లాజిస్టిక్స్, విద్యుత్ సరఫరా, మరియు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలి.
వ్యాపార సౌలభ్యం: విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బిజినెస్ ఈజ్ ఆఫ్ డూయింగ్‌ను మెరుగుపరచడం ద్వారా, అడ్మినిస్ట్రేటివ్ ఆటంకాలను తగ్గించాలి.
ప్రోత్సాహకాల విస్తరణ: ప్రస్తుతం ఉన్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాలను మరింత విస్తరించి, ఎక్కువ రంగాలను చేర్చాలి.
**నైపుణ్య శిక్షణ:** తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణా కార్యక్రమాలను బలోపేతం చేయాలి.
భారత ప్రభుత్వం చొరవ: ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భారత ప్రభుత్వం చొరవ కీలక పాత్ర పోషిస్తుంది. గతంలో చైనా+1 వ్యూహంలో భాగంగా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోయిన నేపథ్యంలో, ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయడం, విదేశీ సంస్థలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను అందించడం, మరియు దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలు అత్యవసరం. అదే సమయంలో, చైనా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకునే సంస్థలు, దీర్ఘకాలికంగా ఇక్కడే పెట్టుబడులు పెట్టేలా చూడాలి. ఇందుకోసం, భారత్ తన ఆర్థిక విధానాలలో స్థిరత్వాన్ని కొనసాగించాలి. తద్వారా భారత్ తయారీ రంగంలో కొత్త శకాన్ని ప్రారంభించవచ్చు.

# వక్ఫ్ చట్టంపై మధ్యంతర ఉత్తర్వులు ఇస్తాం

కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ ప్రారంభించింది. అయితే, వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు నిరాకరించిన ధర్మాసనం.. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వక్ఫ్ ఆస్తులపై వివాదంపై కలెక్టర్లకు అధికారాలు, కోర్టులు వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను డీ నోటిఫై చేయడం తదితర కీలక నిబంధనలపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. ఈ సందర్భంగా కేంద్రం ప్రభుత్వంతో పాటు ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ చేస్తూ విచారణను గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణ వాయిదా వేసింది. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ కన్నా, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశించింది. ఈ వివాదంపై దాఖలైన పలు పిటిషన్లపై రేపు మధ్యంతర తీర్పును ఇవ్వనున్నట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరుపుతూ.. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వక్ఫ్ బోర్డులో తరహాలో ముస్లింలను హిందూ ట్రస్ట్‌లో భాగం చేయడానికి అనుమతించడానికి సిద్ధంగా ఉన్నారా? అని కేంద్రాన్ని నిలదీసింది. వందల ఏళ్ల నాటి వక్ఫ్ ఆస్తులకు ఇప్పుడు పత్రాలు ఎక్కడి నుంచి



వస్తాయని ప్రశ్నించింది. సుదీర్ఘకాలంగా ముస్లిం కార్యక్రమాలకు వాడుతున్న (వక్ఫ్ బై యూజర్) ఆస్తులను డినోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయని పేర్కొంది. వక్ఫ్ బై యూజర్ ఆస్తులను రిజిస్టర్ చేయడం కష్టమని.. ఇది పలుమార్లు దుర్వినియోగమైందని ధర్మాసనం పేర్కొంది. నిజంగా ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ఆస్తులు ఉన్నాయని.. హిందువుల ఆస్తులను హిందువులే నిర్వహిస్తున్నారు కదా? అని ప్రశ్నించింది. పార్లమెంటుకు చట్టాలు చేసే అధికారం లేదా? హిందువుల కోసం కూడా పార్లమెంట్ చట్టాలు చేస్తుంది కదా? ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలోనే ఉందని అంటున్నారని.. చారిత్రక, పురావస్తు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించడానికి వీలు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. వక్ఫ్ చట్టంలోని అభ్యంతరాలను ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చిన ఆయన.. వక్ఫ్ కొత్త చట్టంలోని అనేక నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ను ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. కొత్త చట్టం ప్రకారం.. కలెక్టర్‌కు ఇచ్చే అధికారాలను సిబల్ ప్రస్తావించారు. కలెక్టర్ ప్రభుత్వంలో ఒక భాగమని, ఆయన న్యాయమూర్తి పాత్ర పోషిస్తే అది రాజ్యాంగ విరుద్ధమేనన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చే నిబంధనను కోర్టుకు దృష్టికి తీసుకొచ్చారు. ముస్లింల హక్కులను కాలరాసేలా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టారన్నారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతోన్న ఆందోళనల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడం బాధకరమని, హింసాత్మక ఘటనలు తమను తీవ్రంగా బాధించాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు చేస్తూ.. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. చట్టంపై స్టే విధించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జేపీసీ ద్వారా సంపూర్ణంగా అన్నివర్గాలతో చర్చలు జరిపామని చెప్పారు. వక్ఫ్ అనేది కేవలం చారిటీకి సంబంధించిదేనని.. హిందూ ధార్మిక సంస్థలను సైతం ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.

## రెండు రకాల గుర్రాలు..
# గుజరాత్‌లో కాంగ్రెస్ వ్యూహంపై రాహుల్

**మోడాసా:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, బీజేపీని ఓడించగలిగే సత్తా ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ నైతికస్థైర్యం కోల్పోయినట్టు కనిపిస్తున్నప్పటికీ రాష్ట్రంలో వాళ్లను (బీజేపీ) ఓడిస్తామని పార్టీ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. పార్టీలోని అంతర్గత సవాళ్లను పరిష్కరించేందుకు రాష్ట్రంలో కొత్త నాయకత్వాన్ని పరిచయం చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో రెండ్రోజుల పర్యటనకు బుధవారంనాడిక్కడ వచ్చిన రాహుల్ గాంధీ మోడాసాలో జరిగిన కాంగ్రెస్ జిల్లా కార్యకర్తల సదస్సులో పాల్గొన్నారు. పార్టీ వ్యూహాలను వివరిస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గుజరాత్‌లో పార్టీని పునర్వవస్థీకరించేందుకు తీసుకుంటున్న చర్యలను రాహుల్ ప్రస్తావిస్తూ, దీనిపై చాలా నెలలుగా పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం పోరాటం కాదని, సైద్ధాంతిక పోరాటమని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీని ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఓడించగలదనే విషయం ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని తాము గుర్తించామని చెప్పారు. దీనిపై జిల్లాలకు చెందిన సీనియర్ నేతలను తాను కలుసుకున్నానని, చక్కటి చర్చలు జరిగాయని తెలిపారు. నాయకుల మధ్య పోటీ వినాశకరమని, నిర్మాణత్మకం కాదని నేతలు తనకు చెప్పారని అన్నారు.

**రెండు రకాల గుర్రాలు**

పార్టీలో నాయకత్వ సవాళ్లను గురించి మాట్లాడుతూ, గుర్రాలలో రెండు రకాలు ఉంటాయని, ఒకటి రేసులకు ఉద్దేశించినవని, రెండో రకం పెళ్లిళ్లకు ఉద్దేశించినవని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కొన్నిసార్లు వెడ్డింగ్ హార్స్‌లను రేసులకు, రేసింగ్ హార్స్‌లను పెళ్లిళ్లకు పంపుతున్నట్టు నాయకులు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. సరైన నేతలకు సరైన బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని రాహుల్ అన్నారు. "ఈ రెండు రకాల గుర్రాలను సెపరేట్ చేయాలి. జిల్లాలను స్థానికంగానే నడపడం వల్ల అభ్యర్థులకు, ఆర్గనైజేషన్‌కు మధ్య పటిష్ట బంధం ఉంటుందనే నిశ్చితాభిప్రాయానికి పార్టీ వచ్చింది" అని ఆయన వివరించారు. నాయకులు తన దృష్టికి తెచ్చిన విషయాలను రాహుల్ మరింత వివరిస్తూ, అహ్మదాబాద్ నుంచి సీనియర్ నాయకులు వచ్చి రెండు రోజులు హంగామా చేసి వెళ్లిపోతుంటారని, వాళ్లు వెళ్లిపోగానే జనం కూడా మాయమై పోతుంటారని, దీని వల్ల బూత్‌లు కూడా గెలుచుకోలేకున్నామని కొందరు చెప్పినట్టు తెలిపారు. మరో అంతర్గత అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. చాలా మంది పార్టీ నేతలకు బీజేపీతో సంబంధాలు ఉన్నాయని తెలుస్తోందని, అలాంటి వారిని గుర్తించి పార్టీకి దూరంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

### మే 1 నుంచి 15 బ్యాంకుల విలీనం




**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జమ్మూ మరియు కాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో దీని ప్రభావం కనిపించనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మే ఒకటి నుంచి ఒక రాష్ట్రం ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అనే విధానం అమలులోకి రానుంది. తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదన ప్రకారం 11 రాష్ట్రాలలో 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం కోసం ఒక నోటిఫికేషన్ను విడుదల చేసింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణలో ఈ విలీనం నాలుగవ దశ అని తెలుస్తుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా రీజినల్ రూరల్ బ్యాంక్ ల సంఖ్య 43 నుండి 28కి తగ్గనుందని తెలుస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో పాటు అనేక ప్రభుత్వ బ్యాంకులతో ఈ బ్యాంకులు అనుబంధంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇవి గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేస్తాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దీని ప్రభావం మొత్తం దేశంలోని 11 రాష్ట్రాలలో కనిపించబోతుంది. ప్రస్తుతం ఈ రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో ఒకే సంస్థగా త్వరలో విలీనం కానున్నాయి.ఈ విధంగా తాజాగా ప్రభుత్వం ఒక రాష్ట్రం ఒక రీజినల్ రూరల్ బ్యాంకు లక్ష్యాన్ని సాధించవచ్చు.వీటి విలీనం కోసం మే 1, 2025 గా నిర్ణయించడం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు స్పాన్సర్ చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అలాగే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విలీనం అయ్యి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మే 1 నుంచి ఏర్పడతాయి. అలాగే ఉత్తరప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాలలోని మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఒకే సంస్థగా విలీనం కాబోతున్నాయి.ఉత్తరప్రదేశ్లో ఉన్న బరోడా యూపీ బ్యాంకు, ఆర్య వర్క్ బ్యాంకు, ప్రథమ యుపి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఉత్తరప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా ఏర్పడనున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో దీని ప్రధాన కార్యాలయం లక్నోలో ఉంటుందని సమాచారం. అదేవిధంగా బంగీయ గ్రామీణ వికాస్ బ్యాంక్ మరియు పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంక్, ఉత్తర్బాంగ్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంకును పశ్చిమ బెంగాల్లో ఏర్పాటు చేయనున్నారు.

### గ్యాస్ సిలిండర్ పేలి
### నలుగురు చిన్నారులు దుర్మరణం



ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు పదేళ్లలోపు చిన్నారులు దుర్మరణం పాలైన ఘటన బీహార్ లోని ముజఫర్‌పూర్ జిల్లా లో బుధవారం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో వంట చేస్తూ తల్లి బయటికి వెళ్లిన సమయంలో మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలుడు సంభవించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వివరాల్లోకి వెళ్తే.. ముజఫర్‌పూర్ జిల్లాలోని బరియార్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల రాంపూర్‌మని గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో వంట చేస్తూ మిగతా వంటపాత్రలు కడిగేందుకు బయటికి వెళ్లింది. అదే సమయంలో స్టవ్ మంటలు సిలిండర్‌కు అంటుకుని పేలిపోయింది. దాంతో ఇంట్లో ఉన్న నలుగురు చిన్నారులు బ్యూటీ కుమారి (8), విపుల్ కుమార్ (5), సృష్టి కుమారి (4), హన్సిక కుమారి (3) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. కాగా ఈ పేలుడు ఘటనలో మరణించిన చిన్నారుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున మొత్తం 16 లక్షలు అందజేయనున్నట్లు ముజఫర్‌పూర్ జిల్లా కలెక్టర్ తెలిపారు.

### సీఎన్‌జీ ఆటోలపై నిషేధం!



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో సీఎన్‌జీ ఆటోలపై నిషేధం అంటూ జరుగుతున్న ప్రచారంపై ఢిల్లీ రవాణా శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ స్పష్టత నిచ్చారు. సీఎన్‌జీ ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలతో భర్తీ చేయనున్నారనే వార్తలను మంత్రి పంకజ్ కుమార్ సింగ్ కొట్టిపారేశారు. సీఎన్‌జీతో నడిచే ఆటోరిక్షాలపై నిషేధం విధిస్తామన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా ఢిల్లీ సర్కార్ పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఢిల్లీలో ఎలాంటి ఆటోలను తాము నిలిపివేయబోమని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందని.. దీనిని దృష్టిలో ఉంచుకుని అక్కడి ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకోబోతుందంటూ వార్తలు వచ్చాయి. త్వరలోనే 'ఈవీ పాలసీ 2.0'ను తీసుకురావడానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో సీఎన్‌జీ ఆటోలపై బ్యాన్ విధిస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. దీంతో రవాణా శాఖ మంత్రి స్పందిస్తూ సీఎన్‌జీ ఆటోలపై నిషేధం విధించబోమంటూ క్లారిటీ ఇచ్చేశారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621, Telefax. No. 040-27678676.